

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..



HYDERABAD | KARIMNAGAR | NIZAMABAD | NALGONDA | MAHABUBNAGAR | WARANGAL | KHAMMAM | AMARAVATHI | TIRUPATI | KURNOOL | TADEPALLIGUDEM | VISHAKAPATNAM | ANANTHAPURAM | KADAPA

హైదరాబాద్ | సంపుటి: 2 • సంచిక: 56 • పేజీలు:12+16 • వెల: రూ.5 | గురువారం • 25-1-2018 | www.manamnews.com | /manamnews



లాలూ, మిశ్రాలకు ఐదేళ్ల జైలు

మాజీ సీఎంలుసహా 50 మందిపై దోష నిర్ధారణ

పశుదాణా కుంభకోణంలో సీబీఐ కోర్టు తీర్పు

అవసరమైతే సుప్రీం కోర్టులో సవాలు: తేజస్వి

7లో..

ధర్.. అంతర్జాతీయ ఉగ్రవాది

భారత-బ్రిటిష్ పౌరుడు సిద్ధార్థ్‌పై అమెరికా ముద్ర

బందీల తలలు నరికే 'కొత్త జిహాదీ జాన్'గా పేరు



గర్భం వెలుపల పిండానికి ఆపరేషన్!

- 16 వారాలు గడిచాక స్కానింగ్
- గర్భస్రావం తప్పదన్న డాక్టర్లు
- 'నో' అన్న తల్లి.. శస్త్ర చికిత్సకు ఓకే
- కణితి తొలగింపు... మళ్లీ గర్భ ప్రవేశం
- నెలలు నిండి.. బిడ్డకు జన్మనిచ్చిన తల్లి
- వైద్యులకు వెల్లువెత్తుతున్న ప్రశంసలు



టెక్సాస్, జనవరి 24:

పుట్టిన కొద్ది రోజులకే శస్త్రచికిత్సలు జరిగాయని ఇప్పటివరకు మనం విన్నాం. కానీ బిడ్డ పుట్టకముందే... అంటే తల్లి కడుపులో ఉండగానే ఆపరేషన్ చేయడం ఇప్పటివరకు మీరెక్కడైనా విన్నారా? ఎక్కడో ఆఫ్రికా ఖండంలోని నైజీరియాలో పుట్టి, అమెరికాలోని టెక్సాస్‌లో పిల్లల శస్త్రచికిత్స నిపుణుడిగా సేవలందిస్తున్న డాక్టర్ ఒలుయింకా ఒలుటోయె, అతడి సహవైద్యుడు డాక్టర్ డారెల్ కాస్ ఈ అత్యంత అరుదైన ఘనత సాధించారు. గర్భం దాల్చిన 23.5 వారాల తర్వాత నిరుడు ఫిబ్రవరి ప్రాంతంలో తల్లి కడుపునుంచి పిండాన్ని బయటకు తీసి, ఈ శస్త్ర చికిత్స చేశారు. అటుపైన 12.5 వారాలకు నెలలు నిండిన తర్వాత జూన్‌లో ఆమెకు సిజేరియన్ ఆపరేషన్‌ద్వారా పండంటి బిడ్డ జన్మించింది. ఈ అరుదైన అద్భుతం ట్విట్టర్‌ద్వారా ప్రపంచానికి తెలిసింది. దీనికి ఇప్పటికి లక్షకు మిగతా 6లో..

అతడి పేరు శివ!

సెల్ఫీ మోజులో ప్రమాదం... ఆస్పత్రిపాలు

రైలుతో సెల్ఫీ సరే... ట్రాక్‌మీద ఆట తగదు





- చావుతప్పి కన్ను లొట్టబోయినంత పనైంది
- స్నేహితులు వారిస్తున్నా.. వినిపించుకోని వైనం
- ప్రపంచంలో అత్యధిక మరణాలు భారత్‌లోనే
- తెలుగు రాష్ట్రాల్లోనూ కొనసాగుతున్న ధోరణి
- సోషల్ మీడియాలో స్టార్ అయిపోవాలనే తపన
- లైకుల కోసమే యువత ప్రాణాంతక వీడియోలు

హైదరాబాద్, జనవరి 24:

అది హైదరాబాద్‌లో భరత్‌నగర్ ప్రాంతంలో గల రైల్వే ట్రాక్... వెనక నుంచి ఎంఎంటీఎస్ రైలు వస్తోంది. ట్రాక్‌కు కాస్త పక్కగా నిల్చున్న కుర్రాడు ఆ రైలు వస్తున్న దృశ్యంతో ఫోనులో సెల్ఫీ వీడియో తీసుకుంటున్నాడు. రైలు కాస్త దగ్గరగా రావడంతో దూరంగా ఉన్న మిత్రులు ''ఇక చాలు వచ్చెయ్యరా'' అని కేకలు పెట్టారు. కానీ, రైలు మరింత దగ్గరగా వచ్చేదాకా చిత్రీకరించి తన హీరోయిజాన్ని చాటే వీడియోను సోషల్ మీడియాలో పెట్టాలనుకున్నాడు. అందుకే ''పర్లేదు కాసేపు ఆగండ్రా'' అంటూ చేతిని పట్టాల మధ్యకు మరికాస్త సాచాడు. అంతలో దూసుకొచ్చిన రైలు ఒక్కసారిగా అతణ్ని ఢీకొట్టింది. ఆ దెబ్బకు మిగతా 6లో..



కృష్ణకుమారి కన్నుమూత

సినీ ప్రముఖుల దిగ్భ్రాంతి

బెంగళూరు, జనవరి 24:

నవ్వులో నవరత్నాలు, నడకలో వయ్యారాలు, నటలో నయగారాలు కురిపించిన నిన్నటి తరం నటి కృష్ణకుమారి కన్నుమూశారు. ఆమె వయసు 85 సంవత్సరాలు... రెండేళ్లుగా కేన్సర్‌తో బాధపడుతున్న ఆమె బుధవారం ఉదయం బెంగళూరులోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆమె మరణవార్తతో పలు భాషా చిత్రరంగాల ప్రముఖులు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. పశ్చిమబెంగాల్‌లో 1933 మార్చి 6న జన్మించిన ఆమె తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ సినిమాల్లో విభిన్న మిగతా 6లో..

ఇదీలోకం!



బ్లడ్ బ్యాంకుల నుంచి ఒకటే ఫోన్లు సార్.. మీకోసం..!

వైభవంగా 'మండ మెలిగే'

మేడారం జాతరకు ఆరంభంలో తొలి ఘట్టం

పవిత్ర జలంతో వనదేవతల గద్దెల శుద్ధి

సమ్మక్క, సారలమ్మ వద్దకు పగిడిద్దరాజు తరలింపు





ఏటూరునాగారం/తాడ్వాయి జనవరి 24 (మనం న్యూస్): సమ్మక్క-సారలమ్మ మహాజాతర తొలి ఘట్టంలో భాగంగా బుధవారం మేడారం, కన్నెపల్లి గ్రామాలలో 'మండ మేలిగే' పండుగ అత్యంత ఉత్సాహంగా జరిగింది. ఇందులో భాగంగా ఈ రెండు గ్రామాలలోని వనదేవతల గద్దెలను తెల్లవారుజామునే పవిత్ర జలంతో శుభ్రం చేసి పసుపుకుంకుమలతో అలంకరించారు. మామిడి తోరణాలను కట్టారు. గుడి ప్రాంగణాల్లోని గద్దెలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వనదేవతల గద్దెలతో పాటు గ్రామంలోని ఇతర ఆలయాలైన పోచమ్మ, పోతురాజు, ముత్యా లమ్మ, బొడ్రాయిలను కూడా పవిత్ర జలంతో శుద్ధి చేశారు. గిరిజన పూజారుల కుటుంబాలకు చెందిన మహిళలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. 'మండ మెలిగే' ఘట్టం ముగియడంతో గిరిజన పూజారులు పూర్తిస్థాయిలో అమ్మల సేవలోనే కొనసాగనున్నారు. ఈ ప్రధాన ఘట్టం నేపథ్యంలో రెండు గ్రామాల్లోనూ పండగ వాతావరణం నెలకొంది. కన్నెపల్లిలోని సమ్మక్క, సారలమ్మ ఆలయాలను కూడా శుద్ధి చేశారు. పూనుగండ్లి నుండి పగిడిద్ద రాజును మేడారం తరలించి సమ్మక్క గుడివద్ద గద్దెకు చేర్చారు. అనంతరం తులసీ దళాలతో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



పవన్ కల్యాణ్ కాన్వాయ్‌పై చెప్పు!

తల్లాడ ర్యాలీలో వ్యక్తి కలకలం

ఎంపీ అసదుద్దీన్‌పైకి బూటు

ముంబై సభలో చేదు అనుభవం

6లో..

వాతావరణం



తెలుగు రాష్ట్రాల్లో గురువారం పొడి వాతావరణం నెలకొంటుంది. పగటి ఉష్ణోగ్రతలో మార్పులేదు. రాత్రి ఉష్ణోగ్రత స్వల్పంగా తగ్గుతుంది. చలి తీవ్రత పెరుగుతుంది. గంటకు 8 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశం ఉంది.

గరిష్ఠ ఉష్ణోగ్రత: 31 డిగ్రీలు

కనిష్ఠ ఉష్ణోగ్రత: 14 డిగ్రీలు

గాలిలో తేమ: 44 శాతం

ముహూర్తం

శ్రీహేవిళంబి నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిరరుతువు, మాఘమాసం, శుక్లపక్షం, తిథి: అష్టమి మ.3.14 తదుపరి నవమి; నక్షత్రం: అశ్విని ఉ.8.19 తదుపరి భరణి; వర్జ్యం: ఉ.9.52 – 11.24; దుర్ముహూర్తం: మ.3.05 – 4.34; రాహుకాలం: మ.1.52 – 3.16; అమృతఘడియలు: రా.1.13 – 2.49; శుభసమయం: మ.1.00 – 1.30.

సూర్యోదయం: 6.53

సూర్యాస్తమయం: 6.04



7లో..

ఆత్మాహుతితో అడ్డుకుంటాం!

'పద్మావత్' విడుదలపై కర్ణిసేన నిరసన

- 1900 మంది రాజ్‌పుత్ మహిళలు ఆహుతికి సిద్ధం
- చిత్తోడ్ కోటలో అగ్నిలోకి దూకే యత్నం.. కోట మూసివేత
- రాజస్థాన్‌లో 'పద్మావత్' సినిమా విడుదల అనుమానమే
- హింసాత్మకంగా నిరసనలు.. హరియాణాలో బస్సుకు నిప్పు
- సేన కార్యకర్తల అరెస్టు.. బాధ్యుడు భన్సాలీనే: కర్ణిసేన చీఫ్



తెలంగాణకు రండి

పెట్టుబడులు పెట్టండి.. అవకాశాలు అందిపుచ్చుకోండి

ప్రపంచంలోనే ఉత్తమ పారిశ్రామిక విధానం మాది

వివిధ కంపెనీల సీఈవోలతో భేటీలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్‌లో సిబ్బందిని పెంచుతామన్న నొవార్టిస్

మిత్సుబిషి, ఎయిర్ ఏసియా, హెచ్‌పీ ప్రతినిధులతో భేటీ

టీ హబ్‌కు డబ్ల్యూఈఎఫ్ అవార్డు రావడంపై హర్షం



6లో..




గజల్‌కు బెయిల్

కొన్ని షరతులతో మంజూరు

ఎ2 నిందితురాలు పార్వతికి 'ముందస్తు'

సంస్కృతి గొప్పదనం సరే.. ఎన్ని పెళ్లిళ్లు చేసుకోవచ్చో చెప్పు?



- పవన్‌పై వీహెచ్ ఫైర్

హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): సంస్కృతి సంప్రదాయాల గొప్పతనం చెబుతున్న పవన్ కల్యాణ్ ఎన్ని పెళ్లిళ్లు చేసుకోవచ్చో కూడా చెబితే బాగుంటుందని రాజ్యసభ మాజీ సభ్యుడు, కాంగ్రెస్ సీనియర్ నేత వి.హన్మంతరావు ఎద్దేవా చేశారు. తను మాత్రం మూడు పెళ్లిళ్లు చేసుకోవచ్చు కానీ తాను విడాకులు ఇచ్చిన మహిళ మరో పెళ్లి చేసుకోవద్దా అని ప్రశ్నించారు. మళ్లీ పెళ్లి చేసుకునే ఆలోచన ఉందన్నందుకు ఆమెను తన అభిమానులతో బెదిరించడం నిజం కాదా అని వీహెచ్ నిలదీశారు. పవన్ తాను అనుసరిస్తున్న సంస్కృతిపై వచ్చిన ఆరోపణలకు ఎందుకు స్పందించ రని ప్రశ్నించారు. మన సంస్కృతిని అనుసరించని పవన్ దాని గురించి మాట్లాడటం హాస్యాస్పదంగా ఉందన్నారు. కేసీఆర్ రాసిచ్చిన స్పీచ్‌నే పవన్ చదువుతున్నారని వీహెచ్ ఆరోపించారు. తెలంగాణలో జరుగుతున్న వాస్తవాలను తెలుసుకోకుండా ఆయన కేసీఆర్ భజన చేస్తున్నారని విమర్శించారు. ఏపీలో చంద్రబాబుకు, ఇక్కడ కేసీఆర్‌కు పవన్ రాజకీయ పావుగా మారడన్నారు. తెలంగాణకోసం పోరాడిన కోదండరాం, మందకృష్ణల అరెస్టులు పవన్‌కు ఎందుకు కనిపించడంలేదని ప్రశ్నించారు. కులాల మధ్య కేసీఆర్ చిచ్చు పెడుతున్న విషయం పవన్‌కు కనిపించడం లేదా అని వీహెచ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వచ్చే ఎన్నికల్లో కేసీఆర్‌ను కాపాడడం పవన్ కల్యాణ్ వల్ల కాదన్నారు.

కేసీఆర్‌ది మాటల పాలన

- పవన్ సినిమాలు చేసుకుంటే మంచిది
- రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి



ఖమ్మం, జనవరి 24(మనం న్యూస్ బ్యూరో): కేసీఆర్ పాలనలో మాటలు తప్ప చేతలు లేవని, ఎన్నికల హామీల అమలులో టీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమయ్యిందని మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి విమర్శించారు. ఖమ్మంలోని సంజీవరెడ్డి భవన్‌లో బుధవారం ఆమె విలేకరులతో మాట్లాడారు. తన మూడు రోజుల జిల్లా పర్యటనలో భాగంగా అనేక సమస్యలు తన దృష్టికి వచ్చాయన్నారు. రైతులకు బేడీలు వేసిన ఘనత టీఆర్‌ఎస్ ప్రభుత్వానికే చెల్లిందన్నారు. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు నిర్మిస్తుండగానే కూలిపోతున్నాయన్నారు. మిషన్ భగీరథ పేరుతో రైతులకు అన్యాయం చేస్తున్నారన్నారు. గతంలో నకిలీ విత్తనాలు సరఫరా చేసిన వారికే మళ్లీ లైసెన్స్‌లు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ హయాంలో రేషన్ ద్వారా 9 సరుకులు ఇచ్చామన్నారు. ఇప్పుడు ఆ పరిస్థితి లేదన్నారు. ఫించన్ల కోసం వృద్ధులు, వికలాంగులు అవస్థలు పడుతున్నారన్నారు. ఉద్యోగాల భర్తీ లేదన్నారు. పంచాయతీ రాజ్ ఎన్నికల విషయంలో ప్రభుత్వం తొందరపడుతోందన్నారు. దమ్ముంటే పార్టీ గుర్తుపై ఎన్నికలు పెట్టి గెలవాలని సవాల్ విసిరారు. కాగా, పవన్ కళ్యాణ్ సినిమాలు రాజకీయాలు మాని సినిమాలు చేసుకుంటే మంచిదని రేణుకాచౌదరి హితవు పలికారు. ప్రజా సమస్యలపై పవన్ మొసలి కన్నీర కారుస్తున్నాడని విమర్శించారు. పవన్ ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

ప్రభుత్వాస్పత్రుల్లో మెరుగైన సేవలు

- రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి



నిజామాబాద్/కామారెడ్డి,జనవరి 24 (మనం న్యూస్): ప్రభుత్వ ఆస్పత్రులకు వచ్చే రోగులకు మెరుగైన సేవలందించేందుకు కృషి చేస్తున్నామని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి లక్ష్మారెడ్డి పేర్కొన్నారు. కామారెడ్డి జిల్లాలో రూ.7 కోట్లతో నిర్మించనున్న మాతా, శిశు సంరక్షణ కేంద్రం పనులకు బుధవారం శంకుస్థాపన చేసిన మంత్రి లక్ష్మారెడ్డి, ప్రభుత్వ ఏరియా ఆస్పత్రిలో కొత్తగా ఏర్పాటు చేసిన డయాలసిస్ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ ఆస్పత్రుల్లో కార్పొరేట్ స్థాయి వైద్య సేవలు అందిస్తామన్నారు. మాతా, శిశు సంరక్షణ కేంద్రంలో 50 పడకల, ప్రభుత్వం ఏరియా ఆసుపత్రిలో మరో 50 పడకల ఏర్పాటుకు చర్యలు తీసుకుంటామన్నారు. 108, 102 వాహనాల సంఖ్య పెంచుతామన్నారు. డయాలసిస్ కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆశ వర్కర్లకు ఆన్‌లైన్ ద్వారా రూ.6 వేలను వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో మంత్రి పోచారం శ్రీనివాసరెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ సుష్మ, ఎంపీపీ మంగమ్మ, డీఎంహెచ్‌వో చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపక్షాలకు అభివృద్ధి కనిపించట్లేదు

- గిరిజన సంక్షేమ శాఖ మంత్రి చందూలాల్

భూపాలపల్లి, జనవరి 24(మనం న్యూస్ ప్రతినిధి): టీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధికి ప్రతిపక్షాలకు కనిపించడం లేదని రాష్ట్ర గిరిజన సంక్షేమ, పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి అజ్మీరా చందూలాల్ పేర్కొన్నారు. భూపాలపల్లి జిల్లా ములుగు మండలంలో రూ.3 కోట్లతో చేపట్టిన పలు అభివృద్ధి పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. జగ్గన్నపేటలోని నిర్మించిన పంచాయతీ భవనం, గురుకుల ఆశ్రమ పాఠశాల సిబ్బంది నివాస గృహాలను ఆయన ప్రారంభించారు. ములుగు మండల కేంద్రంలో నిర్మించిన పంచాయతీ భవనం, ఒడీసీఎంఎస్ దుకాణముల సముదాయాన్ని ప్రారంభించారు. అనంతరం రైతు బజార్ పనులకు శంకుస్థాపన చేశారు. ములుగు మార్కెట్‌లో నిర్మించిన సీసీ రోడ్డును ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఒక్క ములుగు నియోజకవర్గంలోనే రూ.3 వేల కోట్ల నిధులతో అభివృద్ధి పనులు జరుగుతున్నాయన్నారు. గిరిజన విద్యకు తమ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ములుగు గట్టమ్మ దగ్గర జాతీయ గిరిజన యూనివర్సిటీని ప్రారంభిస్తామన్నారు. ప్రతిపక్ష కాంగ్రెస్, టీడీపీ, బీజేపీలకు తెలంగాణలో కాలం చెల్లిందన్నారు.

ఉద్యోగ కల్పనలో ప్రభుత్వం విఫలం

- ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి అయ్యప్ప

హైదరాబాద్, జనవరి 24(మనం న్యూస్): ఉద్యోగ కల్పనలో టీఆర్‌ఎస్ ప్రభుత్వం విఫలమైందని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి అయ్యప్ప విమర్శించారు. నాలుగేళ్ల పాలనలో విద్యార్థులు, నిరుద్యోగులకు వ్యతిరేకంగా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. బుధవారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. శ్రీచైతన్య, నారాయణ కళాశాలలను పొలిమేర దాటిస్తానని హామీ ఇచ్చిన కేసీఆర్, ప్రస్తుతం కార్పొరేట్ కాలేజీలకు కొమ్ముకాస్తున్నారని విమర్శించారు. ఆ కళాశాలల్లో విద్యార్థులు ఆత్మహత్యలకు పాల్పడు తున్నా పట్టించుకోక పోవడంతో హైకోర్టు ప్రజాప్రయోజన వ్యాజ్యంగా స్వీకరించిందని, ఇది హర్షించదగ్గ పరిణామన్నారు.ప్రైవేటు కళాశాల యాజమాన్యాలు ఫీజులు తమ ఇష్టానుసారం పెంచుతుంటే.. నియంత్రిం చాల్సిన ప్రభుత్వం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తుందని ఆరోపించారు. గురుకులాలు మత ప్రచారానికి అడ్డాలుగా మారాయని విమర్శించారు. ఫిబ్రవరి 1 నుంచి 7వ తేదీ వరకు ఏబీవీపీ ఆధ్వర్యంలో హాస్టల్ బాట కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ప్రభుత్వం ఫీజులు నియంత్రణలోకి తీసుకురాకుంటే 'విద్యార్థి రణభేరి' కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

నకిలీ ధ్రువపత్రాలతో 'మీసేవ'

- జీహెచ్‌ఎంసీ ఉద్యోగుల సహకారం
- నగరంలోని పలు సెంటర్లలో దందా
- పోలీసుల అదుపులో నిర్వాహకులు



ఎల్బీనగర్, జనవరి 24(మనం న్యూస్): మీసేవ ముసుగులో పలు అక్రమాలకు పాల్పడుతున్న ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. జీహెచ్‌ఎంసీ ఉద్యోగులతో కుమ్మక్కై నకిలీ ధ్రువపత్రాలను అందజేస్తున్న మీసేవ కేంద్రాలను సీజ్ చేసి, నిర్వాహకులను అదుపులోకి తీసుకున్నారు. కాసుల కక్కుర్తితో ఈ దందాకు సహకరించిన ఔట్‌సోర్సింగ్ సిబ్బందిని, హెల్త్ సబ్ రిజిస్ట్రార్‌ను బుధవారం అరెస్టు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్కిల్ -18, మేకల వెంకట్‌రెడ్డి(32), తండ్రి కోటిరెడ్డి వనస్థలిపురంలో నివాసం ఉంటూ, వెస్ట్ మారెడ్‌పల్లిలో మీసేవా కేంద్రాన్ని నడుపుతున్నాడు. చింతల్‌కు చెందిన వెంకోటి రంజీత్‌కుమార్(32) అదే ప్రాంతంలో మీసేవా కేంద్రంతో ఉపాధి పొందుతున్నాడు. అదేవిధంగా జీడిమెట్లలో మీసేవ కేంద్రాన్ని నడుపుతున్న గుడియ కృష్ణ(48), వివేకానందనగర్‌లో మీసేవ కేంద్రం నిర్వాహకుడు మయ్య నరేందర్‌రావు(34)లతో కలిసి అక్రమాలకు తెరతీశారు. అక్రమ సంపాదనే ధ్యేయంగా ఏజెంట్ల సాయంతో నకిలీ బర్త్ సర్టిఫికెట్లను తయారుచేస్తున్నారు. ఒక్కో సర్టిఫికెట్‌ను రూ.4 నుంచి రూ.5 వేల వరకు వసూలు చేస్తూ ప్రభుత్వాన్ని, నిరుద్యోగులను మోసం చేస్తున్నారు. వీరంతా నిరుద్యోగులకు జీవనోపాధి కల్పించే ఉద్దేశంతో ప్రభుత్వం ఇచ్చిన మీసేవా సెంటర్‌లను అవినీతికి అడ్డగా మార్చుకున్నారు. 1991 నుంచి ఈ దందా కొనసాగిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటివరకు 2122 సర్టిఫికేట్‌లు ఇచ్చినట్లు పోలీసులు వివరించారు.

సెల్ఫీలతో ఉపయోగం లేదు

జాతీయవాదులుగా మెలగండి

- పార్టీకి ఉడుకురక్తం కావాలి
- ఉద్వేగంగా జనసేనాని ప్రసంగం
- తొక్కిసలాటతో సగంలోనే విరమణ
- ఖమ్మం పర్యటనలో పవన్ కల్యాణ్
- జిల్లాలో రోడ్‌షోకు విశేష ఆదరణ
- అభిమానికి, ఎస్ఐకి గాయాలు



ఖమ్మం, జనవరి 24(మనం న్యూస్ బ్యూరో): కుల, మతం, ప్రాంతీయ భేదాల్లేకుండా జాతీయవాదులుగా మెలగాలంటూ అభిమానులు, కార్యకర్తలకు జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. తనతో ఫొటోలు, సెల్ఫీలు దిగడంవల్ల ఉపయోగంలేదని ఆయన పేర్కొన్నారు. 'కొత్తగూడంలో చాలా సమస్యలున్నాయి. పోడు భూములు, రైల్వే లైన్, మైనింగ్ వర్సిటీ, పర్యావరణం వంటి సమస్యలున్నాయి. సమస్యలపై సమరం కంటే వాటిపై అధ్యయనానికే ప్రాధాన్యతనిస్తా. నిపుణులతో చర్చించి వాటి పరిష్కార మార్గాలు చూపుతా. కొత్తగూడెంలో మైనింగ్ పరిశ్రమ, మెడికల్ కాలేజీ రావాల్సిన అవసరముంది' అని పవన్ అన్నారు. తెలంగాణ పర్యటనలో భాగంగా మూడో రోజు ఖమ్మం జిల్లాలో పార్టీ ముఖ్య కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా పవన్ కల్యాణ్ అభిమానులను ఉద్దేశించి ఆవేశంగా, ఉద్వేగంగా ప్రసంగించారు. అంతకుముందు కొత్తగూడెంలో పవన్ కల్యాణ్‌కు అపూర్వ స్వాగతం లభించింది. అభిమానులు, జనసేన కార్యకర్తలు రోడ్డుకు ఇరువైపులా బారులు తీరారు. కేన్సర్ వ్యాధి నుంచి కోలుకున్న శ్రీజ.. పవన్ కల్యాణ్‌ను కలిసింది. శ్రీజ కేన్సర్ వ్యాధితో బాధపడుతున్న సమయంలో పవన్ ఆమెను పరామర్శించిన విషయం తెలిసిందే! శ్రీజ ఇప్పుడు ఆరోగ్యంగా ఉండటం ఆనందంగా ఉందని పవన్ పేర్కొన్నారు. బుధవారం ఉదయం కొత్తగూడెం నుంచి పవన్ యాత్ర ప్రారంభించారు. జూలూరుపాడు, ఏన్కూరు, తల్లాడ, వైరా, కొణిజర్ల మండలాల మీదుగా మధ్యాహ్నానికి ఖమ్మం చేరుకున్నారు. నగరంలో రోడ్‌షోతో బైపాస్ రోడ్ మీదుగా ఎంబీ గార్డెన్స్ చేరుకున్నారు. అప్పటికే ఉమ్మడి ఖమ్మం, నల్గొండ, వరంగల్ జిల్లాల నుంచి వచ్చిన జనసేన కార్యకర్తలతో, అభిమానులతో ఎంబీ గార్డెన్స్ హాలు నిండిపోయింది. ఈ సందర్భంగా ఫొటోలు, సెల్ఫీల కోసం ఎగబడకుండా.. తన రాజకీయ యాత్రకు సంయమనంగా సహకరించాలని పవన్ అభిమానులను కోరారు. కుల, మత భేదం లేని కొత్త సమాజం కావాలంటూ పవన్ తన ప్రసంగంలో పేర్కొన్నారు. ఇందుకోసం ఉడుకురక్తం పరుగులు తీసే యువత కావాలని పదే పదే పేర్కొన్నారు. తనతో సెల్ఫీలు దిగడం వల్ల ఉపయోగంలేదని.. సమాజానికి ఉపయోగపడే పనులు చేయాలని కోరారు. కాగా, అభిమానులు భారీ సంఖ్యలో తరలిరావడంతో ఒక దశలో తొక్కిస లాట జరిగింది. వారిని నియంత్రించడం పోలీసులకు తలకు మించిన భారంగా మారింది. దీంతో పరిస్థితి అదుపు తప్పుతోందని భావించిన పవన్ తన ప్రసంగాన్ని మధ్యలోనే ముగించి సెలవు తీసుకున్నారు.

ప్రసంగం అరగంటే..

ఎంబీ గార్డెన్స్ హాలులో ఏర్పాటు చేసిన వేదికపైకి చేరుకున్న పవన్ కేవలం అరగంట పాటే మాట్లాడారు. తొక్కిసలాట కారణంగా ఏర్పడిన గందరగోళంతో ఆయన తన ప్రసంగాన్ని అర్ధాంతరంగా నిలిపేసి వెళ్లిపోయారు. పవన్ ప్రసంగంలో జిల్లాలో నెలకొన్న దీర్ఘకాలిక సమస్యలను ప్రస్తావించలేదు. ప్రసంగం ముగించిన వెంటనే ఆయన వడివడిగా వెళ్లిపోయారు. మొత్తానికి పవన్ కల్యాణ్ పర్యటన అభిమానుల్లో ఉత్సాహాన్ని నింపగా.. రాజకీయ విశ్లేషకులకు మాత్రం నిరాశ కలిగించింది.

అభిమాని, ఎస్ఐలకు గాయాలు

పవన్ కల్యాణ్ యాత్రలో అపశృతి చోటుచేసుకుంది. తల్లాడ వద్ద ఖమ్మం నగరానికి చెందిన ముస్తాఫా అనే అభిమాని కాలు విరిగింది. అభిమాన నేతను దగ్గరి నుంచి చూడాలనే ప్రయత్నంలో తొక్కిసలాట జరగడంతో ముస్తఫా కిందపడ్డాడు. దీంతో కాలుకు ఫ్రాక్చర్ అయింది. పవన్ రాక నేపథ్యంలో బందోబస్తు విధులు నిర్వహిస్తున్న ఖమ్మం రూరల్ ఎస్సై చిరంజీవికూడా గాయపడ్డారు. పోలీసులు వీరిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.



రసాభాసగా మారిన సభ..

పవన్ కల్యాణ్ రాక సందర్భంగా ఎంబీ గార్డెన్లో సరైన ఏర్పాట్లు చేయకపోవడంతో అభిమానులు అదుపు చేయడం పోలీసులకు తలకుమించిన భారంగా తయారైంది. పవన్ సభ ప్రాంగణానికి చేరుకోగానే రెచ్చిపోయిన కార్యకర్తలు ఒక్కసారిగా బారికేడ్లను తోసుకుంటూ రావడంతో మీడియా సిబ్బంది గాయపడ్డారు. వీడియో జర్నలిస్టుల కెమెరాలు విరిగిపోయాయి. సభా ప్రాంగణమైన ఎంబీ గార్డెన్లో కుర్చీలన్నీ విరిగిపోయాయి. పార్టీ అధినేత ఏం మాట్లాడుతున్నారో కూడా పట్టించుకోని అభిమానులు.. వేదికపైకి దూసుకెళ్లారు. పరిస్థితి అదుపు తప్పడంతో పవన్ తన ప్రసంగాన్ని త్వరగా ముగించి వెళ్లిపోయారు.

రైతుల సంతోషమే మా ఆనందం

సీఎం కేసీఆర్ 'రైతుబంధు'.. వ్యవసాయ బోర్ల వాడకం తగ్గించండి


- రాష్ట్ర మంత్రి తన్నీరు హరీశ్‌రావు



చిన్నకోడూరు, జనవరి 24(మనం న్యూస్): భారతదేశంలో రైతుల సంక్షేమం గురించి ఆలోచించే ఒకే ఒక్క ముఖ్యమంత్రి, తెలంగాణ సీఎం కేసీఆర్ అని భారీ నీటి పారుదల శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అన్నారు. కేసీఆర్ రైతు బంధు అని, రైతులు సంతోషంగా ఉంటే తామంతా ఆనందంగా ఉంటామని ఆయన అన్నారు. చిన్నకోడూరు మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న హరీశ్‌రావు రైతులకు టార్పాలిన్ కవర్లు, స్ప్రే పంపులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సాగునీటి కాలువల నిర్మాణానికి భూములిచ్చిన రైతులకు కృతజ్ఞతలు తెలిపారు. అంతగిరి ప్రాజెక్టు కోసం భూములు, ఇళ్లు త్యాగం చేసిన కొచ్చగుట్టపల్లి గ్రామస్థులు గొప్పవాళ్ళన్నారు. ఎన్ని జన్మలెత్తినా కొచ్చగుట్టపల్లి రైతన్నల రుణం తీర్చుకోలేమని, ప్రభుత్వం వారిని కడుపున పెట్టుకొని చూసుకుంటుందన్నారు. గోదావరి నీళ్ళతో చిన్నకోడూరులో అన్ని వాగులు, చెక్‌డ్యామ్‌లు నిండుతాయన్నారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు రైతన్నలు ఎరువుల కోసం పోలీస్ స్టేషన్‌ల ముందు లైన్‌లు కట్టారని, నేడు ఎరువులు, విత్తనాల కొరత లేదన్నారు. గత రెండేళ్లలో చిన్నకోడూరు రైతులకు నాలుగు వేల స్ప్రింక్లర్ సెట్‌లు ఇచ్చామన్నారు. బోర్ల వినియోగం తగ్గించాలని మంత్రి రైతులకు సూచించారు. భూగర్భ జలాలను కాపాడుకోవాలన్నారు. కొత్త బోర్లు వేయడానికి అనుమతి ఇవ్వద్దని రెవెన్యూ అధికారులకు సూచించారు. మార్కెట్‌లో ఉన్న ధర ఆధారంగా రైతులు పంటమార్పిడి చేసుకుంటే లాభాలు పొందవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ కమల రామచంద్రం, ఎంపీపీ మాణిక్యరెడ్డి, ఏఎంసి చైర్మన్ కుంట వెంకట్‌రెడ్డి, వ్యవసాయ అధికారి గీత, పీఏసీఎస్ చైర్మన్‌లు కీసరి పాపయ్య, మూర్తి బాల్‌రెడ్డి, తహసీల్దార్ రాజిరెడ్డి, ఇతర అధికారులు, రైతులు పాల్గొన్నారు.

పాలనాదక్షుడు కేసీఆర్

- ఏడాదిలోపు కాళేశ్వరం పూర్తి చేస్తాం
- 40 వేల కోట్లతో సంక్షేమ పథకాల అమలు
- అభివృద్ధి నిరోధానికి ప్రతిపక్షాల కుట్ర
- రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కడియం శ్రీహరి



వరంగల్, జనవరి 24(మనం న్యూస్ బ్యూరో): రాష్ట్ర ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పరిపాలన దక్షకుడని రాష్ట్ర ఉపముఖ్యమంత్రి కడియం శ్రీహరి అన్నారు. వరంగల్ అర్బన్ కలెక్టరేట్‌లో నిర్మించనున్న సమీకృత కలెక్టరేట్ భవన నిర్మాణానికి శాసనసభ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, రాష్ట్ర మంత్రులు తుమ్మల నాగేశ్వరరావు, ఈటల రాజేందర్, ఎంపీలు కెప్టెన్ లక్ష్మీకాంతారావు, వినోద్‌కుమార్, సుధారాణితో కలిసి కడియం శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్ అధ్యక్షతన జరిగిన సభలో కడియం మాట్లాడారు. వరంగల్‌ను రాష్ట్రంలో రెండో అతిపెద్ద నగరంగా అభివృద్ధిపరిచేందుకు ముఖ్యమంత్రి సిద్ధంగా ఉన్నారని గుర్తుచేశారు. రాష్ట్రాభివృద్ధికి సీఎం తీసుకున్న చర్యలు కేంద్ర ప్రభుత్వంతో పాటు ప్రపంచ దృష్టిని ఆకర్షించారన్నారు. కాళేశ్వరం, దేవాదుల ప్రాజెక్టులు పూర్తిచేసి ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామని చెప్పారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఏడాదిలో పూర్తి చేస్తామన్నారు. సంక్షేమ పథకాలకు రాష్ట్ర ప్రభుత్వం 40వేల కోట్లు ఖర్చు పెడుతోందని గుర్తుచేశారు.రైతులకు 24గంటల విద్యుత్‌ను అందించిన ఘనత కేసీఆర్‌దేనని తెలిపారు. త్వరలో ఇంటింటికి మంచినీరు అందిస్తామన్నారు. అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రతిపక్షాలు కుట్రలు చేస్తున్నాయని ఆయన మండిపడ్డారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యేలు కొండా సురేఖ, చల్లా ధర్మారెడ్డి, ఆరూరి రమేష్, తాటికొండ రాజయ్య, ఒడితల సతీష్‌బాబు, ఎమ్మెల్సీ శ్రీనివాస్‌రెడ్డి, జడ్పీ చైర్‌పర్సన్ పద్మ, కలెక్టర్ ఆమ్రపాలి, కుడా చైర్మన్ యాదవరెడ్డి, సీపీ జి.సుధీర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

టీఎస్ఆర్టీసీ సురక్షితం

- అతితక్కువ ప్రమాదాల్లో దేశంలోనే నంబర్ 1
- 30 ఏళ్లుగా ఒక్క ప్రమాదం చేయని డ్రైవర్లు 180
- ఆర్టీసీని మరింత ఉన్నతంగా తీర్చిదిద్దుదాం
- మంత్రి మహేందర్‌రెడ్డి, సోమారపు పిలుపు
- ఘనంగా రోడ్డు భద్రతా వారోత్సవాలు



హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): దేశంలో ప్రమాదాలు తగ్గించిన ఘనత టీఎస్ఆర్టీసీకే దక్కుతుందని రవాణాశాఖ మంత్రి పట్నం మహేందర్‌రెడ్డి అన్నారు. ఈ నెల 19 నుంచి నిర్వహిస్తున్న 29వ రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా గురువారం హైదరాబాద్‌లోని ఆర్టీసీ కల్యాణ మండపంలో నిర్వహించిన కార్యక్రమంలో మహేందర్‌రెడ్డి, ఆర్టీసీ చైర్మన్ సోమారపు సత్యనారాయణ పాల్గొన్నారు. మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ.. టీఎస్ఆర్టీసీ నాలుగేళ్లుగా 0.07 ప్రమాద రేటుతో ప్రమాదాలు తగ్గించిన ప్రజారవాణా వ్యవస్థల్లో దేశంలోనే తొలిస్థానంలో నిలిచిందని తెలిపారు. ఆర్టీసీలో 30 ఏళ్లుగా ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్లు 180 మంది, 20 ఏళ్లుగా ప్రమాద రహితంగా డ్రైవింగ్ చేస్తున్న వారు 1700 మంది, పదేళ్లుగా ప్రమాదమే చేయని డ్రైవర్లు 3200 మంది ఉన్నారని, ఇది సంస్థకు గర్వకారణమని అన్నారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం సురక్షితం అనే నినాదాన్ని ఈ లెక్కలు నిరూపిస్తున్నాయని చెప్పారు. రాష్ట్రంలోని 97 డిపోలు ఉండగా దాదాపు 21 డిపోలు నష్టాలను నివారిస్తున్నాయన్నారు. ఆర్టీసీ కార్మికులు ఒత్తిడికి లోనుకావొద్దని, డ్రైవర్లు ఇతర సిబ్బందికి అధికారులు సహకరించాలని ఆయన సూచించారు. ఆర్టీసీని దేశంలోనే గొప్ప సంస్థగా తీర్చుదిద్దుకుందామని సోమారపు సత్యనారాయణ కార్మికులకు పిలుపునిచ్చారు. వేగం, నిర్లక్ష్యం వీడి ఆర్టీసీ డ్రైవర్లు ర్యాష్ అనే పేరు రాకుండా చూసుకోవాలన్నారు. రోజు 36వేల కిలోమీటర్ల గమనాన్ని సాగిస్తున్న ఆర్టీసీ ఉద్యోగులను సంస్థ ఎండీ రమణరావు అభినందించారు. ఆర్టీసీలో సుదీర్ఘకాలంగా ఎలాంటి ప్రమాదాలూ చేయకుండా విధులు నిర్వహించి ఇటీవల మృతిచెందిన అమీనుద్దీన్(కరీంనగర్-2డిపో) కుటుంబానికి మంత్రి రూ.12 వేలు అందజేశారు. అలాగే 31ఏళ్లుగా ఒక్క ప్రమాదం కూడా చేయని డ్రైవర్లు కృష్ణ, కేశయ్య, తదితరులకు సోమారపు నగదు బహుమతులు అందజేసి సన్మానించారు. కార్యక్రమంలో జేటీసీ పాండురంగనాయక్, ఈడీలు సత్యనారాయణ, రవిందర్, ఉద్యోగులు, తదితరులు పాల్గొన్నారు.

నెక్లెస్ రోడ్డులో మిగిలిన ప్లాట్‌లు ఏమి చేస్తారు?

- ప్రభుత్వాన్ని వివరణ కోరిన హైకోర్టు

హైదరాబాద్, జనవరి 24(మనం లీగల్ ప్రతినిధి): హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులోని అంబేద్కర్ నగర్‌లో పేదలను ఖాళీ చేయించి నిర్మించే రెండు పడక గదుల ప్లాట్‌లలో ఎంపిక చేసిన లబ్ధిదారులు 280 మందిని మినహాయించగా మిగిలిన 340 ప్లాట్‌లను ఏం చేస్తారో చెప్పాలని హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి రమేష్ రంగనాథన్, న్యాయమూర్తి గంగారావుతో కూడిన డివిజన్ బెంచ్ తెలంగాణ ప్రభుత్వాన్ని ఆదేశించింది. డబుల్ బెడ్ రూమ్ ఇళ్లకోసం ముందుకొచ్చిన వారి స్థలంతో పాటు తమ స్థలంలో కూడా నిర్మాణాలు చేయడాన్ని సవాల్ చేస్తూ జగన్నాథసింగ్, మరికొందరు హైకోర్టును ఆశ్రయించారు. దీనిపై సింగిల్ జడ్జి స్టేటస్‌కో ఉత్తర్వుల్ని రద్దు చేయడంతో అప్పీల్ చేసిన రిట్‌ను బెంచ్ బుధవారం విచారించింది. ఎంపిక చేసిన వారికి 280 ఇస్తే మిగిలిన వాటిని ఎందుకు వినియోగిస్తారు, అమ్మితే ఎంత డబ్బు వస్తుందో పూర్తి వివరాలతో సింగిల్ జడ్జి వద్ద కౌంటర్ వేయాలని ఆదేశిస్తూ అప్పీల్ రిట్ పరిష్కారమైనట్లు వెల్లడించింది.

కేంద్రం నిధులు ఇప్పించండి: చాడ

హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): మానసిక వికలాంగుల కోసం కరీంనగర్ జిల్లాలో 25 ఏండ్లుగా నిర్వహిస్తున్న ఆశ్రమానికి కేంద్ర నిధులు విడుదల చేయించాలంటూ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు హైదరాబాద్‌లోని వెంకయ్య ఇంటికి వెళ్లిన చాడ ఆయనకు ఓ వినతిపత్రాన్ని ఇచ్చారు. దాదాపు రూ.32 లక్షలు విడుదల కావాల్సి ఉందని, ఆశ్రమ నిర్వహణ కష్టంగా మారిందని తెలిపారు. ఆ నిధులను వెంటనే విడుదల చేయించి ఆదుకోవాలని చాడ విజ్ఞప్తి చేశారు.



- కేంద్ర అటవీ, పర్యావరణ శాఖ కార్యదర్శి ప్రశంసలు
- గజ్వేల్‌లో కోమటిబండ హెడ్‌వర్క్స్ పనుల పరిశీలన
- మా రాష్ట్రంలోనూ ప్రవేపెడతాం: ఒడిశా బృందం
- సంగారెడ్డిలో భగీరథ పనుల పరిశీలన

మిషన్ భగీరథ అద్భుతం

ఇంటింటికీ మంచినీరు ఆలోచన అభినందనీయం

హైదరాబాద్, జనవరి 24: ప్రతీ ఇంటికి మంచినీళ్లు ఇవ్వాలన్న రాష్ట్ర సర్కారు ఆలోచన అభినందనీయమని కేంద్ర అటవీ,పర్యావరణ శాఖ కార్యదర్శి సి.కె మిశ్రా ప్రశంసించారు. మిషన్ భగీరథ అద్భుతమని, దాని గురించి తాను విన్నదానికి అనుగుణంగానే క్షేత్రస్థాయిలో పనులు అలాగే ఉన్నాయని చెప్పారు. బుధవారం గజ్వేల్ సెగ్మెంట్ లోని కోమటిబండ హెడ్ వర్క్స్ ను మిశ్రా పరిశీలించారు. అక్కడ ఏర్పాటుచేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను చూశారు. ఈఎన్సీ సురేందర్ రెడ్డి ప్రాజెక్టు వివరాలను తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా జరుగుతున్న పనుల పురోగతిని వివరించారు. భగీరథను మొదలుపెట్టిన 9 నెలల రికార్డు సమయంలోనే గజ్వేల్ సబ్ సెగ్మెంట్ ను ప్రారంభించామని చెప్పారు. అటవీ శాఖ అధికారుల సహకారంతో భగీరథ పనులు ఎలాంటి ఆటంకం లేకుండా సాగుతున్నాయన్నారు. ఈ సందరేంగా కోమటిబండలో నిర్మించిన జీఎల్ బీఆర్ ను మిశ్రా పరిశీలించారు.



ఇక్కడి నుంచి తాగునీరు ఎన్ని ఆవాసాలకు సరాఫరా అవుతుందో తెలుసుకున్నారు. స్వచ్ఛమెన నీరు దొరకక ఎంతోమంది కష్టాలు పడుతున్నారని, అలాంటివారి కోసం తెలంగాణ ప్రభుత్వం ఆలోచించడం గొప్ప విషయమని మిశ్రా పేర్కొన్నారు. కార్యక్రమంలో సాగునీటి శాఖ కార్యదర్శి ఎస్.కే జోషి, ప్రిన్సిపల్ చీఫ్‌కన్జర్వేటర్ పికే ఝా, తదితరులు పాల్గొన్నారు.

మిషన్ భగీరథ అద్భుతం: ఒడిశా బృందం

ప్రజలకు మంచి చేయాలన్న తపన ఉంటే తప్ప మిషన్ భగీరథ లాంటి ప్రాజెక్టును మొదలుపెట్టడం సాధ్యం కాదన్నారు ఒడిశా అధికారులు. కేసీఆర్ లాంటి చిత్తశుద్ధి ఉన్న ముఖ్యమంత్రి ఉన్నందునే ఇంత తక్కువ వ్యవధిలోనే ప్రాజెక్టు పూర్తి కాబోతుందని చెప్పారు. బుధవారం సంగారెడ్డి జిల్లా బుస్సారెడ్డిపల్లి, పెద్దారెడ్డిపేట మెదక్ జిల్లా రామచంద్రాపురంలో ఒడిశా తాగునీరు,పారిశుద్ధ్య అధికారుల బృందం పర్యటించింది. ఇందులో ఒడిశా రాష్ట్ర ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి పీకే నంద, చీఫ్ ఇంజనీర్ జన్మేజయ్ సేఠితో పాటు పదకొండు మంది ఇంజనీర్లు, ఒడిశా నాబార్డ్ డీజీఎం పాణిలు పాల్గొన్నారు. మొదట ఈ బృందం సంగారెడ్డి జిల్లా బుస్సారెడ్డిపేటలో నిర్మించిన ఇంటేక్ వెల్‌తో పాటు 100 గ్రామీణ వాటర్ ట్రీట్ మెంట్ ప్లాంట్‌ను పరిశీలించింది. మోటార్లు,పంపుల సామర్థ్యాన్ని మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాశ్ ఒడిశా అధికారులకు వివరించారు. ఆ తర్వాత మీడియాతో మాట్లాడిన ఒడిశా ఆర్థిక శాఖ అదనపు కార్యదర్శి పీకే నంద, తమ రాష్ట్రంలోనూ పరిమితంగా తాగునీటి సరాఫరా ప్రాజెక్టును ప్రారంభించాలని అనుకుంటున్నామని, అందుకోసమే మిషన్ భగీరథను చూడడానికి వచ్చామన్నారు. ఒడిశా అధికారుల పర్యటనలో మిషన్ భగీరథ చీఫ్ ఇంజనీర్ విజయ్ ప్రకాశ్, కన్సల్టెంట్ నర్సింగరావు, ఎస్.ఈ.శ్రీనివాస్, ఈఈలు రఘువీర్, సురేష్, లలిత, కమలాకర్ తదితరులు పాల్గొన్నారు.



నయీం కేసును సీబీఐకి అప్పగించాలి

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ డిమాండ్
- 12న బాధితులతో ముఖాముఖి సదస్సు

హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో నిజాలు నిగ్గుతేలాలంటే నయీం డైరీని బహిర్గతం చేసి, కేసు విచారణను సీబీఐకు అప్పగించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి డిమాండ్ చేశారు. నయీం ఆంశంపై సీపీఐ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన రౌండ్ టేబుల్ సమావేశంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గుండా మల్లేష్, సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ నేత గోవర్ధన్, టీపీఎఫ్ నేత రవిచంద్ర, మానవ హక్కుల సంఘం నేత జీవన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చాడ మాట్లాడుతూ.. దేశవ్యాప్తంగా నేర సామ్రాజ్యాన్ని ఏర్పాటు చేసుకుని అనేక ఆకృత్యాలకు పాల్పడిన గ్యాంగ్‌స్టర్ నయీం కేసులో ఎవ్వరినీ వదిలేదిలేదని ప్రగల్భాలు పలికిన కేసీఆర్ ఇప్పుడెందుకు వారిని అరెస్ట్ చేయడంలేదని ప్రశ్నించారు. నయీం దాదాపు 90 మందిని హత్య చేశాడని, పది వేల కోట్ల అక్రమ సంపాదన, 1100 ఎకరాల భూకబ్జాలకు పాల్పడ్డాని టీపీఎఫ్ నేత రవిచంద్ర వెల్లడించారు. నయీంతో నేరుగా సంబంధాలు కలిగి ఉన్న 18 మంది ఐపీఎస్‌లు, 8మంది ఎమ్మెల్యేలు, ముగ్గురు మంత్రులను ప్రభుత్వం కాపాడుతోందని పౌర హక్కుల సంఘం నేత నారాయణ చెప్పారు. నయీం అనుచరులమని చెప్పుకుంటూ దందాలకు పాల్పడుతున్న వారి సంఖ్య నానాటికి పెరిగిపోతోందని పలువురు వక్తలు అన్నారు. ఫిబ్రవరి 12న నయీం బాధితులతో హైదరాబాద్‌లో ముఖాముఖి నిర్వహించాలని సమావేశంలో తీర్మానించారు. భువనగిరి, వరంగల్, హైదరాబాద్‌లలో నయీం బాధితులతో భేటీ ఏర్పాటు చేసి అనంతరం నయీం ఆగడాలపై ఒక బుక్‌లెట్ వేయాలని నిర్ణయించారు. నయీం బాధితులకు న్యాయం చేయాలని రాష్ట్రపతి, గవర్నర్, సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి, ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్‌కు ఫిర్యాదు చేయాలని వక్తలు అభిప్రాయపడ్డారు.

టీడీపీ జనగాం అధ్యక్షుడిగా శ్రీనివాస్

హైదరాబాద్, జనవరి 24 (మనం ప్రతినిధి): టీడీపీ జనగాం జిల్లా అధ్యక్షుడిగా బోట్ల శ్రీనివాస్, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడిగా కోండపల్లి రాంచంద్రరావును నియమిస్తున్నట్టు పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ ప్రకటించారు. ఈ మేరకు పార్టీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి జి బుచ్చిలింగం ఒక ప్రకటనలో తెలిపారు. భూపాల్‌పల్లి జిల్లా అడ్‌హక్ కమిటి సభ్యులుగా చాడా రఘునాథ్‌రెడ్డి, యాసాల అనంత్‌రెడ్డి, గడపర్తి నరసింహ మూర్తి, అరికేల ప్రమోద్‌లను నియమించినట్టు ఆయన తెలిపారు.

తుదిశ్వాస వరకూ టీడీపీతోనే: ఎల్.రమణ



హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): తుదిశ్వాస వరకూ టీడీపీలోనే ఉంటానని, పార్టీని ముందుకు తీసుకెళ్తానని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎల్ రమణ అన్నారు. బుధవారం ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యకర్తల శిక్షణ తరగతుల నాలుగో బ్యాచ్ ముగింపు భేటీలో ఆయన మాట్లాడుతూ.. పార్టీ లైన్‌లో ఉండడం వల్లే ఈ స్థాయికి వచ్చామన్నారు. టీటీడీపీకి అనుభవమున్న నాయకత్వముందని, మొక్కవోని ధైర్యంతో పార్టీని ముందుకు తీసుకెళ్తామన్నారు. గిరిజనులకు 12 శాతం రిజర్వేషన్లు కల్పిస్తామని చెప్పి ఓట్లు వేయించుకున్న కేసీఆర్.. వాటిని ఇంకెప్పుడుఅమలు చేస్తారో చెప్పాలని పార్టీ ఉపాధ్యక్షుడు రమావత్ లక్ష్మణ్ నాయక్ ప్రశ్నించారు. కేసీఆర్ నయా గడీ పాలన కొనసాగిస్తూ ఉన్న స్కూళ్లను, కాలేజీలను మూసివేస్తూ బర్రెలు కాసుకోమంటూ యువతకు చెబుతున్నారని నన్నూరి నర్సిరెడ్డి దుయ్యబట్టారు. కార్యక్రమంలో కొత్తకోట దయాకర్‌రెడ్డి, తాజుద్దీన్, ఏపీ ఎమ్మెల్యే బుద్దా వెంకన్న, బక్కని నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

నేడు బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావ సభ

హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో ఏర్పాటు చేస్తున్న బహుజన లెఫ్ట్ ఫ్రంట్ ఆవిర్భావ సభను గురువారం హైదరాబాద్‌లో నిర్వహించనున్నారు. రాష్ట్రంలో సామాజిక న్యాయం- సమగ్రాభివృద్ధి సాధనే లక్ష్యంగా 21 రాజకీయ పార్టీలు, ప్రజా సంఘాల కలయికతో ఈ ఫ్రంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఆవిర్భావ సభలో సీపీఐ(ఎం) జాతీయ ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సామాజిక ఉద్యమ నేత, అంబేద్కర్ మనవడు ప్రకావ్ అంబేద్కర్, ఎంసీపీఐ(యు) జాతీయ కార్యదర్శి ఎండీ గౌస్, ప్రజా యుద్ధనౌక గద్దర్, టీమాస్ చైర్మన్, ప్రొఫెసర్ కంచ ఐలయ్య, నల్లా సూర్యప్రకాశ్, తమ్మినేని వీరభద్రం తదితరులు పాల్గొననున్నారు.

రాజ్యాంగబద్ధంగానే లంబాడీలకు హోదా

హైదరాబాద్, జనవరి 24 (మనం ప్రతినిధి): ఆదివాసీలు, లంబాడీల మధ్య ఏర్పడిన సమస్యను పరిష్కరించడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని కాంగ్రెస్ ఆరోపించింది. గొండు తెగను లంబాడిలపై ఉసిగొల్పుతున్నారని కాంగ్రెస్ నాయకుడు రవీంద్ర నాయక్ ఆరోపించారు. ఈమేరకు బుధవారం గాంధీభవన్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. తెలంగాణలో ఉన్న 35 లక్షల మంది లంబాడీలు ఆర్డినెన్స్ ద్వారా ఎస్టీల్లోకి వచ్చారని ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా ఉన్న ఆనంద్ కుమార్ సాయి చెప్పడం సరికాదన్నారు. రాజ్యాంగబద్దంగానే లంబాడీలను ఎస్టీల్లో చేర్చారని చెప్పారు. దీనిపై రాష్ట్రపతికి మెమోరాండం ఇస్తామని ఆయన వివరించారు.

ఉద్యానవన శాఖలో కారుణ్య నియామకాలు

హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): తెలంగాణ ఉద్యాన వన శాఖలో కారుణ్య నియామకాల కింద తోటమాలి ఉద్యోగాల్లో ఏడుగురిని నియమించారు. దీనికి సంబంధించిన నియామక ఉత్తర్వులను జీఏడీ ముఖ్యకార్యదర్శి (పొలిటికల్) శ్రీ అధర్ సిన్హా బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో అందజేశారు. నియామక పత్రాలు అందుకున్న వారిలో అస్లాం, సయ్యద్ అలీ, కరణ్, వెంకటేశ్, లక్ష్మణ్, మిరాజుద్దీన్, అలీముద్దీన్‌లున్నారు.

సాక్షర భారత్‌లో ఆకలి కేకలు

అలమటిస్తున్న కోఆర్డినేటర్లు.. 15 నెలలుగా అందని వేతనం

- గత ఏడాదితో ముగిసిన మిషన్
- మౌఖిక ఆదేశాలతో కొనసాగింపు
- అయోమయంలో సాక్షరభారత్ మిషన్
- కొనసాగించాలంటూ రాష్ట్రం లేఖ
- కొత్త పథకం ఆలోచనలో కేంద్రం?



हैदराबाद్, జనవరి 24(మనం ప్రతినిధి): నిరక్షరాస్యుల జీవితాల్లో వెలుగులు నింపే క్రమంలో సాక్షరభారత్ కోఆర్డినేటర్లు అర్ధాకలితో అలమటిస్తున్నారు.. అరకొర వేతనాలతో సర్దుకుంటున్నా, అవీ నెలల తరబడి అందకపోవడంతో అప్పులతో కుటుంబాలను నెట్టుకొస్తున్నారు. వేతనాలను పెండింగ్‌లో పెట్టడంతో కుటుంబాన్ని పోషించే పరిస్థితి లేదని వాపోతున్నారు. ఓవైపు మిషన్ కాలపరిమితి ముగిసిపోవడంతో తమ భవితవ్యం ప్రశ్నార్థకంగా మారిపోయిందని చెబుతున్నారు. ఈ క్రమంలో సాక్షరభారత్ కో ఆర్డినేటర్ల దుస్థితిపై 'మనం' కథనం... దేశంలో సంపూర్ణ అక్షరాస్యత సాధించే లక్ష్యంతో అప్పటి కేంద్ర ప్రభుత్వం 2010 సెప్టెంబర్ 8న సాక్షరభారత్ మిషన్‌ను ప్రారంభించింది. నిరక్షరాస్యులైన వయోజనులు మాతృభాషలో కనీసం రాయడం, చదవడం వంటి అక్షరా జ్ఞానం పొందాలనే లక్ష్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ఈ కార్యక్రమంతో మెరుగైన ఫలితాలను సాధించటంతో కేంద్ర ప్రభుత్వం గ్రామ పంచాయతీలలో సాక్షరభారత్ మిషన్ కింద వయోజన విద్యా కేంద్రాలను అందుబాటులోకి తెచ్చింది. 60 శాతం కేంద్రం, 40 శాతం రాష్ట్రం నిధులతో ఈ పథకం కొనసాగుతుంది. అక్షర మంటే తెలియని వయోజనులకు కనీసం తమ సంతకం పెట్టేంత వరకు సాక్షరభారత్‌తో నేర్చుకున్నారు. ఈ క్రమంలోనే వేల సంఖ్యలో వయోజనులు నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఓపెన్ స్కూల్ ద్వారా పరీక్షలు రాసి గుర్తింపు పత్రాలు పొందారు. ఇప్పటి వరకు సాక్షర భారత్ కేంద్రాల ద్వారా 6.40 లక్షల మంది వయోజనులకు చదవటం, రాయటం నేర్పించారు. మరో 4.42 లక్షల మంది నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా మార్చాల్సి ఉంది. కాగా సాక్షర భారత్ కేంద్రాలు క్షేత్ర స్థాయిలో మొక్కుబడిగా నడిచాయనే ఆరోపణలతో ఈ పథకంపై కొంతకాలంగా కేంద్రం చిన్నచూపు చూస్తుంది. సకాలంలో వేతనాలు ఇవ్వకుండా లక్ష్యాలను ఎలా సాధిస్తామని, అయినప్పటికీ తమ వంతుగా కృషి చేశామని పలువురు కో ఆర్డినేటర్లు పేర్కొంటున్నారు.

కొనసాగింపా...కొత్త పథకమా ?

2010లో అక్షరాస్యత దినోత్సవం నాడు కేంద్రం శ్రీకారం చుట్టిన సాక్షర భారత్ మిషన్ గడవు సెప్టెంబర్ 30తో ముగిసింది. లక్ష్య సాధనలో భాగంగా ప్రభుత్వం 2017 డిసెంబర్ 31వరకు పథకాన్ని పొడిగించింది. ప్రభుత్వం నుంచి అధికారిక సమాచారం ఏదీ రాకపోవడం, మౌఖిక ఆదేశాలతోనే పథకాన్ని కొనసాగిస్తుండడంతో ప్రాజెక్టు కొనసాగింపుపై సందిగ్ధత నెలకొంది. ఏడాదికి పైగా కో ఆర్డినేటర్ల గౌరవ వేతనాలు పెండింగ్‌లో పెట్టుండటం దీనికి ఊతమిస్తోంది. పథకం కొనసాగింపుపై లిఖిత పూర్వకమైన అదేశాలు లేకపోవటంతో కొంత కాలంగా పలు ప్రాంతాల్లో వయోజన విద్యా కేంద్రాలు తెరుచుకోవటం లేదు. కాగా ఈ పథకం స్థానంలో మరో కొత్త పథకానికి కేంద్రం శ్రీకారం చుడుతున్నట్టుగా సమాచారం. సాక్షర భారత్ మిషన్‌ను కొనసాగించాలని కోరుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం గతంలోనే కేంద్రానికి లేఖ రాసింది. ఇప్పటి వరకు దీనిపై ఎటువంటి స్పందన రాలేదని అధికారులు పేర్కొంటున్నారు.

> **వేతనాలు పెంచి.. ఉద్యోగ భద్రత కల్పించాలి**
>
> 'నెలవారీ వేతనాలు పెంచటంతో పాటు ఉద్యోగ భద్రత కల్పించాలి. ఏడాదికి పైగా వేతనాలు లేకపోవటంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నాం. కుటుంబాలను పోషించేందుకు అప్పులు చేయాల్సి వస్తోంది. కేంద్రమంత్రి ప్రకాశ్ జావడేకర్‌ను కలిసి వినతిపత్రం సమర్పించినా ఎలాంటి ఫలితంలేకపోయింది. అసలు ఈ పథకం ఉంటుందో లేదో అర్థం కావటం లేదు. కొత్త పథకం ప్రారంభిస్తే తిరిగి మమ్మల్నే కొనసాగించాలి'
>
> **- రమేష్, కో ఆర్డినేటర్ల సంఘం రాష్ట్ర నాయకుడు**

साक्षर भारत
SAAKSHAR BHARAT

15 నెలలుగా వేతనాల్లేవ్..



(ఫైల్ ఫోటో)

సాక్షర భారత్ మిషన్‌లో మండల, గ్రామ కో ఆర్డినేటర్లు కీలకం. వయోజనులను అక్షరాస్యులుగా చేయటంతో పాటు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల ను ప్రచారం చేయటం లోనూ తమవంతు పాత్ర పోషిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దాదాపు 17.500 మంది గ్రామ కోర్డినేటర్లు, 500 మందిలోపు మండల కో ఆర్డినేటర్లు ఈ మిషన్లో పనిచేస్తున్నారు. మండల కో ఆర్డినేటర్లకు నెలకు రూ.6 వేలు. గ్రామ కో ఆర్డినేటర్లకు రూ.2 వేలను గౌరవ వేతనంగా చెల్లిస్తుంది. నిరక్షరాస్యు లను అక్షరాస్యులుగా చేస్తున్న కో ఆర్డినేటర్లకు 15 నెలలుగా గౌరవ వేతనాలు అందటం లేదు. దీంతో అప్పులు చేసుకుంటూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. అన్నమో రామచంద్రా అంటున్న వీరి దీన స్థితిపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించాల్సిన అవసరం ఉంది.

పవన్‌లాంటి పిచ్చోడిని చూడలేదు

- ఆయనకు ఒక్క ఓటు కూడా పడదు
- వర్గీకరణ బిల్లుపై అఖిలపక్ష సమావేశం..
- దళితులకో చట్టం.. దొరలకో చట్టమా?
- 27న భవిష్యత్ కార్యచరణ.. మంద కృష్ణ



హైదరాబాద్, జనవరి 24 (మనం న్యూస్): రాష్ట్రంలో చాలామంది పిచ్చోళ్లను చూశాను కానీ పవన్ లాంటి పిచ్చోడిని ఎక్కడా చూడలేదని మంద కృష్ణమాదిగ పేర్కొన్నారు. రెండు రాష్ట్రాల్లోనూ ఆయనకు ఒక్క ఓటు కూడా పడదని స్పష్టం చేశారు. రాష్ట్రంలో కేసీఆర్ పునాదులు కదులుతున్నాయని, వాటిని కాపాడుకునేందుకే పవన్ కల్యాణ్‌ను తిప్పుతున్నారని చెప్పారు. 21 రోజులుగా చంచల్‌గూడ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉంటున్న మందకృష్ణకు సిటీ సివిల్ కోర్టు మంగళవారం బెయిల్ మంజూరు చేసింది. అయితే, ఈ కేసు నిమిత్తం బుధవారం ఆయన సిటీ సివిల్ కోర్టుకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన కోదండరామ్ తదితరుల పర్యటనలకు అనుమతివ్వకుండా పవన్ కల్యాణ్‌కు మాత్రం ఎలా అనుమతిచ్చారని ప్రశ్నించారు. పవన్ యాత్రకు బందోబస్తు కల్పిస్తున్న ప్రభుత్వం.. తమను అరెస్టు చేయడానికి మాత్రం పోలీసులకు ఆదేశాలు జారీ చేస్తోందని ఆరోపించారు. పవన్ కల్యాణ్‌ను ప్రజలు ఓ సినీ నటుడిగానే చూస్తున్నారని వ్యాఖ్యానించారు. తెలంగాణకు వస్తే కేసీఆర్, ఆంధ్రకు వెళితే చంద్రబాబు పాలనను మెచ్చుకుంటూ, పవన్ భజన చేస్తున్నాడని ఆయన విమర్శించారు. అంతా బాగుంటే పవన్ ఎందుకు తిరుగుతున్నట్లని ప్రశ్నించారు. కాగా, ఈ పార్లమెంట్ సమావేశాల్లోనే ఎస్సీ వర్గీకరణపై బిల్లు తేవాలని, లేదంటే కేంద్రంపై ఒత్తిడి తెస్తామన్నారు. ఎస్సీ వర్గీకరణకోసం సీఎం కేసీఆర్ అధ్యక్షతన ఈ నెల 27లోపు అఖిలపక్షాన్ని ఢిల్లీకి తీసుకెళ్లాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో 27న భవిష్యత్ కార్యచరణ ప్రకటిస్తామని తెలిపారు.

ఒక్కరైనా.. ఒక్కసారైన కోర్టుకు హాజరయ్యారా?

'కేసీఆర్, హరీశ్ రావు, కేటీఆర్‌లపై గతంలో నాన్ బెయిలబుల్ కేసులు నమోదయ్యాయి. ఒక్కసారైనా వాళ్లు కోర్టుకు హాజరయ్యారా? రాష్ట్రంలో దళితులకు ఓ చట్టం.. దొరలకో చట్టమా? ఈ అన్యాయాన్ని గవర్నర్ దృష్టికి తీసుకెళ్లి, వారిపై ఉన్న కేసులు తిరగదోడి చట్టపరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా విన్నవిస్తా' అని మందకృష్ణ పేర్కొన్నారు. చట్టం దృష్టిలో అందరూ సమానులేనని వ్యాఖ్యానిస్తూ.. తనపై నాన్ బెయిలబుల్ కేసు లేకున్నా జైల్లో ఎందుకు పెట్టారని నిలదీశారు. ఈ విషయంలో గవర్నర్ నిష్పక్షపాతంగా వ్యవహరించాలన్నారు. కేసీఆర్ గతంలో పది రోజులు దీక్ష చేసినప్పుడు పట్టించుకోని పోలీసులు తనపై మాత్రం ఎందుకు వివక్ష చూపుతున్నారని మండిపడ్డారు. 48 గంటలు దీక్ష మొదలుపెట్టి 48 సెకన్లు కూడా చేయకుండానే తనను ఎందుకు అరెస్ట్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ఫిబ్రవరి 10న ప్రపంచ శాంతి సదస్సు

- గ్లోబల్ పీస్ కమిటీ వెల్లడి



హైదరాబాద్, జనవరి 24(మనం ప్రతినిధి): ఫిబ్రవరి 10న సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్‌లో ప్రపంచ శాంతి సదస్సును నిర్వహిస్తున్నట్టు గ్లోబల్ పీస్ కమిటీ పేర్కొంది. సోమాజీగూడ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో కమిటీ కోఆర్డినేటర్లు పెద్దిరెడ్డి, జీఎస్ సీలన్‌తో పాటు యూఎస్ నుంచి ఫోన్ ద్వారా కేఏ పాల్ మాట్లాడారు. ప్రపంచంలో శాంతి ఏర్పడాల్సిన అవసరం ఉందన్నారు. యుద్ధమేఘాలు, ఉగ్రవాదం పెరుగుతోందని ఆవేదన వ్యక్తంచేశారు. యుద్ధాలు, ఉగ్రవాదంతో ప్రపంచ వ్యాప్తంగా లక్షలాది మంది చనిపోతున్నారన్నారు. ఇరాక్, సిరియా తో పాటు పలు దేశాల్లో ఎంతో మంది చిన్నారులు మృత్యువాత పడ్డారని పేర్కొన్నారు. ప్రస్తుత పరిస్థితులలో ప్రపంచ శాంతి కోసం ప్రతి ఒక్కరూ పాటు పడాలన్నారు. 148 దేశాల్లో ప్రపంచ శాంతి సదస్సులను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇందులో భాగంగానే ఫిబ్రవరి 10న సాయంత్రం 6 గంటలకు నిర్వహించే సదస్సులో రాజకీయాలు, కుల, మతాలకతీతంగా ప్రజలు పాల్గొనాల ని కోరారు. ఈ సదస్సుకు హిందూ, ముస్లిం, క్రిస్టియన్ మత పెద్దలతో పాటు రాజకీయ నాయకులను ఆహ్వానించనున్నట్టు తెలిపారు. సమావేశంలో రవిప్రసాద్, ఫ్రాన్సిస్, పాల్గొన్నారు. ప్రపంచ శాంతి కోసం తనవంతు కృషి చేస్తున్న కేఏ పాల్‌ను కించపరుస్తూ కొందరు యూట్యూబ్‌లో అప్‌లోడ్ చేసిన వాటిని తొలగించాలని, లేని పక్షంలో కోర్టులో కేసు వేస్తామని కమిటీ సభ్యుడు వెంకటసాయి హెచ్చరించారు.


వృద్ధిలో జంతు సంపద

ఎల్లుండి నుంచి శాకాహార జంతువుల గణన

- జంతు గణనతో వెలుగులోకి
- మూడు రోజులుగా పులుల గుర్తింపు









హైదరాబాద్, జనవరి 24: మూడు రోజులుగా కొనసాగుతున్న పులులు, జంతువుల జాతీయ జనగణన తెలంగాణ అటవీ అధికారులు, సిబ్బందిలో ఆనందాన్ని నింపింది. గతంలో 2014 ఉమ్మడి రాష్ట్రంలో భాగంగా జరిగిన సర్వేతో పోలిస్తే తెలంగాణలో ప్రస్తుతం అటవీ జంతువుల సంచారం మెరుగైనట్లు అధికారులు వెల్లడించారు. తెలంగాణ అడవుల్లో మంచి స్థాయిలో వన్య మృగాలు, మాంసాహార జంతువులు నమోదు అవుతున్నాయని అధికారులు వెల్లడించారు. వారం రోజుల పాటు జరిగే జంతు గణనలో మొదటి మూడు రోజుల్లో అడవుల్లోని పలు బీట్లలో పులి, చిరుతు, ఎలుగుబంటి, నక్కలు, రేసు కుక్కల లాంటి మాంసాహార జంతువుల ఆనవాళ్లను పెద్ద సంఖ్యలో గుర్తించారు. పూర్తి శాస్త్రీయ పద్దతుల్లో జంతువుల లెక్కింపు ప్రక్రియ కొనసాగుతున్నట్లు అటవీ శాఖ ఉన్నతాధికారులు వెల్లడించారు. జంతువుల కాలి గుర్తులు, పెంటికలు, విసర్జితాలు, కళేబరాలు, చెట్లపై కాలిగోర్ల గుర్తుల ఆధారంగా ఏ ఏ జంతువులు ఏ అటవీ ప్రాంతాల్లో సంచరిస్తున్నాయో నమోదు చేశారు. పులుల సంరక్షణ ప్రాంతాలైన కవ్వాల్, అమ్రాబాద్ లో జంతువుల ఆనవాళ్లు ఆశించిన స్థాయిలో ఉన్నట్లు అక్కడి ఫీల్డ్ డైరెక్టర్లు వెల్లడించారు. కవ్వాల్, అమ్రాబాద్ అభయారణ్యాల్లో పులుల అడుగుల గుర్తులతో పాటు, వాటి ఆవాసంగా ఉన్న ప్రాంతాలను కూడా గుర్తించారు. కాగజ్ నగర్ అటవీ ప్రాంతంలోని బెజ్జూర్, పెంచికల్ పేట, పోతపల్లి, బొంబాయిగూడ బీట్లలో పులి పంజా గుర్తులను, సిర్పూర్ రేంజ్ లో చిరుత అడుగులను గుర్తించారు. ఇదే ప్రాంతంలోని ఏడు బీట్లలో ఎలుగుబంటి ఆనవాళ్లను అధికారులు నమోదు చేశారు. కదంబ అటవీ ప్రాంతంలో ఆర్టీసీ బస్ వెళ్తున్న మార్గంలో పులి కనిపించినట్లు, వెంటనే పులి రోడ్డు దాటి అడవిలోకి వెళ్లే దాకా డ్రైవర్ బస్సును ఆపారని అటవీ అధికారులు వెల్లడించారు. భూపాలపల్లి అటవీ ప్రాంతంలో చిరుత పులి, అడవి దున్నల సంచారాన్ని గుర్తించారు. అమ్రాబాద్ దట్టమైన అటవీ ప్రాంతం మల్లయ్య లొద్దిలో సర్వేలో పాల్గొన్న వాలంటీర్లను పులి కనిపించింది. మొత్తం 14 బీట్లలో చిరుతల సంచారం స్పష్టంగా ఉన్నట్లు అధికారులు తెలిపారు. అదిలాబాద్ అడవుల్లో పెద్ద సంఖ్యలో అడవి దున్నలు కూడా సర్వే చేస్తున్న సిబ్బంది కంటపడ్డాయి. ఈ నెల 22 నుంచి మొదలైన ఈ సర్వేలో అటవీ శాఖ మంత్రి జోగు రామన్న స్వయంగా పాల్గొన్నారు. కవ్వాల్ అభయారణ్యం పరిధిలో ఉట్నూరు సమీపంలో కోలంగూడ రేంజ్ లో మంత్రి సుమారు ఆరు కిలోమీటర్ల అటవీ ప్రాంతంలో పర్యటించి జంతువుల ఆనవాళ్లు అధికారులతో కలిసి గుర్తించారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న జంతువుల సర్వేలో అరణ్య భవన్ నుంచి ఉన్నతాధికారులు కూడా పాల్గొని పర్యవేక్షించారు. వరంగల్ రూరల్ జిల్లా నర్సంపేట రేంజ్ లో పీసీసీఎఫ్ (ఐ.టీ) రఘువీర్, కాగజ్ నగర్ ప్రాంతంలో అదనపు అటవీ సంరక్షణ అధికారి మునీంద్ర, కవ్వాల్ ప్రాంతంలో సునీల్ కుమార్ గుప్త , ఖమ్మం జిల్లాలో జరిగిన సర్వేలో ఎం.ప ధ్వీరాజ్. పలు జిల్లాల్లో జంతు జన గణన తీరును కలెక్టర్లు పర్యవేక్షించారు. కొందరు కలెక్టర్లు స్వయంగా అటవీ ప్రాంతానికి వెళ్లి సర్వేలో పాల్గొన్నారు. అటవీ అధికారులు, సిబ్బందితో పాటు సర్వేలో పాల్గొన్న వందలాది మంది వాలంటీర్లను పీసీసీఎఫ్(వైల్డ్ లైఫ్) డాక్టర్ మనో రంజన్ భాంజా, వైల్డ్ లైఫ్ ప్రత్యేకాధికారి శంకరన్ సమన్వయ పరిచారు. మిగతా మూడు రోజుల్లో శాఖాహార జంతువుల లెక్కింపుతో పాటు, ఆయా అటవీ ప్రాంతాల్లో ఉన్న వ క్ష, మొక్కల జాతుల గుర్తింపు, అడవుల్లో మనుషులు, పెంపుడు జంతువుల సంచారం నమోదు జరగనుంది.

మనం

జనం కోసం.. అక్షర యజ్ఞం..

గురువారం, జనవరి 25

పగుళ్లకు పరిష్కారం?

‘విభజిత ప్రపంచంలో భాగస్వామ్య భవిష్యత్‌ను సృజించడం’ అనే ఇతి వృత్తంతో స్విట్జర్లాండ్‌లోని దావోస్‌లో ప్రపంచ ఆర్థిక వేదిక (డబ్ల్యూఈఎఫ్) వార్షిక సమావేశంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ప్రారంభ ఉపన్యాసం దార్శనికతను సంతరించుకుంది. ఆత్మరక్షణ వాణిజ్య విధానాన్ని, దేశీయ దృక్కోణంలోని ఆర్థిక విధానాలను ఆయన నిశితంగా విమర్శించారు. విభజనలు/పగుళ్లు లేని ‘స్వేచ్ఛా స్వర్గాన్ని’ నిర్మించాలని ఆయన పిలుపునిచ్చారు. ప్రపంచ ఆర్థిక, సామాజిక, రాజకీయ పరిస్థితులు భయాందోళనలకు గురిచేస్తున్నాయని చెబుతూ ప్రపంచ మానవ సంబంధాలు, దేశాలలోని అంతర్గత సంబంధాలు, దేశాల మధ్య సంబంధాలు, వర్తమానం-భవిష్యత్‌కు మధ్య, ప్రస్తుత అవసరాలు-భవిష్యత్ పరిరక్షణ అవసరాలకు మధ్య సంబంధాలు అన్నీ పగుళ్లు బారిపోయాయని, తీవ్రంగా విభజితమయ్యాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. వాతావరణ మార్పు, ఉగ్రవాదం, ప్రతి-ప్రపంచీకరణ అనే మూడు సమస్యలు అంతర్జాతీయ సమాజాన్ని వేధిస్తున్నాయని, వాటికి వ్యతిరేకంగా భారత్ రాజీలేకుండా పోరాటం చేస్తుందని మోదీ హామీ ఇచ్చారు. అదే సమయంలో ప్రపంచ ఆర్థిక కార్యకలాపం క్రమంగా కోలుకుంటోందని, ప్రపంచ స్థూల దేశీయోత్పత్తి, వాణిజ్య పారిశ్రామిక ఉత్పత్తి, వ్యాపార, వినియోగదారుల్లో ఆత్మవిశ్వాసంలో వృద్ధి కనిపిస్తోందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. శతాబ్దాలుగా ఘనసంస్కృతీ సంప్రదాయాలకు, శాంతి సుహృద్భావాలకు నెలవైన, ఆర్థిక వాణిజ్య విధానాలపరంగా రూపాంతరం చెందుతున్న భారత్ విభజిత ప్రపంచం పూర్తిగా కోలుకునేందుకు సహకరించగలదని, విదేశీ పెట్టుబడులకు లాభదాయక గమ్యంగా నిలుస్తుందని దావోస్‌లో మోదీ ప్రపంచ ప్రతినిధులకు వివరించారు. ప్రపంచ ఆర్థిక సంక్షోభం కారణంగా అభివృద్ధి చెందిన పారిశ్రామిక దేశాలు ప్రపంచీకరణ విధానాలకు స్వస్తిచెప్పి, ప్రస్తుతం రక్షణాత్మక వాణిజ్య, ఆర్థిక విధానాలకు తిరోగమిస్తున్న వేళ మోదీ పిలుపునకు ఏమాత్రం వాళ్ళు స్పందిస్తారో కష్టసాధ్యమే. విదేశీ ప్రత్యక్ష పెట్టుబడులపై ఆధారపడి ఆర్థిక వికాసాన్ని సాధించాలనే లక్ష్యంతో ఉన్న మోదీ ఆశించిన రీతిలో పెట్టుబడులు రాబట్టగలగడం అత్యంత కష్టసాధ్యమైన వ్యవహారమే. ప్రపంచంలో పెరిగిపోతున్న అసమానతల గురించి చర్చించడమే తప్ప కార్యాచరణ ప్రణాళికలేమీ లేని ఈ సదస్సు వల్ల భారత్‌కు ఎలాంటి ప్రయోజనం చేకూరుతుందో సందేహమే!

జర్మన్ ఆర్థికవేత్త క్లాస్ ష్వాబ్ 1971లో రూపొందించిన ‘ఐరోపా నిర్వహణ వేదిక’ పదహారేళ్ళ తరువాత పేరు మార్చుకొని డబ్ల్యూఈఎఫ్‌గా అవతరించింది. వర్తమాన ప్రపంచ ధోరణులపైనా, పర్యవసానంగా పుట్టుకొచ్చిన సమస్యలపైనా, వాటి వల్ల కలిగే ప్రమాదాలపైన మేధో మథనం చేయడం, పరిష్కారాలను సూచించటం డబ్ల్యూఈఎఫ్ వార్షిక సమావేశాల ముఖ్య ఉద్దేశం. ప్రపంచ ఆర్థిక సంక్షోభానికి పరిష్కారం దొరకుతుందేమోనన్న ఆశతో దావోస్ సమావేశానికి దాదాపు వంద దేశాల నుంచి ప్రపంచ కుబేరులు, రాజకీయ నాయకులు, వివిధ దేశాధిపతులు, ఆర్థిక మంత్రులు, బ్యాంకర్లు, మేధావులు, కార్పొరేట్ సంస్థల ప్రతినిధులు, మీడియా ప్రతినిధులు హాజరయ్యారు. 1997లో ప్రధాని దేవెగౌడ ఈ సదస్సులో పాల్గొన్నపుడు రూ.26 కోట్లున్న భారత్ జీడీపీ ఇప్పుడు ఆరురెట్లు పెరిగిందని మోదీ తన ప్రసంగంలో ఉటంకిస్తూ వివిధ విప్లవాత్మక అభివృద్ధి పథకాలు, మౌలిక సంస్కరణలు, ఆర్థిక ద్రవ్యవిధానాల అమలు వల్ల ఇదంతా సాధ్యమైనట్టు మాట్లాడారు. విదేశీ పెట్టుబడులకు లాభదాయక గమ్యంగా భారత్‌ను తీర్చిదిద్దినట్లుగా సంకేతాలు తన ప్రసంగంలో వ్యక్తం చేశారు. భూగోళంపై ఒక్క శాతం ధనికుల వద్ద మిగిలిన ప్రపంచ ప్రజల వద్ద ఉన్న సంపద కంటే చాలా ఎక్కువని మోదీ దావోస్ ప్రసంగానికి ఒకరోజు ముందు విడుదలైన ఆక్స్‌ఫామ్ నివేదిక వెల్లడించింది. ఆర్థిక సంస్కరణల వల్ల పెరిగిన భారత్‌తో సహా ప్రపంచ దేశాల సంపద ఒక్క శాతం సంపన్నుల వద్ద పోగవుతుంటే అంతర్జాతీయ సమాజం శాంతియుతంగా ఎలా బతకగలదు? ఇలాంటి సవాళ్లపై వాణిజ్య దృక్కోణంతో జరిగే దావూస్ సదస్సు ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో సర్వవిదితమే. సమ్మిళిత వృద్ధిలో పొరుగునున్న పాకిస్తాన్, శ్రీలంక, నేపాల్ కంటే వెనుకబడి ఉందన్న ఆ నివేదిక అంచనాలు కొనుగోలుశక్తి సన్నగిల్లిన భారతీయ మార్కెట్ బలహీనతలను చెప్పకనే చెబుతోంది. ఈ నేపథ్యంలో ప్రపంచబ్యాంకు రూపొందించే వాణిజ్య సౌలభ్యతా సూచిక (ఈడీబీ)లో భారత్ ర్యాంకింగ్ పెరిగినప్పటికీ ప్రత్యక్ష మదుపుల రాక సందేహాస్పదమే.

ప్రపంచ ఆర్థిక సంక్షోభ సమయంలోనూ దేశం ఆర్థికంగా నిలదొక్కుకుందంటే దానికి ప్రధాన కారణం మన ప్రభుత్వాలు రూపొందించిన ఆర్థిక, ద్రవ్య సంస్కరణల్లో లేవు. అందుకు భిన్నంగా అంతర్జాతీయ మార్కెట్‌లో క్షీణిస్తున్న చమురు ధరలు, వినియోగ ఆధారిత స్వయం సంపూర్ణ గ్రామీణ ఆర్థిక విధాన అవశేషాలు ఇప్పటికీ వ్యవసాయ రంగంలో ప్రధాన భూమిక పోషిసున్న కారణంగా మన ఆర్థిక వ్యవస్థ వాణిజ్య లోటుభారం క్రమంగా తొలిగిపోవడమేనని ఆర్థికవేత్తలు చెబుతున్నారు. అయితే మన చమురు వినియోగంలో 80 శాతం దిగుమతులపైనే ఆధారపడి ఉన్నందున, ప్రస్తుతం అంతర్జాతీయ చమురు ధరలు వేగంగా పెరుగుతుండడంతో మన విదేశీ మారక ద్రవ్య నిల్వలు హరించుకుపోతున్నాయి. దీని ప్రభావంతో దేశ ఆర్థిక వ్యవస్థ అస్తవ్యస్తమయ్యే ప్రమాదం ముంచుకొస్తోంది. దేశ ప్రజల కొనుగోలు శక్తి పెరిగేందుకు దోహదం చేసే వ్యవసాయం, పారిశ్రామిక విధానాల సమన్వయంతో రూపొందిన వ్యాపార-వాణిజ్య విధానమే దేశ ఆర్థిక సుస్థిరతను సాధించగలదని ప్రత్యామ్నాయ ఆర్థికవేత్తల అభిప్రాయం. ప్రపంచ పగుళ్ళను మోదీ సరిగా గుర్తించారే గానీ, వాటిని పూడ్చేందుకు ఆయన విధ్వంసకర ప్రపంచీకరణ విధానాలపై ఆధారపడుతున్నారు. విదేశీమదుపుల ప్రవాహంపై ఆధారపడిన విధానాలు ‘అరువు సొమ్ము బరువు చేటు’ అన్న నానుడి మాదిరిగా ఆర్థిక వ్యవస్థను తయారుచేసే ప్రమాదం ఉంది. ఆహార పోషకాలు, ఖనిజాల రూపంలోని భూసారం, ప్రపంచ ప్రజలు ఉమ్మడిగా సృష్టిస్తున్న సంపద ఒక్క శాతం సంపన్నుల బొక్కసాల్లోకి డాలర్లుగా సమీకృతమయ్యే ఆర్థిక విధానం స్థానంలో ప్రత్యామ్నాయ పర్యావరణరహిత, సమ్మిళిత రాజకీయార్థిక విధానాన్ని తీసుకురాగలితేనే ప్రపంచపగుళ్ళకు సహేతుక పరిష్కారం లభిస్తుంది. ●

కుడితిలో పడ్డ ఎలుక!

కవిత

అది మొదలే చిట్టెలుక / పైగా కుడితిలో పడింది!
పట్టు దొరకక దరులు పట్టుక వేలాడుతది!

కొండ గట్టు హనుమన్న / ముడుపులు చెల్లిస్తే అభయమిస్తడు
అవసరానికి ఆదుకొనేది మనమే కదా!

అటూఇటూ / జనరంజక పాలనే అన్నాక
నీ ఈ పిడకల వేటెందుకు?!

వెండితెర పీడ కలయ్యిందా / అజ్ఞాత వాసం వీడి
జనంలోకి వస్తే ఫాయిదా ఉంటదా?!

రాజకీయాల్లో స్కిప్పులుండవు
టేకులు తీసుకునే వీలుండదు!

తమ్మునికి అనుభవం రావాలి / సందర్భాలు తిరగబడంది
అన్న చూపిన దారి గుర్తుకు రాదు!!

- కోట్ల వెంకటేశ్వర రెడ్డి
9440233261



మంచిమాట



‘చావు బతుకులు ఎక్కడో లేవు... ధైర్యంలోనే బతుకు ఉంది. భయంలోనే చావు ఉంది.’

- స్వామి వివేకానంద

ముందస్తుకు మోదీ వ్యూహం

‘ఒకే దేశం – ఒకే ఎన్నికలు’ నినాదంతో గడువుకన్నా ముందే లోక్‌సభకు ఎన్నికలు జరపాలని ప్రధాని నరేంద్ర మోదీ తొందరపడుతున్నారు. లోక్‌సభతో పాటు వీలయినన్ని అసెంబ్లీలకు కూడా ఎన్నికలు జరపాలని సన్నాహాలు చేస్తున్నారు. ఎన్డీయే భాగస్వామి అయిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సైతం అక్టోబర్, నవంబర్‌లోనే ఎన్నికలు రావచ్చని, సిద్ధంగా ఉండాలని పార్టీ నాయకులను అప్రమత్తం చేయడం గమనార్హం. గుజరాత్ ఎన్నికల సందర్భంగా దేశంలో మోదీ చరిష్మా తగ్గుముఖం పట్టినట్లు, ఆయన పాలన పట్ల రైతులు, యువతలో అసంతృప్తి పెరుగుతూ ఉండటం స్పష్టమైంది. ఈ పరిస్థితులు మరింతగా విషమించక ముందే ఎన్నికలకు వెళ్లాలనే ఆలోచనగా కనిపిస్తున్నది. ఈ వర్గాలను ప్రసన్నం చేసుకోవడానికి ఫిబ్రవరి 1న అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టనున్న చివరి బడ్జెట్‌లో కసరత్తు చేస్తున్నట్లు కూడా వార్తలు వస్తున్నాయి.

దావోస్‌లో ప్రతి ఏటా జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సుకు సాధారణంగా ప్రధానులెవరూ హాజరు కావడం లేదు. గతంలో దేవెగౌడ మాత్రమే ఒకసారి హాజరయ్యారు. కానీ ఈ ఏడు మోదీ హాజరు కావడం ప్రాధాన్యం సంతరించుకున్నది. 2019 ప్రథమార్థంలో జరుగవలసిన లోక్‌సభ ఎన్నికలు ఆరునెలల ముందే 2018లో నవంబర్ నాటికి జరిపే సూచనలు కనిపిస్తున్నాయి. ఈ సంవత్సరం అక్టోబర్, నవంబర్‌లో బీజేపీ అధికారంలో ఉన్న మధ్యప్రదేశ్, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లతో పాటు కాంగ్రెస్ అధికారంలో ఉన్న కర్ణాటక, మిజోరాంలలో ఎన్నికలు జరుగవలసి ఉంది. వచ్చే సంవత్సరం జరగాల్సిన లోక్‌సభ ఎన్నికలతో పాటు ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, ఒడిసా, అరుణాచల్‌ప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు జరుగవలసి ఉంది. వీటన్నింటికీ కలిపి – అంటే 9 రాష్ట్రాలకు లోక్‌సభతో పాటు 2018లోనే అక్టోబర్, నవంబర్‌లలో ఒకేసారి ఎన్నికలు జరిపే సన్నాహాలు చేస్తున్నారు. మరోవంక 2019లోనే తదుపరి ఎన్నికలు జరుగ వలసిన బీజేపీ పాలక మహారాష్ట్ర, హర్యానాలతో పాటు నితీష్‌కుమార్‌తో అధికారం పంచుకొంటున్న బిహార్‌లో ఒక సంవత్సరం ముందుగా ఎన్నికలు జరిపే అవకాశం ఉంది.

ఢిల్లీ అసెంబ్లీలో 20 మంది ఆప్ ఎమ్మెల్యేలు అనర్హతకు గురవడంతో కొద్దీ నెలల్లో ఉపఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఆప్ కనుక అత్యధిక స్థానాలలో ఓటమి చెందితే అరవింద్ కేజ్రీవాల్ ప్రభుత్వం మనుగడ ప్రశ్నార్థకమై, లోక్‌సభతో పాటు ఎన్నికలు జరపవలసిన పరిస్థితులు ఏర్పడవచ్చు. ఈ విధంగా ఒకేసారి ఎన్నికలు జరపడం వల్ల ఎన్నికల వ్యయాన్ని తగ్గించడం కోసమే కాకుండా ఐదారు నెలలకు ఏదో ఒకచోట ఎన్నిక ఉండడంతో అక్కడ గెలవడం కోసం దృష్టిసారిస్తూ ఉండవలసి రావడంతో ప్రభుత్వ పాలన నుంచి దృష్టి మళ్లించవలసి వస్తున్నదని మోదీ చెబుతున్నారు. ఒకసారి ఎన్నికలు జరిగిన తరువాత అధికారంలోకి వచ్చే ప్రభుత్వాలకు ఐదేళ్లపాటు అభివృద్ధి పట్ల, పరిపాలన పట్ల దృష్టి సారించేందుకు ఒకేసారి ఎన్నికలు అవసరమని పేర్కొంటున్నారు.

2019 ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని మోదీకి అనుకూలంగా ముద్రపడిన రిపబ్లిక్ టీవీ సీ ఓటర్‌తో కలిపి తాజాగా అత్యంత విస్తృతంగా జరిపిన సర్వేలో సైతం ప్రస్తుతం ఉన్న సీట్లే అటూఇటూగా గెలుపొందే అవకాశం ఉన్నట్లు పేర్కొనడం గమనార్హం. అయితే గుజరాత్‌లో వలే వైరుధ్య రాజకీయ, సామాజిక ప్రయోజనాలు గల వర్గాలు, పార్టీలను బీజేపీకి ఒకతాటిపైకి తీసుకు రాగలిగితే ప్రధాని ఆత్మరక్షణలో పడే ప్రమాదం కూడా లేకపోలేదని పరిశీలకులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ప్రభుత్వాలు ప్రజావ్యతిరేకతను ఎదుర్కొంటున్నాయంటున్నారు. ఈ వ్యతిరేకతను మోదీ చరిష్మా ఏమేరకు కట్టడి చేయగలరన్నది ప్రశ్నార్థకరంగా మారనున్నది. ఇప్పటికే వచ్చే ఎన్నికల్లో 350 సీట్లు గెలుచుకోవాలని బీజేపీ అధ్యక్షుడు అమిత్ షా లక్ష్యాన్ని నిర్ణయించుకున్నారు. అందులో బీజేపీ స్వయంగా 300కు పైగా సీట్లు పొందాలని భావిస్తున్నారు. ఆ వ్యూహంలో భాగంగానే 2013లో తెగిపోయిన అనుబంధాన్ని తిరిగి నితీష్‌కుమార్‌తో ఏర్పర్చుకోగలిగారు. పార్టీ బలహీనంగా ఉన్న తూర్పు, దక్షిణ రాష్ట్రాలపై ముఖ్యంగా దృష్టి సారిస్తున్నారు. కర్ణాటకలో తిరిగి బీజేపీని అధికారంలోకి తీసుకు రావడంతో పాటు తమిళనాడులో ఫలవంతమైన పొత్తులకు ప్రయత్నాలు చేస్తున్నారు. రజనీకాంత్ రాజకీయ రంగప్రవేశం చేయడం కూడా ఈ ప్రణాళికలో భాగంగా పలువురు భావిస్తున్నారు. అయితే యడ్యూరప్ప వలే ప్రజాకర్షణ గల నాయకుడు కర్ణాటకలో తప్ప మరే దక్షిణాది రాష్ట్రంలో లేకపోవడం బీజేపీ ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య. సిద్దరామయ్య నాయకత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం సొంత తప్పిదాల కారణంగా ప్రజలలో అప్రతిష్టకు గురవుతున్నా, బీజేపీ ముఖ్యమంత్రి అభ్యర్థి యడ్యూరప్ప ప్రజాకర్షణ గల నాయకుడిగా ముందంజలో ఉన్నా బీజేపీలో నెలకొన్న కలహాలు ఆయనను వెనుకకు లాగుతున్నాయి. రాష్ట్రంలో ప్రజాకర్షణ ఏమాత్రం లేని మిగిలిన బీజేపీ నేతలంతా ఆయనను బలహీనుడిగా చేయడం కోసం శక్తివంచన లేకుండా ప్రయత్నం చేస్తూనే ఉన్నారు.




> మరో ఐదేళ్ల పాటు మోదీ ప్రధానిగా కొనసాగడం ఖాయమంటూ ఆయన ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రాజకీయ ప్రత్యర్థులు సైతం అభిప్రాయపడ్డారు. ఇప్పటికి కూడా అయన తిరిగి బీజేపీని గెలిపించలేరనే అనుమానాలను ఎవరూ వ్యక్తం చేయడం లేదు. మోదీ శిబిరంలో అంతగా భరోసా కనిపించడం లేదు. జాగ్రత్త పడకపోతే అసలుకే మోసం వస్తుందనే భయం వెంటాడుతున్నట్లున్నది. అందుకనే అనేక సర్దుబాట్లకు సిద్ధమవుతున్నారు.

ఒడిసాలో బీజేపీ ప్రబలమైన రాజకీయశక్తిగా ఎదుగుతున్నా, బిహార్‌లో బీజేపీతో చేతులు కలపిన తర్వాత నితీష్ కుమార్ చరిష్మ కోల్పోతున్నారని కథనాలు వెలువడుతున్నాయి. ఆర్‌జేడీ అధినేత లాలూ జైల్లో ఉండటం బీజేపీకి కలసివచ్చే అంశమే అయినా కొత్తగా పెంచుకొనే బలం ఆ రాష్ట్రంలో లేదు. ఉత్తరప్రదేశ్‌లో కూడా ప్రతిపక్షాల అనైక్యతే బీజేపీ బలంగా కనిపిస్తున్నది. ప్రతిపక్షాలు ఉమ్మడి అభ్యర్థులను నిలబెడతారనే భయంతోనే ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, ఉపముఖ్యమంత్రి కేశవ్ మౌర్య శాసనసభకు పోటీ చేయడానికి వెనుకడుగు వేశారు. ప్రతిపక్ష ఎమ్మెల్సీలను ఆకర్షించి, వారితో పదవులకు రాజీనామాలు చేయించి, ఆ స్థానాలకు జరిగిన ఉపఎన్నికలలో శాసన మండలికి ఎన్నిక కావలసిన దుస్థితి ఏర్పడింది.

వ్యూహాత్మకంగా కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఇప్పటివరకు బీజేపీ విధానాలుగా ముద్రపడిన ‘హిందుత్వ’ తరహా విధానాలను ఇప్పుడు అనుసరిస్తున్నారు. ఎక్కడికి వెళ్లిన ప్రముఖ హిందూ దేవాలయాలను సందర్శించడం, తాను హిందువే అని స్పష్టంచేయడం, హిందువుల మనోభావాలను గాయపరచకుండా జాగ్రత్తగా అడుగులు వేస్తున్నారు. ఇప్పటివరకు కాంగ్రెస్ అనుసరిస్తున్న ‘సెక్యూలర్’ తరహా రాజకీయాలకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. పైగా, ‘హిందూ ఉగ్రవాదం’, ‘హిందూ తీవ్రవాదులు’ వంటి పదాలను బీజేపీ నాయకులను ఉద్దేశించి ఉపయోగించరాదని కాంగ్రెస్ నాయకులను ఆదేశించారు. దశాబ్దం క్రితం అమెరికా రాయబారిని కలసినప్పుడు ‘హిందూ ఉగ్రవాదం భారత దేశానికి అత్యంత ప్రమాదకారి’ అని పేర్కొన్నట్లు వార్తలు వచ్చాయి. ఇప్పుడు అందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. ఇప్పటికీ కాంగ్రెస్‌తో కలసి మహాకూటమి ఏర్పాటు కోసం ఇతర ప్రతిపక్షాలు ఏవీ ఆసక్తి చూపడం లేదు. అయినా తమ రాజకీయ ఉనికి కోసమైనా జాతీయ స్థాయిలో మోదీని వ్యతిరేకించే వారంతా రాహుల్ నాయకత్వాన్ని బలోపేతం చేయక తప్పని పరిస్థితులు నెలకొంటున్నాయి.

మరోవంక ‘మోదీ అభివృద్ధి’ (వికాస్)కి సూచికగా తనను ప్రజలు గుర్తించే విధంగా చేసుకోవడానికి ప్రయత్నం చేస్తున్నారు. ‘హిందూ తీవ్రవాద విధానాలు’ వ్యక్తపరచకుండా పార్టీ నాయకులను కట్టడి చేస్తున్నారు. ఈ సందర్భంగా ఇతర మతస్థులపై తీవ్రవాద పదజాలం ఉపయోగించి నేతగా పేరొందిన విశ్వ హిందూ పరిషత్ అధినేత ప్రవీణ్ తొగాడియా దూకుడు తగ్గించే ప్రయత్నం చేయడం గమనార్హం. అయితే ఆర్‌యస్‌యస్ నాయకత్వం మాత్రం ‘హిందుత్వ’ నినాదమే బీజేపీని కాపాడగలదనే నిశ్చితాభిప్రాయంలో ఉన్నది. అందుకే కర్ణాటక ఎన్నికల కోసం యోగి ఆదిత్యనాథ్‌తో విస్తృతంగా చాలాముందు నుంచే ప్రచారం చేయిస్తున్నది. ఇక్కడ మోదీ వికాస్ నినాదం కన్నా, యోగి హిందుత్వవాదమే ప్రముఖంగా వినిపిస్తున్నది. మరో ఐదేళ్ల పాటు మోదీ ప్రధానిగా కొనసాగడం ఖాయమంటూ ఆయన ప్రధానిగా పదవీ బాధ్యతలు చేపట్టిన రోజు నుంచి రాజకీయ ప్రత్యర్థులు సైతం అంటూ వస్తున్నారు. ఇప్పటికి కూడా అయన తిరిగి బీజేపీని గెలిపించలేరనే అనుమానాలను ఎవరూ వ్యక్తం చేయడం లేదు. మోదీ శిబిరంలో అంతగా భరోసా కనిపించడం లేదు. జాగ్రత్త పడకపోతే అసలుకే మోసం వస్తుందనే భయం వెంటాడుతున్నట్లున్నది. అందుకనే అనేక సర్దుబాట్లకు సిద్ధమవుతున్నారు. తొలి నుంచి కేంద్ర మంత్రివర్గంలో ప్రధానికి ప్రధానమైన ప్రత్యర్థిగా కొనసాగుతున్న హోమ్ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో మోదీ, అమిత్ షా ఇప్పుడు సర్దుబాటు చేసుకున్నట్లు కనిపిస్తున్నది. ఐదుగురు సీనియర్ మంత్రులలో ఇప్పుడు నితిన్ గడ్కరీ మాత్రమే ప్రధానితో సంబంధం లేకుండా స్వతంత్రంగా వ్యవహరిస్తున్నారు. గుజరాత్ అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న కేంద్రమంత్రులు జైట్లీతో పాటు రాజ్‌నాథ్ ఉండగా గడ్కరీ మాత్రం అటువైపు చూడనే లేదు. ప్రధానిగానీ, జైట్లీ, రాజ్‌నాథ్ గానీ లేదా తానుగానీ చెప్పినదే పార్టీ విధానంగా పరిగణించాలని కొద్దీరోజుల క్రితం అమిత్ షా పేర్కొనడం గమనార్హం. యూపీ ఎన్నికల సమయంలో సీఎం అభ్యర్థి ఎంపిక విషయంలో కూడా కనీసం సంప్రదించకుండా రాజ్‌నాథ్‌ను దూరంగా ఉంచారు. అయితే ఆయనతో సుమారు 120 మంది పార్టీ యంపీలు ఉన్నారనే ప్రచారం జరగడంతో జాగ్రత్త పడుతున్నట్లు భావిస్తున్నారు.

◆ చలసాని నరేంద్ర
9849569050



జాతీయ ధార్మిక ట్రైబ్యునల్ అవసరం

‘హైకోర్టు, సుప్రీంకోర్టులకు న్యాయమూర్తులను ఎంపిక చేసేటప్పుడు వారికి భారతదేశ చరిత్ర, సంస్కృతి, మతాచారాల వంటి వాటి పట్ల గాఢమైన అవగాహన ఉండాలి. హైందవ ధర్మంపట్ల విశ్వాసం ఉన్న అత్యధికులుండే దేశంలో ఈ అర్హత వాంఛనీయం’ అని 2015లో తమ లక్షలాది భక్తులు, శాఖల తరపున శ్రీ అహోబిల మఠం కేంద్ర ప్రభుత్వానికి విన్నవించుకున్నది. అలా కుదరని పక్షంలో మతానికి సంబంధించిన వివాదాల విచారణకు ప్రత్యేకంగా జాతీయస్థాయిలో ఒక ధార్మిక వ్యవస్థను ఏర్పాటు చేయాలని సూచించింది. ఈ సూచనకు స్వర్గీయ జస్టిస్ సి.పి.రామస్వామి అయ్యర్ అధ్యక్షతన ఏర్పాటైన హిందూ మతధార్మిక వ్యవహారాల కమిషన్ 1962లో సమర్పించిన సిఫార్సులను కూడా అందులో తెలియచేసింది.



హిందూ మత విశ్వాసాలకు సంబంధించిన వివాదాలను పరిష్కరించే క్రమంలో మతాచారాలకు భిన్నంగా న్యాయవ్యవస్థ సొంతంగా నిర్ణయాలు తీసుకోవడం చాలా సందర్భాలలో జరిగింది. దానితో హిందూ మతాచారాలు, ధర్మాలలో మాత్రమే కోర్టులు జోక్యం చేసుకోవడమేమిటన్న ప్రశ్నకు అవకాశం ఇచ్చినట్లవుతున్నది. ఈ విధమైన అభిప్రాయాలకు రావడానికి కారణం-సంకుచితంగా వ్యవహరించే లేదా హిందూ ధర్మంపట్ల విశ్వాసం లేని ఏ స్వచ్ఛంద సేవా సంస్థో ప్రజాప్రయోజన వ్యాజ్యాన్ని (పిల్) ఒక సానుకూల అస్త్రంగా వాడుకుని-సహస్రాబ్దాలుగా, శతాబ్దాలుగా నిర్విఘ్నంగా సాగుతున్న మతాచారాలను తొలగించడానికి నిర్విరామంగా కృషిచేస్తున్నాయి. విజయం కూడా సాధిస్తున్నాయి.

దీనికి ఉదాహరణలుగా ఎన్నో చెప్పవచ్చు. ఇటీవల జరిగిన వాటినే చూద్దాం. అమర్‌నాథ్ గుహ ఒక అద్భుతం. హిందువులకు అది ప్రాణప్రదమైన క్షేత్రం. అక్కడ గుహలో ‘భంభం భోలే’ అని, ‘ఓం నమః శివాయ’ అని భక్తులు గట్టిగా పలకడాన్ని, నినదించడాన్ని జాతీయ హరిత ట్రైబ్యునల్ నిషేధించింది. (దేశవ్యాప్తంగా ఒక్కసారి నిరసన పెల్లుబుకడంతో అబ్బే అసలు అటువంటి ఆదేశాలేవీ తామివ్వలేదని తరువాత తోకముడవడం వేరే విషయం). కేరళ శబరిమల అయ్యప్ప దేవస్థానానికి సంబంధించి హైకోర్టు సమర్థించిన ఒక ఆచారాన్ని విచారించడానికి సుప్రీంకోర్టు ఒక ధర్మాసనాన్ని నియమించింది. ఎన్నని చెప్పాలి? దీపావళి నాడు టపాసులు కాల్చొద్దు, జల్లికట్టుకు దూరంగా ఉండాలి, అభిషేకంలో ఎటువంటి పదార్థాలు వాడాలంటే.. ఇలా ఎన్నో వారే నిర్ణయించుకుంటూ పోతున్నారు. జాతీయ హరిత ట్రైబ్యునల్ తరహాలో మతపెద్దలతో ఒక ధార్మిక ట్రైబ్యునల్‌ను ఏర్పాటు చేస్తే ఇటువంటి సమస్యలు తలెత్తవు కదా!

స్వామి దయానంద సరస్వతి కేసులో రామస్వామి అయ్యర్ కమిషన్ సిఫార్సుల అమలు వ్యవహారం ఇప్పుడు సుప్రీంకోర్టు పరిశీలనలో ఉంది. దీనిలో ఒక కక్షిదారుగా శ్రీ అహోబిల మఠం కూడా ఉంది. ఈ నివేదికకు తగు ప్రాధాన్యతనిచ్చి జాతీయ ధార్మిక ట్రైబ్యునల్ ఏర్పాటుకు ప్రభుత్వాన్ని ఆదేశిస్తే బాగుండునని అసంఖ్యాక హిందూ భక్తులు కోరుకుంటున్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాల్లోని హిందూ ధార్మిక సంస్థల నిర్వహణ, పాలన ఒకే విధంగా ఉండడానికి తోడ్పడే చట్టం తీసుకురావాలని కూడా వీరు మనసారా కోరుకుంటున్నారు. అది జరిగినప్పుడు హైందవ ధార్మిక సంస్థలు రాష్ట్ర ప్రభుత్వాల పెత్తనం నుంచి విముక్తి పొందుతాయి.

◆ సి.ఎస్.రంగరాజన్
వంశపారంపర్య అర్చకులు
చిలుకూరు బాలాజీ టెంపుల్
9885100614

‘శేష’ జీవితంలోనూ సేవాతత్పరుడు!

టీఎన్ శేషన్- అంటే తెలియని వారుండరు. అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలోని ఎన్నికల వ్యవస్థలో నూతన సంస్కరణల ఒరవడికి శ్రీకారం చుట్టిన మహోన్నత వ్యక్తి. దేశంలో 10వ కేంద్ర ఎన్నికల ప్రధాన అధికారిగా, గొప్ప పరిపాలనాధ్యక్షుడిగా టీఎన్ శేషన్ పేరు గడించారు. కేరళలో పుట్టిన శేషన్ ఐఏఎస్ హోదాతో వివిధ శాఖల్లో పదవులు ఎక్కువగా తమిళనాడులో నిర్వహించి ‘తమిళనాడు శేషన్’ (టీఎన్ఎస్) అక్కడే స్థిరపడ్డారు. గత డిసెంబర్ 15న పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్న సందర్భంలో ఇటీవల పత్రికల్లో దర్శనమిచ్చారు. భారత ఎన్నికల వ్యవస్థలో విప్లవాత్మక మార్పులు చోటు చేసుకున్న సందర్భంలో జనవరి 25న ప్రభుత్వం జరపబోయే ‘జాతీయ ఓటర్ల దినోత్సవం’ను పురస్కరించుకొని శేషన్ గురించి, సేవలను గుర్తుచేసుకోవడం మన బాధ్యత. కేరళ రాష్ట్రం పాలక్కాడ జిల్లా తిరునెల్లై గ్రామంలో జన్మించిన రామన్ మెగసెసే పురస్కార గ్రహీత తిరునెల్లై నారాయణ అయ్యర్ శేషన్ (టీఎన్ శేషన్) ఐఏఎస్ సర్వీసులో తమిళనాడులోని కోయంబత్తూరు, దిండిగల్ జిల్లాల్లో సహాయ కలెక్టర్‌గా, మదురై కలెక్టర్‌గా, రవాణ శాఖ డైరెక్టర్‌గా, వ్యవసాయ, కార్మిక శాఖల కార్యదర్శిగా పదవులు చేపట్టారు. ప్రధాన ఎన్నికల సంఘంలో 10వ ప్రధానాధికారిగా 1990 నుంచి 1996 వరకు పనిచేశారు. దక్షిణ భారతదేశం నుంచి ఆర్థిక సంస్కరణలతో ప్రధాని పి.వి.నరసింహారావు పేరు ప్రఖ్యాతలు గడించగా, మరోపక్క ఎన్నికల సంస్కరణలతో తనదైన శైలిలో విప్లవాత్మక మార్పులు తెచ్చిన వ్యక్తిగా శేషన్ రెండవవారు.



శేషన్ తన విధులలో ముఖ్యంగా ఎన్నికల సంఘం నిర్ణయాలలో నిక్కచ్చిగా వ్యవహరిస్తూ, మీడియాను సైతం అరవై అడుగుల దూరంలో ఉంచేవారు. ఆయన ప్రవేశపెట్టిన సంస్కరణలతోనే ఎన్నికల వ్యవస్థలో పలు మార్పులు చోటు చేసుకున్నాయి. ఆ ఎన్నికల సంస్కరణల్లో కొన్ని... 1991-92 మధ్య జరిగిన ఎన్నికల్లో తొలిసారిగా ‘ఓటరు గుర్తింపు కార్డు’ ప్రవేశ పెట్టారు. 1970 వరకు ఓటరు కనీస అర్హత వయస్సు 21 సంవత్సరాల నుంచి 18 సంవత్సరాలకు కుదించారు. ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థుల ఎన్నికల ఖర్చును పరిమితం చేశారు. ఒక అభ్యర్థి రెండు నియోజక వర్గాల కంటే ఎక్కువ స్థానాల్లో పోటీచేయరాదని, కులం పేరుతో ఓట్లను అభ్యర్థించడం నిషేధం. పోలింగ్ కేంద్రాల్లోకి ఓటర్లను తరలించడం, ప్రభుత్వ యంత్రాంగం సాయం పొందడం చట్ట విరుద్ధం. పోలింగ్ సమయంలో ఇతరులు కేంద్రానికి 200 మీటర్ల దూరంలో ఉండాలి, గుమికూడి ఉండటం నేరం.

సీఈసీగా ఉద్యోగ విరమణ చేసిన తరువాత 1997 రాష్ట్రపతి ఎన్నికల్లో కేఆర్ నారాయణ్‌పై పోటీచేసి ఓడిపోయారు. అప్పటి నుంచి ఆయన వార్తల్లో కనిపించని అజ్ఞాతవ్యక్తిగా మిగిలారు. శేషన్ పుట్టపర్తి సాయిబాబాకు వీరభక్తుడు. సాయిబాబా శివైక్యం పొందినప్పటి నుంచి తీవ్ర విచారానికి గురయ్యారు. తన స్వగ్రామంలో సొంత ఇల్లు ఉన్నప్పటికీ తమను సంరక్షించేందుకు పిల్లలు లేకపోవడంతో తన ఆలోచనా దృక్పథం సేవాగుణంపై కదిలింది. తన శేష జీవితంలోనూ పేదల, అనాధల, వృద్ధుల బాధలు తిలకిస్తూ, వారికి తోచిన సహాయం చేయాలనే నిర్ణయంతో భార్య జయలక్ష్మితో కలిసి చెన్నైలోని ‘గురుకులం’ అనే వృద్ధాశ్రమంలో గడుపుతున్నారు. ఆశ్రమంలోని తోటివారి కష్టాలను వింటూ, వారికి చేతనైన సాయం అందిస్తున్నారు, ఆదుకుంటున్నారు. తన పింఛన్ డబ్బుల్లో కొంత ఇతర సామాజిక సేవలకు వెచ్చించడం విశేషం.

◆ గుమ్మడి లక్ష్మీనారాయణ
9491318409

మనం కుటుంబం
గురువారం, 25 జనవరి 2018
www.manamnews.com

ఇదిగో మన 'ఉష'

వెలుగులోకి వస్తున్న నవ్య



ఆ అమ్మాయి పరుగులు పెట్టిందా..పతకాలు ఖాయం. జాతీయ స్థాయి, అంతర్జాతీయ స్థాయి అన్న తేడా లేకుండా, పరుగుల పందెంలోకి దిగిందా, ప్రత్యర్థులు ఓటమిపాలు కావాల్సిందే. ఇంత సామర్థ్యమున్న పరుగుల రాణి గురించి మాకు తెలియదే అనుకుంటున్నారా.. అయితే 'మనం కుటుంబం'లో ఆ ప్రతిభాశాలిని పలకరిద్దామా?

పోటీలంటే తెలీదు!

నవ్య, ఈ పేరు తెలంగాణ అథ్లెటిక్స్‌లో మారుమోగుతోంది. నల్గొండ జిల్లాలో నవ్య పేరుతెలియనివారుండరు. కఠోరసాధన చేస్తూ, పతకాల పంట పండిస్తూ, ఆపన్న హస్తం కోసం ఎదురుచూస్తున్న అభినవ పీటీ ఉషగా ఎదుగుతున్న నవ్యకు మొదట్లో ఈ పోటీ ప్రపంచంలో జరిగే పరుగుల పోటీ గురించి అస్సలు అవగాహన లేదు. నిరుపేద కుటుంబంలో జన్మించి, అందరిలాంటి అమ్మాయిగానే ప్రభుత్వ పాఠశాలలో చదువుతోంది. కేతేపల్లి మండలంలోని చీకటిగూడెం గ్రామానికి చెందిన వద్ది నవ్య ఏడేళ్ల క్రితం తన ప్రస్థానాన్ని మొదలుపెట్టింది. పాఠశాలలో జరిగిన పంద్రాగష్టు పరుగు పందెంలో నవ్య పరుగులుపెట్టిన తీరును గుర్తించిన పీఈటీ ఆమెను భారత పరుగుల రాణి చేయాలని నిర్ణయించుకోవడంతో నవ్య అథ్లెటిక్స్ ప్రపంచంలోకి అడుగుపెట్టింది.

అప్పు చేయాల్సిందే

గత సంవత్సరం విశాఖపట్నంలో జరిగిన 10 కిలోమీటర్ల ప్రపంచ బే-మారథాన్‌లో గోల్డ్ మెడల్ సాధించింది. కాళ్లకు కనీసం షూ కూడా లేకుండా పరిగెత్తిన ఈమె ప్రతిభను ప్రత్యేకంగా గుర్తించిన ఏపీ సీఎం చంద్రబాబు నాయుడు అప్పట్లో నవ్యకు రూ.స 40,000 ప్రైజ్‌మనీతోపాటు మరో 50,000 రూపాయలు కూడా అందజేశారు. నిత్యం 7 గంటలపాటు సాధన చేసే నవ్య ఇప్పటికే సుమారు 32 జాతీయస్థాయి పోటీల్లో పాల్గొని పతకాలు సాధించింది. కానీ కొత్తగా ఏ పోటీలో పాల్గొనాలన్నా ఆమె తల్లిదండ్రులు అప్పు చేసి పంపాల్సిందే. ఇక ఈమె వాడే పరికరాలు అన్నీ నాసిరకమే. ట్రాక్ సూట్ ధర 5 వేలుకూడా ఉండదు, షూస్ 2 వేల లోపే, ఇక పోషకాహారం అంటే.. దాని గురించి ప్రస్తావించకపోవడం మేలు. అయినా కూడా ఇవన్నీ ఆమె సంకల్పం ముందు బలాదూరే. థాయ్‌లాండ్‌లోని పటాయాలో జరిగిన 21 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌లో 81 నిమిషాల 11 సెకెన్లలో లక్ష్యాన్ని పూర్తిచేసి, వెండి పతకం సొంతం చేసుకుంది. నిజానికి సరైన పోషకాహారం, వసతులు కల్పిస్తే నవ్య గోల్డ్ మెడల్‌తో తిరిగి వచ్చేది.



కంకర రాళ్లు.. చెప్పులు లేవు!

రోజంతా రెక్కలు ముక్కలు చేసుకుంటేగానీ ఆమాత్రం గడవని బ్రతుకుల్లో కొట్టుమిట్టాడుతున్న నవ్య తల్లిదండ్రులు, తమకున్న ఎకరం పొలాన్ని సాగు చేసుకుంటూ, కూలీపనులకు వెళ్తారు. 10వ తరగతివరకూ అలా కూలి పనులు చేసిన అమ్మాయే నవ్యకూడా! కానీ నాడు పరుగు పందెంలో ఆమె వేసిన పెద్ద పెద్ద అంగలు (అడుగులు) గుర్తించిన పీఈటీ హనుమంతరావు, నవ్యను ట్రైన్ చేస్తే పతకాల పంట పండిస్తుందని అంచనా వేశారు. పరుగు పందెంలో గెలిచిన నవ్య వద్దకు వచ్చిన మాస్టారు 'రేపటినుంచి నువ్వు అబ్బాయిలతోపాటు రన్నింగ్ ప్రాక్టీసుకు రా' అన్నారు. సార్ పోటీలు అయిపోయాయిగా అన్న నవ్యతో 'రేపటి నుంచి అసలు పోటీలు మొదలవుతాయ'ని పీఈటీ చెప్పారు. ఆ మరుసటిరోజు నుంచి దాదాపు రెండు నెలలు కఠోర సాధన చేసింది. పరిగెత్తడంలో మొదట ఇబ్బందిపడ్డ నవ్య, ఆ తరువాత చాలా ఈజీగా మెరుపువేగంతో జింకలా పరిగెత్తడం ప్రారంభించింది. కాళ్లకు చెప్పులు కూడా లేకపోగా, కంకర తేలిన రాళ్లనే ట్రాక్‌గా భావిస్తూ ప్రాక్టీసు చేసింది.

ప్రొటీన్‌కు దిక్కులేదు

నవ్య సత్తాను సరిగ్గా అంచనా వేసిన హనుమంతరావు, ప్రొటీన్‌గా మొలకెత్తిన గింజలను రోజూ ఇచ్చేవారు. ఇంట్లో అన్నానికే సరిగా దిక్కులేని నవ్యకు ప్రొటీన్ ఎక్కడినుంచి వస్తుంది. సరైన పోషకాహారం లేకుండా క్రీడాకారులు రాణించే అవకాశం ఎలా వస్తుంది? కానీ ఇంట్లో కటికదారిద్ర్యం మూలంగా ఏం చేయలేని పరిస్థితుల్లో చిక్కుకుపోయింది. వాస్తవానికి ఈమెను మొదట 1500 మీటర్ల మిడిల్ రన్ విభాగంలో పోటీ చేయించాలనేది మాస్టారు లక్ష్యం, కానీ నవ్య ఎత్తు 4.9 అడుగులే, ఇలాంటివారు తక్కువ దూరం ఉండే పోటీల్లో రాణించడం చాలా కష్టం. అందుకే నవ్య మిడిల్ రన్‌ను టార్గెట్‌గా పెట్టుకోవాల్సి వచ్చింది. రెండు నెలల తర్వాత రాష్ట్రస్థాయి పోటీలకు తీసుకెళ్లగా, 1500 మీటర్ల విభాగంలో 10 నిమిషాల వ్యవధిలో మూడు సార్లు పోటీలు జరిగాయి. అయినా ఏమాత్రం అలసిపోని నవ్యను గమనించిన హనుమంతరావు లాంగ్ రన్ విభాగంలో 1500 మీటర్ల మిడిల్ సెమీఫైనల్స్‌కు బదులు తర్వాతి రోజు 3000 మీటర్ల రేసులో పరిగెత్తించారు. మాస్టారు కలలను నిజం చేస్తూ, నవ్య బంగారు పతకం సాధించింది. అంతే ఇక అప్పటినుంచి వెనుతిరగని నవ్య, ఎన్నో విభాగాల్లో పతకాలు అందుకుంటూనే ఉంది.



పెరటిచెట్టు వైద్యానికి..

నవ్య జీవితానికి ఈ సామెత అతికినట్టు సరిపోతుంది. స్పోర్ట్స్ పర్సనాలిటీలకు లభిస్తున్న గుర్తింపు, సాయం తనకెందుకు లభించడం లేదంటున్న నవ్య, నల్గొండ జిల్లాకు ఓరకంగా బ్రాండ్ అంబాసిడర్. ఇప్పటివరకూ నల్గొండ అంటే టీచర్లను ఎక్కువగా అందించిన జిల్లాగా పేరుండగా, నవ్య సాధించిన విజయాలతో ఇది క్రీడాకారులకు కేరాఫ్‌గా మారుతోంది. ఇంటర్నేషనల్ ట్రాక్‌పై వెలుగులీనుతున్న నవ్యకు ప్రభుత్వోద్యోగం కల్పిస్తామని సీఎం కేసీఆర్ ఈనెల 17న హామీసైతం ఇచ్చారు. నవ్య సాధించిన విజయాలను తెలుసుకున్న సీఎం ఆమెను ప్రత్యేకంగా అభినందించారుకూడా. ఈ హామీ సాకారమైతే, మరిన్ని విజయాలను తన ఖాతాలో వేసుకునేందుకు ఈమె సిద్ధంగా ఉంది. నవ్యతోపాటు మరో 8 మంది అమ్మాయిలు, ఆరుగురు అబ్బాయిలు జాతీయ స్థాయి పోటీలో సత్తా చాటుతుండగా, సుమారు 30 మందిదాకా రాష్ట్రస్థాయిలో తమ పైచేయి ప్రదర్శిస్తున్నారు. వీరంతా హనుమంతరావు వద్ద శిక్షణపొందుతున్న మెరికలే కావడం హైలైట్. రాష్ట్ర, జాతీయ స్థాయి ఛాంపియన్లను తయారు చేయడంలో హనుమంతరావు చూపుతున్న ప్రత్యేక శ్రద్ధతో గ్రామీణ యువతలోని ప్రతిభ లోకానికి పరిచయం అవుతోంది.

– నరసింహా, హైదరాబాద్



ఒలింపిక్స్ నా కల

ఈ ఏడాది ఆఖరులో జరిగే నేషనల్ గేమ్స్‌లో సత్తా చాటి, 2020లో జరిగే కామన్ వెల్త్ గేమ్స్‌లో బంగారు పతకం సాధించడం ప్రస్తుతం తనముందున్న అతిపెద్ద సవాళ్లని చెప్పే నవ్య, సాధనలో బిజీగా ఉంది. ఒలింపిక్స్‌లో భారత్‌కు బంగారు పతకం తేవడం తన కల అనే నవ్యకు, ఆపన్నహస్తం అందిస్తే.. కోట్లాదిమంది భారతీయుల కలను కూడా తప్పక సాకారం చేయగలదు. 'నాకు ఒక విషయం అర్థంకాక అడుగుతా, క్రికెట్ లాంటి ఆటలే తప్ప మనవారికి అథ్లెటిక్స్ అంటే ఎందుకు పట్టదు? మేమేం క్రికెటర్లకంటే తక్కువ సాధన చేయం కదా! వీరికి ఆ సాయం, వారికి ఆ సాయం అని వార్తలు వచ్చినప్పుడల్లా.. మాలాంటివారు పట్టరా అని వెక్కివెక్కి ఏడ్చిన రోజులకు లెక్కేలేదు, మాకు సరైన సదుపాయాలు కల్పిస్తేచాలు..ఇంకా ఇంకా సాధిస్తాం..చాలా సాధించి చూపుతాం' అని ఎమోషనల్‌గా మాట్లాడే నవ్య అంతరంగంలోని ఆర్ధత ఎవరికైనా కంటతడి పెట్టిస్తుంది. ప్రస్తుతం డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్న అభినవ పీటీ ఉష.. ఎవరో ఒకరు సాయం చేయకుండా పోతారా.. ఏదో ఓ అదృశ్యశక్తి ఆదుకోకుండా ఉంటుందా అన్న గంపడాశతో..ఫీనిక్స్‌లా పట్టువదలడం లేదు. షూ లేకుండా వట్టి కాళ్లతో పోటీల్లో పాల్గొన్న తనను చూసి చాలామంది మిల్ఖాసింగ్‌తో పోల్చడం గర్వంగా అనిపించిందనే నవ్య, తనకు ఆయనే ఆదర్శమంటుంది.







ట్రెండీ కాక్‌టైల్ కోట్స్



వాట్.. కోటా? ఇది కోటుపై జనరేషన్ నెక్ట్స్‌కున్న అభిప్రాయం. కానీ ఇప్పుడు ఈ కోట్లే ట్రెండీగా మారాయి. ఎథ్నిక్‌లా కనిపిస్తూనే, వెస్ట్రన్ లుక్ ఇచ్చే వీటిని 'కాక్‌టైల్ కోట్స్' అంటారు. ప్రముఖ డిజైనర్లంతా ఇప్పుడు వీటిపై తమ ప్రయోగాలు చేస్తూ, చీరలు, చూడీదార్లు, లెహెంగాలు అన్న తేడా లేకుండ అన్నింటిపైనా వీటిని వేసుకునేలా డిజైన్ చేస్తున్నారు. ఇప్పుడు ముంబై తారలంతా వీటితోనే ప్రైవేటు పార్టీల్లో తళుక్కున మెరుస్తున్నారు.

లాంగ్ కోట్, షార్ట్ కోట్‌లను సిల్క్, కాటన్, హ్యాండ్‌లూమ్ వంటి ఫ్యాబ్రిక్‌తో డిజైన్ చేస్తున్నారు. ఫ్లోరల్ ప్రింట్లు, జర్దోసి, మిర్రర్ వర్కు, ప్లెయిన్స్‌లో కోట్లు వావ్ అనిపిస్తున్నాయి. డిటాచబుల్‌గా ఉండే వీటిని మీ ఇంట్రెస్ట్‌కొద్దీ మీ వార్డ్‌రోబ్‌లోని కలెక్షన్‌కు కాంబోగా ట్రై చేయవచ్చు. సమ్మర్, వింటర్ ఇలా సీజన్ ఏదైనా ఇవి కంఫర్టబుల్‌గా ఉంటాయి.







రిబ్బన్.. న్యూ స్టైల్

'రిబ్బన్ బ్రెయిడ్' పేరుతో న్యూ ట్రెండ్ ఇప్పుడు ఫ్యాషన్ లవర్స్‌ను ఊరిస్తోంది. ఇదేదో కొత్త హెయిర్ స్టైల్ అనుకునేరు, 'పాత ఎప్పుడూ కొత్తే' కనుక ఇది కొత్తదని అని చెప్పుకోవాలి. ఓ 10 ఏళ్ల క్రితం వరకూ స్కూల్‌కు వెళ్లే అమ్మాయిలంతా వేసుకున్న రిబ్బన్ జడలే ఇవి. కాకపోతే అంత వెడల్పాటి రిబ్బన్లు కాకుండా శాటిన్ వంటి చిన్న రిబ్బన్లతో అల్లే జడలే రిబ్బన్ బ్రెయిడ్ అంటే. రిబ్బన్లతో హెయిర్ స్టైల్‌ను ఎలా మార్చుకోవాలో తెలుసుకోవాలంటే ఇంటర్నెట్‌లో మీకు బోలెడు వీడియోలు, ఫొటోలు లభిస్తాయి, ఇంకా సింపుల్‌గా చెప్పాలంటే అమ్మ, అమ్మలను అడిగినా, వారి ఫొటోలు చూసినా మీరు ఈజీగా ఈ స్టైల్ చేసుకోవచ్చు. ఆలస్యమెందుకు మీ ఫ్రెండ్స్ అందరికంటే ముందు మీరే రిబ్బన్ బ్రెయిడ్‌ను ట్రై చేయండి.



గజల్‌కు బెయిల్

- షరతులతో కూడిన బెయిల్ మంజూరు
- ఎ2 నిందితురాలు పార్వతికి ముందస్తు

హైదరాబాద్, జనవరి 24 (మనం లీగల్ ప్రతినిధి): మహిళపై లైంగిక వేధింపుల కేసులో అరెస్టయిన గజల్ గాయకుడు శ్రీనివాస్‌కు బెయిల్ మంజూరైంది. నాంపల్లి కోర్టు ఆయనకు షరతులతో కూడిన బెయిల్ మంజూరు చేసింది. రూ.10 వేల చొప్పున రెండు ష్యూరిటీలు సమర్పించాలని, వారంలో రెండు రోజులు పంజాగుట్ట పోలీస్ స్టేషన్‌లో హాజరుకావాలని కోర్టు ఆదేశించింది. ఇదే కేసులో ఏ2 నిందితురాలుగా ఉన్న పార్వతికి కూడా ముందస్తు బెయిల్ మంజూరు చేశారు. గజల్ శ్రీనివాస్ తనను లైంగికంగా వేధిస్తున్నట్లు సేవ్ టెంపుల్ అనే సంస్థలో పనిచేసే మహిళ పోలీసులకు ఫిర్యాదు చేశారు. అందుకు పార్వతి అనే మహిళ కూడా సహకరించారని ఆమె ఫిర్యాదులో పేర్కొన్నారు. దాంతో పంజాగుట్ట పోలీసులు గజల్ శ్రీనివాస్‌ను ఈనెల 2వ తేదీన అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. అప్పటి నుంచి పార్వతి పరారీలో ఉంటూనే బెయిల్ కోసం కోర్టును ఆశ్రయించారు. బుధవారం ఇద్దరికీ బెయిల్ మంజూరు అయింది.

అతడి పేరు శివ

(మొదటిపేజీ తరువాయి)

అతడి చేతిలోని ఫోను ఎగిరిపడినా, ఈ తతంగమంతా వీడియోలో రికార్డయింది. ఈ వీడియో ఇపుడు సోషల్ మీడియాలో హల్‌చల్ చేస్తోంది. అతడి పేరు శివ... మూడురోజుల కిందట ఈ సంఘటన చోటుచేసుకున్నట్లు రైల్వే ఎస్పీ అశోక్ తెలిపారు. ఈ ఉదంతంలో చావుతప్పి కన్నులొట్టబోయిన స్థితిలో శివ ప్రస్తుతం లింగంపల్లిలోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడని చెప్పారు. అతడి తలకు, చేతికి బలమైన గాయాలైనా ప్రాణాపాయం మాత్రం తప్పిందన్నారు.

దేశవ్యాప్తంగా సెల్ఫీ వేలంవెర్రి

దేశవ్యాప్తంగా ఈ వేలంవెర్రి ముదిరిపోయిన ఫలితంగా ప్రపంచంలో నమోదైన సెల్ఫీ మరణాల్లో 60 శాతం భారత్‌లోనే చోటుచేసుకున్నట్లు లెక్కలు చెబుతున్నాయి. ఏదో ఒక అందమైన ప్రదేశం.. లేదా ప్రమాదకరమైన ప్రాంతం ఎంచుకోవడం... అక్కడ సెల్ఫీలు తీసుకుని, వాటిని సోషల్ మీడియాలో పోస్ట్ చేయడం యువతకు క్రేజుగా మారింది. ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్‌లలో తమ వీడియోలకు బోలెడన్ని లైకులు రావాలన్న తపన, తెల్లారేసరికి సెలబ్రిటీలమైపోవాలనే ఆకాంక్ష ప్రాణాలతో చెలగాటానికి వారిని పురిగొల్పుతున్నాయి. ఇలాంటి పరిస్థితిని చక్కదిద్ది, మరణాలను నివారించడం కోసం ముంబైలోని 15 ప్రదేశాలను 'సెల్ఫీ ఫ్రీ పాయింట్లు'గా పోలీసులు గుర్తించాల్సి వచ్చింది. నగరంలోని ప్రసిద్ధ 'మెరైన్ డ్రైవ్' ప్రాంతంలో 17 ఏళ్ల ప్రీతి అనే యువతి సెల్ఫీ తీసుకుంటూ మరణించింది. ఆ ఫోటోను ముంబై పోలీసులు ట్వీట్ చేస్తూ.. ''సెల్ఫీ అంటే మీ ప్రాణాలను మీరే తీసుకోవడం కాదు'' అని హెచ్చరించారు. ఆమె మెరైన్ డ్రైవ్‌లో ఓ పిట్టగోడ మీద నిలబడి వెనుక సముద్రపు అల ఎగసిపడుతుండగా సెల్ఫీ తీసుకోవాలని ముచ్చటపడింది. కానీ, హఠాత్తుగా ఎగసిపడిన ఓ రాకాసి అల ఆమెను ఒక్కసారిగా లాక్కెళ్లిపోయింది. అలాగే బాంద్రా ప్రాంతంలో మీనాక్షి రాజేష్ అనే ఇంజనీరింగ్ విద్యార్థిని (21) తన తల్లి, సోదరితో కలిసి ఫొటో తీసుకుంటూ కాలుజారి పడి నీటమునిగిపోయింది.

రైలుకు ఎదురుగా నిలుచుని...

హైదరాబాద్ విషయానికొస్తే... నగరంలో ఇంతకు ముందు కూడా ఇద్దరు యువకులు రైలుకు ఎదురునిలిచి సెల్ఫీ తీసుకునేందుకు ప్రయత్నించారు. కానీ, వీరిలో ఒకరు మరణించగా మరొకరు ఓ చెయ్యి పోగొట్టుకున్నాడు. నిరుడు మే నెలాఖరులో అల్వాల్ రైల్వే స్టేషన్ సమీపాన ఈ సంఘటన చోటుచేసుకుంది. గోదావరిఖనిలో డంపర్ ఆపరేటర్‌గా పనిచేసే సంపత్‌కుమార్, స్నేహితుడు శ్రావణ్‌తో కలిసి పట్టాలకు ఒకవైపు నిలుచుని రైలు వస్తుండగా ఫొటో తీసుకునే ప్రయత్నం చేశారు. రైలు దూరంగా వస్తున్నట్లు వారు భావించినా ఈలోపే అది వేగంగా వచ్చి వారిని ఢీకొంది. దాంతో సంపత్ అక్కడికక్కడే మరణించగా శ్రావణ్ చెయ్యి తీసేయాల్సి వచ్చింది.

శామీర్‌పేట చెరువులో..

ఇంతకుముందు శామీర్‌పేట చెరువు వద్ద శ్రీనివాస్



కృష్ణ అభిషేక్ అనే యువకుడు గర్ల్‌ఫ్రెండ్‌తో కలిసి సెల్ఫీ తీసుకుంటూ కాలుజారి చెరువులో పడి ప్రాణాలు కోల్పోయాడు. అతడిని రక్షించమంటూ ఆమె అటూఇటూ పరుగుతీసి కేకలు పెట్టినా కనుచూపు మేరలో ఎవరూ లేకపోవడంతో ఫలితం దక్కలేదు. ఇలాంటి సెల్ఫీ మరణాల నివారణ కోసం ట్యాంక్‌బండ్ మీద 'లవ్ హైదరాబాద్' అనే అక్షరాలు, సంకేతంతో కూడిన గుర్తును ఏర్పాటు చేశారు. ఇది కనపడేలా సెల్ఫీ తీసుకోవాలంటే ఇంకాస్త దూరంగా ఉండాలి లేదా.. దాని పక్కన నిలబడితే సరిపోతుంది కాబట్టి ప్రమాద రహితంగా ఉంటుందని భావించారు. అది కొంతవరకు సత్ఫలితాలను ఇచ్చినా ఇలా రైళ్ల దగ్గర, నీళ్ల దగ్గర, ప్రమాదకర ప్రదేశాల్లో సెల్ఫీలు తీసుకోవాలన్న తపన ప్రాణంమీదకు తెస్తోంది.

తెలంగాణకు రండి

పెట్టుబడులు పెట్టండి.. అవకాశాలు అందిపుచ్చుకోండి'
వివిధ కంపెనీల సీఈవోలతో భేటీలో మంత్రి కేటీఆర్

హైదరాబాద్, జనవరి 24 (మనం ప్రతినిధి):



దావోస్‌లో ప్రపంచ ఆర్థిక ఫోరం (డబ్ల్యూఈఎఫ్) సదస్సులో పాల్గొంటున్న మంత్రి కేటీఆర్ బుధవారం బిజీబిజీగా గడిపారు. తెలంగాణలో పెట్టుబడులు పెట్టాని, అవకాశాలు అందిపుచ్చుకోవాలని వివిధ కంపనీల సీఈవోలు, ప్రతినిధులతో జరిగిన సమావేశంలో పిలుపునిచ్చారు. తెలంగాణ అనుసరిస్తున్న పారిశ్రామిక విధానం, ఇక్కడి అనుకూల విధానాలపై కూలంకుషంగా వివరించారు. బుధవారం ఉదయం ఎయిర్ ఏషియా గ్రూప్ సీఈవో ఆంతోనీ ఫెర్నాండెజ్, ఉప కార్యనిర్వహణాధికారిణి ఎయిరీన్ ఒమర్‌లను కలిశారు. దేశంలో రానున్న రోజుల్లో విమానయాన రంగం మరింత అభివృద్ధి చెందుతుందని ఈ సందర్భంగా కేటీఆర్ పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని విమానాశ్రయం అంతర్జాతీయస్థాయిలో అనేక అవార్డులు గెలుచుకున్నదని తెలిపారు. తెలంగాణ ప్రభుత్వం చేపడుతున్న ఫార్మసిటీ గురించి నోవార్టిస్ కంపెనీ పబ్లిక్ పాలసీ హెడ్ పెట్రా లక్స్‌కు వివరించారు. హైదరాబాద్ ఇప్పటికే భారతదేశ లైఫ్ సైన్సెస్ క్యాపిటల్ గా ఉన్నాదన్నారు. నగరంలో నోవార్టిస్ కార్యకలాపాల విస్తరణపైన ఈ సమావేశంలో చర్చ జరిగింది. నోవార్టిస్‌కు నగరంలో ఆర్ అండ్ డీ, డాటా సపోర్ట్, అనలిటిక్స్ కార్యకలాపాలు కొనసాగిస్తున్నదని, సంస్థ అభివృద్ధి పట్ల తాము సంతృప్తిగా ఉన్నామని లక్స్ తెలిపారు. ప్రస్తుతం ఉన్న 90 వేల చదరపు అడుగుల ల్యాబొరేటరీని రెట్టింపు చేయడంతోపాటు, అదనంగా మరో 150 మంది పరిశోధన సిబ్బందిని నియమించుకోనున్నట్లు తెలిపారు. కంపెనీ కార్యకలాపాల విస్తరణ ద్వారా నగరంలోని జినోమ్ వ్యాలీ అభివృద్ధికి ఎంతగానో దోహదం చేస్తుందని, పూర్తి వివరాలను నోవార్టిస్ త్వరలోనే అందిస్తుందని కేటీఆర్ తెలిపారు. తమ కంపెనీ భారీ ప్రాజెక్టుల అవకాశాల కోసం చూస్తోందని మిత్సుబిషి హెవీ ఇండస్ట్రీస్ కార్యనిర్వాహక ఉపాధ్యక్షులు కెన్ కవాయి బృందం కేటీఆర్‌కు తెలిపింది. ముఖ్యంగా పారిశ్రామిక వాడలు, వేస్ట్ మేనేజ్ మెంట్ ప్రాజెక్టులు తదితర ప్రాజెక్టులపైన మిత్సుబిషికి ఆసక్తి ఉందని వివరించారు. అయిత ఇలాంటి ప్రాజెక్టుల నిర్మాణానికి తమ రాష్ట్రంలో అనేక అవకాశాలున్నాయని, కంపెనీ ప్రతినిధి బృందం స్వయంగా తెలంగాణలో పర్యటించాలని కేటీఆర్ కోరారు. కాగా, తెలంగాణలో జపనీస్ స్మాల్ అండ్ మీడియం ఎంటర్‌ప్రైజెస్ పార్క్‌ను తెలంగాణలో ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని ఈ సందర్భంగా మిత్సుబిషి ప్రతినిధి జపాన్ ప్రభుత్వానికి సూచించడం విశేషం. అనంతరం కువైట్‌కు చెందిన ఫవద్ అల్గానిమ్ కంపెనీ సీఈవోతో భేటీ అయిన కేటీఆర్.. తెలంగాణలో సోలార్ విద్యుత్ ప్రాజెక్టులకు ఉన్న అవకాశాలను వివరించారు. విద్యుత్తు, మెడికల్ డివైజెస్ తయారీ రంగాల్లో ఉన్న అవకాశాలను వివరించారు. తెలంగాణలో టెక్ సెంటర్ ఏర్పాటు చేయాలని దుబాయ్ ఇన్వెస్ట్‌మెంట్ కార్పొరేషన్ సీఈవో మహ్మద్ అల్ షయభానీతో భేటీ సందర్భంగా కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. హ్యూలెట్ ప్యాకార్డ్ (హెచ్‌పీ) సంస్థ ఉపాధ్యక్షులు పిన్కుజుక్‌తోనూ మంత్రి సమావేశమై హెచ్‌పీ, టీహబ్‌ల భాగస్వామ్యానికి ఉన్న అవకాశాలను పరిశీలించాలని కోరారు. అలాగే, హైదరాబాద్‌లో హెచ్‌పీ కార్యకలాపాలను విస్తరించాలని సూచించారు. కాగా, వరల్డ్ ఎకనమిక్ ఫోరం సర్క్యులర్ అవార్డు గెలుచుకున్న టిహబ్ సంస్థ, బనయన్ నేషన్ సహ వ్యవస్థాపకుడు మని వాజపేయి బృందానికి ఈ సందర్భంగా మంత్రి అభినందనలు తెలిపారు.



నక్సల్స్‌తో పోరు.. నలుగురు పోలీసులు బలి

- ఛత్తీస్‌గఢ్‌లోని ఇర్పనార్ గ్రామంలో ఎన్‌కౌంటర్
- మృతుల్లో ఇద్దరు ఎస్ఐలు.. ఏడుగురికి గాయాలు

రాయ్‌పూర్, జనవరి 24:

ఛత్తీస్‌గఢ్‌లో అబూజ్‌మడ్ ప్రాంతంలోని ఇర్పనార్ గ్రామంలో నక్సలైట్లతో పోరులో ఇద్దరు ఎస్ఐలు, ఇద్దరు కానిస్టేబుళ్లు బలయ్యారు. బుధవారం నారాయణపూర్ జిల్లా పరిధిలో జరిగిన ఈ ఎదురుకాల్పుల్లో మరో ఏడుగురు సిబ్బంది గాయపడ్డారని ప్రత్యేక డీజీపీ (నక్సల్స్ నిరోధ కార్యకలాపాలు) డి.ఎం.అవస్థి చెప్పారు. నక్సలైట్ నిరోధక చర్యల్లో భాగంగా డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ ఆఫ్ పోలీస్ (డీఆర్జీ) సిబ్బందితోపాటు ప్రత్యేక కార్యాచరణ బలగం (ఎస్టీఎఫ్) పోలీసులు అబూజ్‌మడ్ ప్రాంతంలో గాలింపు చేపట్టారని ఆయన తెలిపారు. ఇర్పనార్ గ్రామంలో నక్సలైట్ల కదలికలపై సమాచారంతో ఈ సంయుక్త బృందం ఆ ప్రదేశాన్ని దిగ్బంధించి గాలింపు చేపట్టిందని చెప్పారు. ఈ సందర్భంగా ఉదయం 11 గంటల ప్రాంతంలో నక్సలైట్లు కాల్పులు ప్రారంభించగా రెండు గంటలపాటు పరస్పర కాల్పులు సాగాయని వివరించారు. ఈ సమాచారం అందగానే అదనపు బలగాలను పంపడంతోపాటు అక్కడినుంచి క్షతగాత్రులైన సిబ్బందిని హెలికాప్టర్లో ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

పోలీసులపై ఆరోపణలొస్తే ప్రత్యేక కమిషన్ తప్పనిసరి

- తెలుగు రాష్ట్రాలకు హైకోర్టు ఆదేశం

హైదరాబాద్, జనవరి 24 (మనం లీగల్ ప్రతినిధి):

పోలీసులపై ఆరోపణలు వచ్చినప్పుడు విచారణకు రాష్ట్రస్థాయి భద్రత కమిషన్, పోలీసులు చేసే ఫిర్యాదుల్ని పరిష్కరించేందుకు పోలీస్ కంప్లయింట్ అథారిటీలను ఏర్పాటు చేయాల్సిందేనని హైకోర్టు స్పష్టం చేసింది. సుప్రీంకోర్టు ఆదేశాలకు అనుగుణంగానే గతంలో తాము ఉత్తర్వులు ఇచ్చామని పేర్కొంది. ఏపీలో వాటిని ఏర్పాటు చేసేందుకు హైకోర్టు 4 నెలల గడువు ఇచ్చింది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు వీటిని తెలంగాణ/ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలు ఏర్పాటు చేయాల్సిందేనని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ రమేశ్ రంగనాథన్ నేతృత్వంలోని డివిజన్ బెంచ్ తేల్చి చెప్పింది. కమిషన్/అథారిటీలకు కమిటీల ఏర్పాటుకు సింగిల్ జడ్జి గతంలో ఇచ్చిన ఉత్తర్వులను ఏపీ హోం శాఖ సవాల్ చేసిన వ్యాజ్యాన్ని బెంచ్ బుధవారం విచారించింది. సుప్రీంకోర్టు ఉత్తర్వులకు విరుద్ధంగా సింగిల్ జడ్జి ఆదేశాలున్నాయనే వాదనతో బెంచ్ ఏకీభవించింది. కమిషన్/అథారిటీల్లో ఎవరెవరు ఉండాలో సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాల్ని బెంచ్ సవరించింది.

విష్ణు చక్రం

- టీడీపీ సర్కారుపై బీజేపీ నేత నిప్పులు..
- వైసీపీ 'మంత్రుల' రాజీనామాకు డిమాండ్

అమరావతి, జనవరి 24 (మనం ప్రతినిధి):

బీజేపీ శాసనసభాపక్ష నేత పెన్మత్స విష్ణుకుమార్ రాజు ఉన్నట్టుండి బాంబు పేల్చారు. మిత్రపక్షమైన తెలుగుదేశం ప్రభుత్వంపైనే విష్ణు చక్రం సంధించారు. గత ఎన్నికల్లో వైఎస్ఆర్ సీపీ తరపున పోటీచేసి గెలిచి ఎమ్మెల్యేలుగా ఎన్నికైన వాళ్లు.. ఇప్పుడు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో మంత్రులుగా కొనసాగడం దారుణమని ఆయన వ్యాఖ్యానించారు. బుధవారం ఆయన అసెంబ్లీ ప్రాంగణంలో జరిగిన ప్రజాపద్దుల కమిటీ సమావేశంలో పాల్గొన్నారు. సమావేశం అనంతరం ఆయన వైఎస్ఆర్‌సీఎల్పీలో, పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్‌తో కలిసి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు. ఉమ్మడి మీడియా సమావేశంలో విష్ణుకుమార్ రాజు ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. ''ప్రతిపక్షంలోని సభ్యులను అధికార పార్టీలో మంత్రులుగా చేయడం సరికాదు. వైసీపీ ఎమ్మెల్యేలు పార్టీ మారారు. దానికున్న గ్రావిటీ తక్కువ. దాన్ని మేము తప్పు పట్టడం లేదు. కానీ అలా పార్టీలు మారిన వారిని మంత్రులుగా చేయడాన్ని మేము ప్రశ్నిస్తున్నాం. ఇది మంచి పద్ధతి కాదు. వాళ్లు వైసీపీ తరపున పోటీ చేసినపుడు మేం వాళ్లపై పోటీ చేశాం.. వాళ్ల మీద ప్రతిపక్షంగా పోరాడాం. అలాంటి వాళ్లను తీసుకొచ్చి ఆంధ్రరాష్ట్రానికి మొత్తం మంత్రులుగా చేయడం సరికాదు. మంత్రులుగా ఉన్న వైసీపీ ఎమ్మెల్యేలు కావాలంటే మళ్లీ ఎన్నికల్లో గెలిచి సభలోకి గౌరవంగా రావొచ్చు. అందులో ఎవరికీ ఎలాంటి అభ్యంతరాలు లేవు. అలాలేదు అంటే... ప్రతిపక్ష సభ్యులను అధికార పక్షంలోకి తీసుకొచ్చి మంత్రి పదవులు ఇచ్చుకోవచ్చని ఒక చట్టం చేయండి'' అంటూ మండిపడ్డారు.

దగ్గర అవుతున్నట్లేనా?

ఇటీవల జాతీయ మీడియాకు ప్రతిపక్షనేత జగన్ ఇంటర్వ్యూలో... ఏపీకి ప్రత్యేక హోదా ఇస్తే బీజేపీతో పొత్తుకు సిద్ధం అని చెప్పిన విషయం తెలిసిందే. సరిగ్గా ఇలాంటి తరుణంలోనే బీజేపీ ఫ్లోర్‌లీడర్ విష్ణుకుమార్ రాజు వైసీపీకి అనుకూలంగా చేసిన ప్రకటనలు ఏపీ రాజకీయాల్లో హీట్‌ను పెంచాయి. వైసీపీ, బీజేపీపై పొత్తుల అంశంపై ఆసక్తికరమైన చర్చలు జరుగుతున్న తరుణంలో విష్ణుకుమార్ రాజు వ్యాఖ్యలు దీనికి మరింత బలం చేకూరుస్తున్నాయని పలువురు భావిస్తున్నారు. వైసీపీ 'మంత్రు'లపై అనర్హత వేటు వేయాలని వైసీపీ ఎన్నాళ్లనుంచో డిమాండ్ చేస్తోంది. ఇప్పుడు ఏకంగా టీడీపీ మిత్రపక్షం నాయకుడే ఆ డిమాండ్‌ను తెరపైకి తీసుకురావడంతో చంద్రబాబు ప్రభుత్వం ఇరకాటంలో పడింది. విష్ణుకుమార్ రాజు అసెంబ్లీలో తొలి నుంచి టీడీపీకి అనుకూలంగానే ఉండేవారు. అసెంబ్లీలో చాలాసార్లు ప్రతిపక్షనేతపై విమర్శలు చేసి చంద్రబాబు మెప్పు కూడా పొందారు. అలాంటిది ఆయనే ఇప్పుడు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం చర్చనీయాంశమైంది. తెలుగుదేశం పార్టీపై ఇటీవల గట్టిగా వ్యాఖ్యలు చేసిన బీజేపీ నేత సోము వీర్రాజు కూడా ఎప్పుడూ ఈ డిమాండ్ చేయలేదు. విష్ణుకుమార్ రాజు డిమాండ్‌పై టీడీపీ నేతలు గరంగరంగా ఉన్నారు. వైఎస్ఆర్‌సీపీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు ఇప్పటికే రాజీనామా చేశారని టీడీపీ ఎమ్మెల్యే బోండా ఉమా మహేశ్వరరావు అన్నారు. అయితే వాళ్ల రాజీనామాలు స్పీకర్ వద్ద ఉన్నాయన్నారు.

పీఏసీలో గరంగరం

ఇక పీఏసీ సమావేశంలోనూ పీఏసీ చైర్మన్ పట్టిసీమ ప్రాజెక్టు కట్టడం వల్ల రూ.1200 కోట్లు నష్టమని విమర్శించగా.. టీడీపీ ఎమ్మెల్సీ బీద రవిచంద్రయాదవ్ ఆ వ్యాఖ్యలపై తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాలో 12 లక్షల ఎకరాల్లో అదనంగా పంట పండిన విషయం మీరు మర్చిపోయారా అని ఎదురు ప్రశ్నించినట్లు తెలిసింది. ఇలా వాగ్యుద్ధం జరుగుతున్నా.. సమావేశంలో విష్ణుకుమార్‌రాజు మౌనంగా ఉన్నారని తెలిసింది. ఇంతకుముందు ఆయన పెద్ద మనిషిగా వ్యవహరించి సయోధ్య కుదిర్చేవారు. వైసీపీ మహిళా సభ్యురాలు రోజా సస్పెన్షన్ విషయంలోనూ విష్ణుకుమార్ రాజే కీలకంగా వ్యవహరించి రోజాను సస్పెండ్ చేయొద్దని, దీనివల్ల ప్రభుత్వానికి చెడ్డపేరు వస్తుందని చెప్పి ఆపించారని తెలిసింది. అలాంటి విష్ణుకుమార్ రాజు ఒక్కసారిగా కీలక వ్యాఖ్యలు చేయడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఏవో మార్పులు వస్తాయని అంతా భావిస్తున్నారు.

అప్పు పెరుగుతోంది: బుగ్గన

రాష్ట్రంలో తలసరి అప్పు పెరుగుతోందని, ఇది మంచి పద్ధతి కాదని పీఏసీ చైర్మన్ బుగ్గన రాజేంద్రనాథ్ రెడ్డి అన్నారు. బుధవారం ఆయన పీఏసీ సమావేశం అనంతరం వైసీపీఎల్పీలో మీడియాతో మాట్లాడారు.

రాష్ట్ర విభజన జరిగేనాటికి రాష్ట్రం అప్పు రూ.97వేల కోట్లు ఉండేదని.. అదిప్పుడు రూ.2 లక్షల కోట్లకు పైగా ఉందని చెప్పారు. రాష్ట్రంలో వివిధ విభాగాలు నిబంధనలకు అనుగుణంగా నిధులు ఖర్చు చేయడం లేదని బుగ్గన ఆరోపించారు.





పవన్ కాన్వాయ్‌పై చెప్పు!

- తల్లాడలో ర్యాలీలో వ్యక్తి కలకలం
- ఎంపీ అసదుద్దీన్‌పైకి బూటు
- ముంబై ర్యాలీలో చేదు అనుభవం

హైదరాబాద్, జనవరి 24 :

తెలంగాణలో ప్రజాయాత్రకు శ్రీకారం చుట్టిన జనసేన అధినేత పవన్ కల్యాణ్‌కు బుధవారం చేదు అనుభవం ఎదురైంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి ఖమ్మం జిల్లాకు బయల్దేరిన పవన్ తల్లాడ వద్ద అభిమానులకు తన కాన్వాయ్ నుంచి అభివాదం చేస్తున్నారు. ఈ సమయంలో గుర్తు తెలియని వ్యక్తి పవన్ కాన్వాయ్‌పై చెప్పును విసిరాడు. దీంతో ఒక్కసారిగా ఆ ప్రాంతంలో కలకలం రేగింది. అప్రమత్తమైన పోలీసులు ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా జాగ్రత్తపడ్డారు. అనంతరం పవన్ తల్లాడ నుంచి ఖమ్మం పట్టణానికి చేరుకున్నారు. కాగా, ట్రిపుల్ తలాక్ బిల్లుకు వ్యతిరేకంగా ప్రచారం చేస్తున్న హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీకి చేదు అనుభవం ఎదురైంది. ముంబైలోని నాగ్‌పడా ప్రాంతంలో మంగళవారం రాత్రి ఓ ర్యాలీలో మాట్లాడుతుండగా గుర్తు తెలియని వ్యక్తి షూ విసిరాడు. షరియత్ చట్టం పరిరక్షణ అంటూ దేశవ్యాప్తంగా అసద్ ప్రచారం చేస్తున్నారు. ఇందులోభాగంగానే ముంబైలో ర్యాలీ నిర్వహిస్తుండగా.. ఈ ఘటన చోటు చేసుకుంది. ''సత్య మార్గంలో వెళ్తున్నపుడు కొందరు ఇలాగే దారిలో ముళ్లు వేస్తుంటారు. ఇలాంటివి నాపై ప్రభావం చూపవు. కార్యక్రమం విజయవంతమైంది. నేను చెప్పాలనుకున్నది చెప్పాను. నాతో విసుగు చెందిన వ్యక్తులులు ఎవరో చేసిన పని ఇది. నేను ఇలాగే ఎలాంటి భద్రత లేకుండా తిరుగుతాను. ఏం చేసుకుంటారో చేసుకోండి'' అని అసద్ పేర్కొన్నారు. ద్వేషాన్ని పెంచి పోషించే వ్యక్తులు రెచ్చగొట్టడం వల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయని అసద్ చెప్పారు. గాంధీని, దబోల్కర్‌ను, పన్సారేను చంపింది వీళ్లే అంటూ అసద్ విమర్శించారు. ఈ ఘటనపై జోన్ 3 డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ వీరేంద్ర మిశ్రా స్పందించారు. సీసీటీవీ ఫుటేజ్‌ను పరిశీలించి, విచారణ జరుపుతున్నట్లు చెప్పారు.

గర్భం వెలుపల పిండానికి ఆపరేషన్!

(మొదటిపేజీ తరువాయి)

పైగా రీట్వీట్లు వచ్చాయి. తల్లి బోమర్ మూడోసారి గర్భంతో ఉండగా 16 వారాల తర్వాత అల్ట్రాసౌండ్ స్కాన్ తీసినప్పుడు శిశువు పరిస్థితి క్షీణిస్తున్నట్లు గుర్తించారు. వెన్నెముక చివరన కణితి ఉన్నట్లు స్కానింగ్‌లో తెలిసింది. దీన్ని వైద్య పరిభాషలో 'శాక్రో కాక్సీగీల్ టెరటోమా'గా వ్యవహరిస్తారు. ఈ అసాధారణ రుగ్మత ఆడ శిశువుల్లోనే ఎక్కువగా కనిపిస్తుంది. ఇది రక్తంలో అధికశాతం పీల్చేస్తూండటంతో ఒక్కో వారం గడిచేకొద్దీ శిశువు గుండె వైఫల్యం వైపు పయనించింది. దాంతో గర్భస్రావం చేయించుకోవాలని పలువురు వైద్యులు సలహా ఇచ్చారు. అయితే, టెక్సాస్‌లోని పిల్లల ఆస్పత్రి వైద్యబృందం తల్లి కడుపులోంచి బిడ్డను బయటకు తీసి కణితిని తొలగించే మార్గం ఉన్నా ప్రమాదం కూడా ఎక్కువగానే ఉంటుందని స్పష్టం చేశారు. కానీ, తల్లి ఇందుకు మొగ్గుచూపడంతో అనుకున్నట్లుగానే గర్భస్థ శిశువును బయటకు తీసి.. విజయవంతంగా కణితిని తొలగించి, మళ్లీ యథాతథంగా తల్లి గర్భంలోకి ప్రవేశపెట్టేశారు. గర్భంలో శిశువు ఎంచక్కా ఎదిగి, తొమ్మిది నెలలు నిండిన తర్వాత నిక్షేపంగా బయటకు వచ్చింది. కానీ, కణితిలో కొంత భాగం శరీరంలో మిగిలి ఉండటంతో 8 రోజుల తర్వాత మరో ఆపరేషన్ చేసి పూర్తిగా స్వస్థత తల్లీబిడ్డలను ఇంటికి పంపారు. దాంతో ఇప్పుడు సోషల్ మీడియాలో ఆ వైద్యులకు ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

కృష్ణకుమారి కన్నుమూత

(మొదటిపేజీ తరువాయి)

పాత్రలు పోషించి ప్రేక్షక నీరాజనాలందుకున్నారు. ఎన్టీ రామారావు, అక్కినేని నాగేశ్వరరావు, కాంతారావు, కృష్ణంరాజు, రాజ్‌కుమార్, శివాజీ గణేశన్ వంటి దిగ్గజాలతో పనిచేసిన కృష్ణకుమారి బహుభాషా నటిగా పేరు తెచ్చుకున్నారు. ఒక్క తెలుగు భాషలోనే 110కిపైగా సినిమాల్లో నటించిన ఈమెకు ప్రముఖ సీనియర్ నటి షావుకారు జానకి స్వయానా అక్కయ్య. బెంగళూరుకు చెందిన అజయ్‌మోహన్‌ను వివాహం చేసుకున్న అనంతరం కృష్ణకుమారి నటజీవితానికి స్వస్తిపలికారు. ఈ దంపతులకు దీపిక అనే కుమార్తె ఉన్నారు. 'నవ్వితే నవరత్నాలు' చిత్రంతో 1951లో తెలుగు చిత్రసీమలో అరంగేట్రం చేశారు. అందం, అభినయంతోపాటు చల్లని నవ్వు, మృదువైన గళంతో తన పాత్రలకు జీవంపోసి ప్రేక్షకులను మంత్రముగ్ధుల్ని చేసిన కృష్ణకుమారి దశాబ్దకాలంలోనే అగ్ర నాయికగా ఎదిగారు. అద్భుత నటనా వైదుష్యంతో జనాభిమానం చూరగొన్న ఆమెకు ఉత్తమ నటిగా మూడుసార్లు జాతీయ అవార్డు లభించింది. బ్రిటన్‌లోని బర్మింగ్‌హామ్ సంస్థ నుంచి జీవన సాఫల్య పురస్కారం కూడా పొందారు.

యూకేలో 'యాంటీ ఫేక్ న్యూస్ యూనిట్'

లండన్, జనవరి 24: అసత్య వార్తలు(ఫేక్ న్యూస్), దుష్ప్రచారాలపై పోరాటం చేసేందుకు బ్రిటీష్ ప్రభుత్వం నేషనల్ సెక్యూరిటీ కమ్యూనికేషన్స్ యూనిట్‌ను ప్రారంభించింది. ఫొటోలు, వీడియోలు రూపంలో తప్పుడు వార్తలు, గాలి వార్తలతో ప్రజలను తప్పుదోవ పట్టించే వాటిని ఫేక్ న్యూస్ అంటారు. దేశ రక్షణ రంగ సామర్థ్యాలను సమీక్షించుకోవడంలో భాగంగా యాంటీ ఫేక్ న్యూస్ యూనిట్ ప్రారంభించామని బ్రిటీష్ ప్రధానమంత్రి కార్యాలయ అధికార ప్రతినిధి థెరెసా మే తెలిపారు.

సంజన కుటుంబానికి ఆర్థికసాయం

- రూ.10 లక్షలు అందజేసిన 'జాగృతి'

హైదరాబాద్, జనవరి 24 (మనం ప్రతినిధి): గత ఏడాది జరిగిన బతుకమ్మ వేడుకల సందర్భంగా జరిగిన ప్రమాదంలో మృతి చెందిన మహిళ కుటుంబానికి తెలంగాణ జాగృతి అండగా నిలిచింద. మృతురాలి కుటుంబానికి ప్రభుత్వం తరపున రూ.5 లక్షలు, జాగృతి తరపున రూ.5 లక్షలు ఆర్థిక సాయాన్ని అందించారు.

బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో బాధితురాలు కుటుంబ సభ్యులకు సాంస్కృతి శాఖ డైరెక్టర్ మామిడి హరికృష్ణ, జాగృతి ఉపాధ్యక్షులు రాజీవ్‌సాగర్ చెక్కులు అందజేశారు. ఎల్బీ స్టేడియంలో జరిగిన వేడుకల్లో సూర్యాపేట జిల్లా నూతన్‌కల్‌కు చెందిన గుండ్లపల్లి సంజన ప్రమాదవశాత్తు మృతి చెందిన విషయం తెలిసిందే.



ఢిల్లీలో బుధవారం సాహస బాలుర అవార్డు గ్రహీతలతో ప్రధాని నరేంద్ర మోదీ. దేశవ్యాప్తంగా ఈ అవార్డుకు 18 మంది ఎంపికయ్యారు. వీరిలో ముగ్గురికి మరణాంతరం ఈ పురస్కారం వరించింది.

క్రీస్తు పూర్వం పుర్రెకు ముఖాకృతి



ఏథెన్స్, జనవరి 24: పురాతత్వ శాఖ తవ్వకాలలో బయటపడ్డ ఓ పుర్రెకు పరిశోధకులు ఓ రూపమిచ్చారు. క్రీస్తు పూర్వ కాలం నాటి పుర్రె ఆధారంగా అప్పట్లో తన ముఖం ఎలా ఉండేదనే ఊహకు ప్రాణంపోశారు. తొమ్మిది వేల సంవత్సరాల క్రితం జీవించి ఉండేదని భావిస్తున్న యువతి ముఖాన్ని సిలికాన్ సాయంతో రూపొందించారు. దీంతో వేల సంవత్సరాల క్రితమే మట్టిలో కలిసి పోయిన ఆ యువతి ముఖం ఇప్పుడు జీవం పోసుకున్నట్లు కనిపిస్తోంది. పలు పరిశోధనల తర్వాత ఆ యువతి వయస్సు 15-18 సంవత్సరాల మధ్య ఉండొచ్చని తెలిపారు. ఆ యువతి ముఖంలో కోపం కనిపిస్తోందని పరిశోధకులు చెబుతున్నారు.



మంచు దుప్పట్లో షిమ్లా.. షిమ్లాను మంచు దుప్పటి కప్పేసింది. బుధవారం అనేక ప్రాంతాల్లో పెద్ద ఎత్తున మంచు కురిసింది. మంచు కురుస్తుండగానే షిమ్లాలో ఓ రహదారిపై వాహనదారులు తమ రాకపోకలు కొనసాగించారు.

ఎఫ్ఐఆర్ నమోదుకు
పేదలు అనర్హులా?

- **పోలీసులపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం**

న్యూఢిల్లీ, జనవరి 24: నిరుపేదల ఫిర్యాదు బుట్టదాఖలు కావాల్సిందేనా? వారు కేసు పెట్టేందుకు అనర్హులా అంటూ పోలీసులపై ఢిల్లీ హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. కూతురు కన్పించడంలేదంటూ ఓ తల్లి ఫిర్యాదు ఇచ్చినా.. పోలీసులు ఎఫ్ఐఆర్ దాఖలు చేయకపోవడానికి కారణమేంటని ప్రశ్నించింది. ఈమేరకు తాత్కాలిక ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ గీతా మిట్టల్, జస్టిస్ సి.హరిశంకర్ నేతృత్వంలోని ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. అత్తవారింట్లో తన కూతురు ఇబ్బందులు పడుతోందని, అదనపు కట్నం కోసం వేధిస్తున్నారంటూ బాధితురాలి తల్లి ఆరోపించింది. ఆపై 2016 జూన్‌లో తన కూతురు కనిపించడంలేదని సమాచారం ఇచ్చారని తెలిపింది. ఈ విషయమై



స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు పేర్కొంది. అయితే పోలీసులు పట్టించుకోవడంలేదని ఆరోపిస్తూ బాధితురాలు హైకోర్టుకు లేఖ రాయడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఈ లేఖపై స్పందిస్తూ.. ఎఫ్ఐఆర్ నమోదు చేయకపోవడానికి కారణమేంటని సంబంధిత డీఎస్పీని న్యాయస్థానం ప్రశ్నించింది. అదృశ్యమైన యువతిని, ఆమె భర్తను న్యాయస్థానం ముందు హాజరుపరచాలని ఆదేశిస్తూ కేసు నమోదు విషయంలో నిర్లక్ష్యం ప్రదర్శించిన పోలీసులను చివాట్లు వేసింది.

ఆత్మాహుతితో అడ్డుకుంటాం!

'పద్మావత్' విడుదలపై కర్ణిసేన నిరసన

- **1900 మంది రాజ్‌పుత్ మహిళలు ఆహుతికి సిద్ధం**
- **చిత్తోడ్ కోటలో అగ్నిలో దూకేందుకు యత్నం**
- **అడ్డుకున్న పోలీసులు.. కోట మూసివేత**
- **శతాబ్దాల చరిత్రలో రెండోసారి కోట మూత**
- **రాజస్థాన్‌లో 'పద్మావత్' విడుదల అనుమానమే**
- **పలు రాష్ట్రాల్లో హింసాత్మకంగా మారిన నిరసనలు**
- **రోడ్ల దిగ్బంధం.. హరియాణాలో బస్సుకు నిప్పు**
- **భారీ సంఖ్యలో సేన కార్యకర్తల అరెస్టు**
- **హింసకు బాధ్యుడు భన్సాలీనే: కర్ణిసేన చీఫ్**




న్యూఢిల్లీ/ముంబై/జైపూర్, జనవరి 24: 'పద్మావత్' సినిమాను అడ్డుకునేందుకు కర్ణిసేన హింసాత్మక నిరసనలకు దిగింది.రాజస్థాన్ సహా గుజరాత్, హరియాణా, మహారాష్ట్ర, ఢిల్లీల్లో పెద్ద ఎత్తున రాజ్‌పుత్‌లు ఆందోళనలు చేపట్టారు. పలు చోట్ల ఆందోళనలు హింసాత్మకంగా మారాయి. సినిమాను ఆపకుంటే ప్రాణ త్యాగానికైనా వెనుకాడబోమంటూ కర్ణిసేన నాయకులు హెచ్చరిస్తున్నారు. దర్శకుడు సంజయ్ లీలా భన్సాలీ రాజ్‌పుత్ రాణి పద్మినిని అవమానించేలా సినిమా తీశారని, ఈ చిత్రాన్ని ఎట్టిపరిస్థితుల్లోనూ విడుదల కానీయబోమని స్పష్టం చేశారు. తమను అవమానించే ప్రయత్నం జరిగితే ప్రాణ త్యాగాలకు సిద్ధమని, వందలాది రాజ్‌పుత్ మహిళలు పద్మావతులుగా మారి ఆత్మాహుతి చేసుకునేందుకూ వెనుకాడరని హెచ్చరించారు. ఢిల్లీ సుల్తాన్ ఆక్రమణకు వచ్చిన సమయంలో రాణి పద్మిని చితి పేర్చుకుని అగ్నిలో దూకినట్లే తమ మహిళలు దూకేస్తారని, దీనికి 1900 మంది సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఇందుకోసం వందలాది మహిళలతో మంగళవారం రాత్రి కర్ణిసేన కార్యకర్తలు చిత్తోడ్ కోటను చుట్టుముట్టే ప్రయత్నం చేశారు. దీంతో పోలీసులు అప్రమత్తమై వారిని అరెస్టు చేశారు. వెంటనే కోటను మూసేశారు. శతాబ్దాల చరిత్రలో ఈ కోటను ఇలా మూసేయడం ఇది రెండోసారి. అలాగే ముందస్తు చర్యల్లో భాగంగా మంగళవారం అర్ధరాత్రి కర్ణిసేన చిత్తోడ్ విభాగం అధ్యక్షుడు గోవింద్ సింగ్, ఉపాధ్యక్షుడు కమలేందు సింగ్‌లను గృహనిర్బంధం చేశారు. రాజ్‌పుత్‌ల ఆందోళనల నేపథ్యంలో రాజస్థాన్‌లో పద్మావత్ సినిమా విడుదల అనుమానంగానే కనిపిస్తోంది. సినిమాను ప్రదర్శిస్తే థియేటర్లను దగ్ధం చేసేస్తామన్న కర్ణిసేన హెచ్చరికలతో డిస్ట్రిబ్యూటర్లు చిత్ర హక్కులు తీసుకునేందుకు ముందుకు రావడం లేదు.

వాహనాలకు నిప్పు

మంగళవారం రాత్రి నుంచే రాజస్థాన్ సహా ఢిల్లీ, మహారాష్ట్ర, గుజరాత్, హరియాణా రాష్ట్రాల్లో కర్ణిసేన నాయకులు, కార్యకర్తలు రోడ్లపైకి వచ్చి నిరసనలు చేపట్టారు. టైర్లు తగలబెట్టి ట్రాఫిక్‌ను అడ్డుకున్నారు. ఢిల్లీ-జైపూర్ రహదారిని ముట్టడించారు. ఈ నెల 25న పద్మావత్ సినిమా విడుదలను అడ్డుకుని తీరుతామని హెచ్చరికలు జారీ చేశారు. పలు ప్రాంతాల్లో కర్ణిసేన నిరసనలు హింసాత్మకంగా మారాయి. హరియాణాలోని గురుగ్రామ్‌లో నిరసనకారులు బస్సుకు నిప్పు





పెట్టారు. గుజరాత్‌లోని అహ్మదాబాద్‌లో వందలాది ప్రైవేటు వాహనాలకు తగలబెట్టారు. షాపింగ్ మాల్స్‌పై రాళ్లు రువ్వారు. దీంతో అహ్మదాబాద్‌లో 48 మంది కర్ణిసేన కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు. అలాగే ముంబైలోనూ నిరసనకారులు రోడ్లు ముట్టడించారు. దీంతో సుమారు 50 మందిని పోలీసులు అరెస్టు చేశారు. ఈ ఆందోళనల నేపథ్యంలో హరియాణాలో థియేటర్లకు 200 మీటర్ల పరిధిలో ఎటువంటి నిరసనలు చేపట్టరాదని ఆ రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. అయినప్పటికీ పలు ప్రాంతాల్లో థియేటర్ల యజమానుల సినిమా ప్రదర్శనకు భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు. కాగా, శాంతి భద్రతల సమస్య తలెత్తుతుందని సినిమాను గుజరాత్, రాజస్థాన్,



మధ్యప్రదేశ్, హరియాణా రాష్ట్రాలు నిషేధించగా.. సుప్రీం కోర్టు దీనిపై స్టే విధించిన విషయం తెలిసిందే. శాంతి భద్రతల పరిరక్షణ బాధ్యత రాష్ట్రాలు చూసుకోవాలని కోర్టు ఆదేశించింది.

పోలీసు తూటాలూ ఆపలేవ్

'పద్మావత్' విడుదలను అడ్డుకునేందుకు జరుగుతున్న నిరసనల్లో చెలరేగే హింసకు చిత్ర దర్శకుడు భన్సాలీనే బాధ్యుడని కర్ణిసేన చీఫ్ లోకేంద్ర సింగ్ కల్వీ అన్నారు. అరెస్టులు, పోలీసుల తూటాలు తమను ఆపలేవని స్పష్టం చేశారు. సినిమాలో ఢిల్లీ సుల్తాన్ అల్లావుద్దీన్ ఖిల్జీ - రాణి పద్మిని మధ్య డ్రీమ్ సీక్వెన్స్ ఉందని, దానిని తొలగించే వరకు నిరసనలు ఆగవని వెల్లడించారు. జనతా కర్ఫ్యూ పాటించడం ద్వారా ప్రజలే సినిమాను అడ్డుకుంటారని ఆయన చెప్పారు.

లిబియాలో కారు బాంబు దాడులు
33 మంది దుర్మరణం



బెంఘాజీ, జనవరి 24: లిబియాలో బుధవారం జరిగిన కారు బాంబు ఆత్మాహుతి దాడుల్లో 33 మంది దుర్మరణం పాలయ్యారు. ప్రఖ్యాత బెంఘాజీ పట్టణంలోని ఓ మసీదు ప్రాంగణంలో రెండు కారు బాంబు దాడులు జరిగాయి. ఈ ఘటన ల్లో 33 మంది దుర్మరనం పాలయ్యారు. 50 మంది వరకు తీవ్ర గా యాలయ్యాయి. బాధితుల్లో భద్రతా సిబ్బంది కూడా ఉన్నట్లు తెలిసింది. తొలుత ఒక కారు బాంబు దాడి జరగగా సమాచారం అందుకున్న భద్ర తా బలగాలు ఆ ప్రాంతానికి చేరుకున్నారు. ఆరు అక్కడికి చేరుకున్న 10-15 నిమిషాల్లోనే మరో కారు బాంబు దాడి జరిగింది. రెండోసారి జరిగిన పేలుడులో అంబులెన్స్‌లో ఉన్న చాలా మందికి గాయాల య్యాయి. గాయాలైన వారిలో మిలటరీ దళాలు, వైద్య సిబ్బంది, ప్రజలు ఉన్నారు. వీరిలో ఎక్కువ మంది పరిస్థితి విషమంగా ఉన్నదని, మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశముందని అధికారులు వెల్లడించారు.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికలు..
రాముడు, అల్లా మధ్య యుద్ధం

- **బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు.. కేసు నమోదు**



బెంగళూరు, జనవరి 24: కర్ణాటకలోని బీజేపీ ఎమ్మెల్యే ఒకరు వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. బంత్వాల్ నియోజకవర్గంలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికలు రాముడు, అల్లాకు మధ్య జరిగే యుద్ధమని ఆ పార్టీకి చెందిన సునీల్ కుమార్ పేర్కొన్నారు. కర్కాలా నియోజకవర్గం నుంచి ఆయన ప్రాతినిధ్యం వహిస్తున్నారు. అయితే బంత్వాలాలో జరిగిన ఓ కార్యక్రమంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. బంత్వాల ఎమ్మెల్యే, మంత్రి రామనాథ్‌రాయ్ ఈ మధ్య మాట్లాడుతూ..''నేను ఈ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు వరుసగా గెలిచాను. ఈ విజయాలు అల్లా దయతో వచ్చాయి. లౌకికవాదులైన ముస్లిం సామాజికవర్గం ఓట్ల వల్లే గెలిచాను'' అని పేర్కొన్నారు. ఈ వ్యాఖ్యలను సునీల్ కుమార్ ఉటంకిస్తూ.. '' బంత్వాలాలో జరిగే ఎన్నికలు హిందువుల ఆత్మగౌరవానికి పరీక్ష ఈ నియోజకవర్గం నుంచి ఆరుసార్లు గెలిచిన వ్యక్తి తాను అల్లా దయ వల్ల గెలిచానని చెప్పుకోవడం నన్ను ఆశ్చర్యపరిచింది. అందుకే ఈసారి ఎన్నికలు రాజేష్ నాయక్ (బీజేపీ), రామనాథరాయ్ మధ్య కాదు. ఇది అల్లా, రాముడి మధ్య జరిగే ఎన్నికలు. వీళ్లలో ఎవరు కావాలో బంత్వాల్ ప్రజలు నిర్ణయించుకోవాలి. అల్లానే మళ్లీమళ్లీ గెలిపిస్తారా లేక రాముడిని ప్రేమించే వ్యక్తిని గెలిపిస్తారా నిర్ణయించుకోండని సునీల్ పేర్కొన్నారు.

ఆ స్థానాల్లో ఉప ఎన్నికలొద్దు

- **ఆప్ ఎమ్మెల్యేల అనర్హతపై హైకోర్టు ఆదేశాలు**

న్యూఢిల్లీ, జనవరి 24: లాభదాయక పదవుల వివాదంలో ఎమ్మెల్యే పదవులను కోల్పోయిన ఆప్ ఎమ్మెల్యేలకు ఢిల్లీ హైకోర్టులోనూ చుక్కెదురైంది. తమపై వేసిన అనర్హత వేటును ఎత్తివేయాలని, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేయాలని ఎమ్మెల్యేలు చేసిన విజ్ఞప్తికి కోర్టు అంగీకరించలేదు. అయితే.. సోమవారం వరకు ఈ 20 అసెంబ్లీ స్థానాలకు ఎలాంటి ఉప ఎన్నిక నోటిఫికేషన్ ఇవ్వకూడదని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు హైకోర్టు సూచించింది. అంటే.. అదే రోజు (29)న తదుపరి విచారణ జరగనున్నందున, అప్పటి వరకు ఆగాలని ఈసీకి సూచించింది.

లాలూ.. మిశ్రాలకు ఐదేళ్ల జైలు

మాజీ సీఎంలుసహా 50 మందిపై దోష నిర్ధారణ
పశుదాణా కుంభకోణంలో సీబీఐ కోర్టు తీర్పు
అవసరమైతే సుప్రీం కోర్టులో సవాలు: తేజస్వి



రాంచీ, జనవరి 24: పశుదాణా కుంభకోణంలోని మరో కేసులో బిహార్ మాజీ ముఖ్యమంత్రులు లాలూ ప్రసాద్ యాదవ్, జగన్నాథ్ మిశ్రాలకు ఐదేళ్ల చొప్పున జైలుశిక్ష పడింది. ఈ మేరకు రాంచీలోని సీబీఐ ప్రత్యేక కోర్టు జడ్జి ఎస్.ఎస్.ప్రసాద్ బుధవారం తీర్పు ప్రకటించారు. చాయిబాసా ఖజానా కార్యాలయం నుంచి 1990లో రూ.37.62 కోట్లు అక్రమంగా విడుదల చేసిన కేసులో వీరిద్దరితోపాటు మరో 50 మందిని దోషులుగా కోర్టు ప్రకటించింది. ఈ కేసులో నిందితులైన 76 మందికిగాను 14 మంది మరణించగా ముగ్గురు సాక్షులుగా మారారు. ఇద్దరికి శిక్ష పడగా ఒకరు పరారీలో ఉండటంతో మిగిలిన 56 మందిపై విచారణ కొనసాగింది. వీరిలో ఇద్దరు ప్రభుత్వోద్యోగులు, నలుగురు దాణా సరఫరాదారులకు బుధవారం కోర్టు అభియోగ విముక్తి ప్రసాదించింది. ఇక ఈ కుంభకోణంలో నమోదైన కేసులకు సంబంధించి ఆర్జేడీ అధినేత లాలూకు శిక్ష పడటం ఇది మూడోసారి. ప్రస్తుత కేసులోని దోషులలో మాజీ మంత్రి విద్యాసాగర్ నిషాద్, బిహార్ అసెంబ్లీ మాజీ ప్రజాపద్దుల కమిటీ చైర్మన్ జగదీశ్ శర్మ, మాజీ ఎమ్మెల్యేలు ధ్రువ్ భగత్, ఆర్.కె.రాణా, మరో ముగ్గురు మాజీ ఐఏఎస్ అధికారులు కూడా ఉన్నారు. కాగా, ముఖ్యమంత్రి నితీశ్‌కుమార్, బీజేపీ కుమ్మక్కై తన తండ్రిని రాజకీయంగా వేధిస్తున్నాయని కోర్టు తీర్పు వెలువడిన తర్వాత లాలూ కుమారుడు తేజస్వియాదవ్ ఆరోపించారు. ''కోర్టు తీర్పును ఎవరైనా గౌరవించాల్సిందే. అయితే, ఇదే అంతిమం కాదు... ఈ తీర్పును మేం ఉన్నత న్యాయస్థానంలో సవాలు చేస్తాం. అవసరమైతే సుప్రీం కోర్టును కూడా ఆశ్రయిస్తాం'' అని చెప్పారు. పశుదాణా కుంభకోణంలో లాలూ ఐదు కేసులలో నిందితుడుగా ఉన్నారు. వీటికి సంబంధించి 21 ఏళ్ల కిందట దేవ్‌గఢ్ ఖజానా నుంచి రూ.89.27 కోట్ల విడుదలలో సీబీఐ కోర్టు ఈ నెలలోనే మూడున్నరేళ్ల జైలుశిక్ష, రూ.10 లక్షల జరిమానా విధించింది. అలాగే చాయిబాసా ఖజానా నుంచి రూ.37.7 కోట్లు విడుదల చేసిన కేసులో 2013 సెప్టెంబరు 30న లాలూకు ఐదేళ్ల శిక్షపడగా, తాజాగా మూడో కేసులో ఐదేళ్ల శిక్ష పడింది. ఇవికాకుండా డుంకా ఖజానా నుంచి రూ.3.97 కోట్లు, దొరండా ఖజానా నుంచి రూ.184 కోట్లు విడుదల చేసిన కేసులలోనూ లాలూపై విచారణ కొనసాగుతోంది.

'శ్రీజన్' స్కాంపై సీబీఐతో విచారణకు డిమాండ్

రాష్ట్రంలో దాదాపు రూ.వెయ్యి కోట్ల మేర ప్రజాధనం దుర్వినియోగమైనట్లు బిహార్ అసెంబ్లీలో ఆర్జేడీ పక్ష నేత తేజస్వి యాదవ్ ఆరోపించారు. ఈ నిధులను ప్రభుత్వేతర సంస్థలకు మళ్లించినట్లు ఆయన పేర్కొన్నారు. దీనిపై సీబీఐ విచారణకు డిమాండ్ చేశారు. అలాగే రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని ఆరోపించారు. ముఖ్యంగా సమాజంలోని బలహీనవర్గాలు... ప్రత్యేకించి దళితులు అణచివేతకు గురవుతున్నట్లు ఆరోపించారు. ఈ మేరకు ఆర్జేడీ ప్రతినిధి బృందం తేజస్వి నాయకత్వంతో గవర్నర్ సత్యపాల్ మాలిక్‌కు వినతిపత్రం సమర్పించింది. అనంతరం ఆయన రాజ్‌భవన్ వెలుపల విలేకరులతో మాట్లాడుతూ- ఈ ఏడాది డిసెంబరులో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహించాలని ఎన్డీఏ భావిస్తున్నట్లు తేజస్వి ఆరోపించారు. అందుకే ప్రజలకు 'హీరో' అయిన తన తండ్రిని 'జీరో'గా చూపడం కోసం నితీశ్, బీజేపీ కుమ్మక్కైనట్లు ఆరోపించారు. కానీ, ఎన్నికలు ఎప్పుడు నిర్వహించిన ఆర్జేడీ దీటైన బదులిస్తుందని ధీమా వ్యక్తం చేశారు.

సయీద్‌పై చర్యలొద్దు


- **పాక్ సర్కారుకు లాహోర్ హైకోర్టు ఆదేశం**

లాహోర్, జనవరి 24: ముంబై ఉగ్రవాద దాడుల సూత్రధారి హఫీజ్ సయీద్‌కు లాహోర్ హైకోర్టు రక్షణగా నిలిచింది. తదుపరి ఆదేశాలు ఇచ్చే వరకు హఫీజ్‌ను అరెస్టు చేయరాదని పాకిస్థాన్ ప్రభుత్వానికి సూచించింది. ఐక్యరాజ్య సమితి భద్రతా మండలి 1267 ఆంక్షల కమిటీ ప్రతినిధులు గురువారం పాకిస్థాన్‌లో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో తనను అరెస్టు చేస్తారేమోనని పేర్కొంటూ సయీద్ కోర్టును ఆశ్రయించారు. తనను అరెస్టు చేయకుండా, తన నేత త్వంలోని జమాత్ ఉద్ దవా, ఫలాహ్ ఇ ఇన్సానియత్ ఫౌండేషన్లపై చర్య తీసుకోకుండా నిరోధించాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన కోర్టు ఎలాంటి చర్యలు తీసుకోవద్దని ఆదేశాలు జారీ చేసింది.

సమాచార సంరక్షణకు చట్టం తేవాలి

- **పార్లమెంటరీ కమిటీ సిఫారసు**

న్యూఢిల్లీ, జనవరి 24: భారతదేశం ఓ డిజిటల్ కాలనీగా మారకముందే ప్రభుత్వ, ప్రైవేటు వ్యవస్థల సమాచార రక్షణ కోసం సమాచార కుదింపు, రక్షణ, సమాచార నిల్వకు సంబంధించి చట్టం చేయాల్సిన అవసరం ఉందని ఆర్థిక శాఖకు చెందిన పార్లమెంటరీ స్టాండింగ్ కమిటీ హెచ్చరించింది. ఇందుకు సంబంధించిన బిల్లును వీలైనంతగా త్వరగా పార్లమెంట్‌లో ప్రవేశపెట్టాలని కమిటీ సూచించింది. అంతేకాకుండా సరిపడినంత బడ్జెట్‌తో పాటు ప్రధాన మంత్రి కార్యాలయానికి నేరుగా రిపోర్టు చేసే అంతరిక్ష, అణుశక్తి విభాగాలకు సమానంగా ఓ అధికార వ్యవస్థను ఏర్పాటు చేయాలని కమిటీ తన నివేదికలో పేర్కొంది. డిజిటలైజేషన్ దిశగా దేశం పరుగులు పెడుతుందని, నోట్లు రద్దు నిర్ణయం తర్వాత సమాచార భద్రతకు ప్రత్యేక చట్టం చేయాల్సిన ప్రాధాన్యత పెరిగిందని పేర్కొంది. ప్రజలు వివిధ సంస్థలకు అందించిన సమాచారంపై వారికి నియంత్రణ, యాజమాన్య హక్కు కల్పించాలని, లేదంటే మన వ్యవస్థ సమాచార సేకరణ సంస్థల చేతుల్లోకి వెళ్లిపోతుందని తెలిపింది. సైబర్ దాడులు, సైబర్ దాడులను ఎదుర్కొనే నిపుణుల కొరతపై స్పందిస్తూ ఈ విషయంలో సామర్థ్యం పెంచుకునేందుకు యుద్ధప్రాతిపదకన చర్యలు తీసుకోవాలని సూచించింది. ఇంటర్నెట్ అండ్ మొబైల్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా లెక్కల ప్రకారం దేశంలో ఉన్న డేటా సెక్యూరిటీ ఖాతాల్లో యాభై శాతం కంటే ఎక్కువ వాటిలో లోపాలు ఉన్నాయి.





ధర్.. అంతర్జాతీయ ఉగ్రవాది

భారత-బ్రిటిష్ పౌరుడు సిద్ధార్థ్‌పై అమెరికా ముద్ర.. ఇస్లాంలోకి మారి 2014లో ఐఎస్‌లో చేరిన హిందువు
బందీల తలలు నరికే 'కొత్త జిహాదీ జాన్'గా పేరు.. బెల్జియన్-మొరాకో ఉగ్రవాదిపైనా అగ్రదేశం ఆంక్షలు..

వాషింగ్టన్, జనవరి 24: ఇస్లామిక్ స్టేట్ ముష్కర సంస్థ ఉగ్రవాది, భారత సంతతికి చెందిన బ్రిటిష్ పౌరుడు సిద్ధార్థ్ ధర్‌ను అంతర్జాతీయ ఉగ్రవాదిగా అమెరికా ప్రకటించింది. అతడితోపాటు బెల్జియన్-మొరాకో పౌరుడు అబ్దెలతీఫ్ గైనీని కూడా ఈ జాబితాలో చేర్చింది. అమెరికా చట్టాల పరిధిలోని వీరిద్దరి ఆస్తులను స్తంభింపజేస్తున్నట్లు స్పష్టం చేసింది. అమెరికా పౌరులు వీరిద్దరితో ఎలాంటి లావాదేవీలూ నిర్వహించరాదని స్పష్టం చేసింది. బ్రిటిష్-హిందువైన ధర్ ఇస్లాం మతంలోకి మారి 'అబూ రుమేసా'గా పేరు మార్చుకున్నాడు. బ్రిటన్‌లో ప్రస్తుతం కనుమరుగైన ఉగ్రవాద సంస్థ 'అల్-ముజాహిరోం' నాయకులలో ఒకడుగా వ్యవహరించాడు. పోలీసులు అరెస్టు చేశాక బెయిలు పొంది బయటకు వచ్చిన ధర్ 2014లో భార్యాబిడ్డలతో సిరియా పారిపోయాడు. ఆ తర్వాత ఐఎస్‌లో చేరి కీలక నాయకుడయ్యాడు. బందీల తలలను బహిరంగంగా నరికేసే 'జిహాదీ జాన్'గా పేరున్న మహ్మద్ ఎమ్వాజీ 2015లో అమెరికా డ్రోన్ దాడిలో హతమయ్యాడు. ఆ తర్వాత ధర్ అతడి స్థానంలో సీనియర్ కమాండర్‌గా నియమితుడై 'కొత్త జిహాదీ జాన్'గా పేరుపొందాడు. ఐఎస్ 2016 జనవరిలో విడుదల చేసిన వీడియోలో బ్రిటన్ గూఢచారులుగా ఆరోపిస్తూ పలువురిని నిలువునా గొంతుకోసిన ముసుగు ముష్కరుడు అతడేనని భావిస్తున్నట్లు అమెరికా విదేశాంగ శాఖ వెల్లడించింది. ధర్, గైనీలవల్ల అమెరికా పౌరులకు, దేశ భద్రతకు ముప్పుందని ప్రకటించింది. వీరిద్దరూ దాడులకు పాల్పడే ప్రమాదం ఉందని పౌరులను హెచ్చరించింది. కాగా, ఇరాక్‌లోని మోసుల్ నగరం ఐఎస్ ఉగ్రవాదుల చేజిక్కినపుడు ధర్ అక్కడే ఉన్నట్లు యాజ్దీ తెగకు చెందిన ఓ బాలిక తెలిపింది. అతడు తనను కిడ్నాప్ చేసి నిర్బంధించి లైంగిక బానిసగా మార్చి చిత్రహింసలకు గురిచేసినట్లు అప్పట్లో ఆమె వెల్లడించింది. ఇక గైనీ బ్రిటన్‌కు చెందిన ఐఎస్ సానుభూతిపరులతో కలసి దుశ్చర్యలకు పాల్పడుతుండటంతో అమెరికా అతడిని అంతర్జాతీయ ఉగ్రవాదుల జాబితాలో చేర్చింది.

హక్కానీ కమాండర్‌సహా ముగ్గురు హతం

పాకిస్థాన్‌లో అమెరికా డ్రోన్లతో దాడులు చేయగా హక్కానీ ఉగ్రవాద సంస్థ అగ్ర నాయకుడుసహా ముగ్గురు హతమయ్యారు. అఫ్ఘానిస్థాన్ సరిహద్దుల్లో గిరిజన ప్రాబల్య ప్రాంతం ఉత్తర వర్జీనిస్థాన్‌లో ఓ ఇంటిపై అమెరికా సైనికులు డ్రోన్లద్వారా రెండు క్షిపణులను ప్రయోగించారు. ఈ దాడిలో ఉగ్రవాదులు దాగి ఉన్న ఇల్లు ధ్వంసం కాగా హక్కానీ కమాండర్ ఎహ్‌సాన్ అలియాస్ ఖవారి, అతని అనుచరులిద్దరు మరణించినట్టు గుర్తించారు. అఫ్ఘాన్ శరణార్థులు లక్ష్యంగా అమెరికా బలగాలు దాడి చేసినట్టు పాక్ పత్రిక వెల్లడించగా.. రహస్య స్థావరంపై దాడి చేసినట్టు స్థానిక వర్గాలు వెల్లడించాయి.



గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుంది

– సి.కల్యాణ్

సాయిధరమ్‌తేజ్, లావణ్య త్రిపాఠి జంటగా నటిస్తున్న చిత్రం 'ఇంటిలిజెంట్'. సి.కె.ఎంటర్‌టైన్‌మెంట్స్ పతాకంపై సి.కల్యాణ్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. వి.వి.వినాయక్ దర్శకుడు. ఫిబ్రవరి 9న ఈ సినిమా విడుదలవుతుంది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన పాత్రికేయుల సమావేశంలో..సి.కల్యాణ్ మాట్లాడుతూ ''ఈ సినిమాను ఫిబ్రవరి 9న విడుదల చేస్తున్నాం. మా సినిమా దేనికీ పోటీ కాదు. సంక్రాంతికి బాలయ్య సినిమా 'జై సింహా'తో హిట్ కొట్టాం. ఫిబ్రవరిలో ఈ సినిమా వస్తుంది. మాస్, ఎంటర్‌టైనర్‌గా ఉంటుంది. ఫ్యామిలీలకు కూడా నచ్చుతుంది. నేను గర్వంగా చెప్పుకునే సినిమా అవుతుంది. డ్యాన్సులు, మూవ్‌మెంట్స్ చాలా బాగా చేశాడు తేజ్. 2018 మా సీకే ఎంటర్‌టైన్‌మెంట్ అవుతుంది. ఇంటలిజెంట్‌గా వస్తున్నాం. ఇంటలిజెంట్ గా కొడతాం'' అన్నారు. వినాయక్ మాట్లాడుతూ ''సి.కల్యాణ్‌గారి సంస్థలో సినిమా చేయమని మా నాన్నగారు ఎప్పుడూ చెప్పేవారు. నాకు ఆయన సంస్థలో పనిచేయడం చాలా ఆనందంగా ఉంది. మా నాన్నగారి కోరిక నెరవేరింది. ఆయన నిర్మాతగా అనిపించలేదు. మా అన్నయ్యలాగా అనిపించారు. తేజ్ చాలా బాగా చేశాడు. తను ఎంత ఎదిగినా అన్నయ్య లాగా ఇలాగే ఉండాలి. 'కొండవీటిదొంగ'లోని చమక్కు చమక్కు.. పాటను ఇందులో రీమిక్స్ చేశాం. తేజ్ వేసిన స్టెప్పులు చూస్తే చాలా ఆశ్చర్యంగా అనిపించింది'' అని తెలిపారు. సాయిధరమ్‌తేజ్ మాట్లాడు తూ ''సినిమాను అనుకున్న సమయంలో పూర్తి చేశాం. 'ఖైదీ నెంబర్ 150' అయిన తర్వాత వినాయక్‌గారు నాతో సినిమా చేయడం చాలా ఆనందంగా ఉంది. మంచి పాత్ర కుదిరింది. డబ్బింగ్‌లో కొన్ని సీన్లు చేసి షాక్ అయ్యాను. నేనేనా చేసింది అని అనిపించింది. నాతో పాటు వస్తున్న వరుణ్ సినిమా కూడా హిట్ కావాలి'' అని చెప్పారు. లావణ్య త్రిపాఠి మాట్లాడుతూ ''సినిమా మొదలుపెట్టడానికి ముందు చాలా భయమేసింది. కానీ సెట్స్‌లో చాలా సరదాగా చేశాను'' అని చెప్పారు.

సమంత యూ టర్న్



కన్నడలో సంచలన విజయం సాధించిన 'యూ టర్న్' చిత్రాన్ని తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ చేయనున్నారన్న వార్త కొంతకాలంగా వినిపిస్తోంది. అయితే అధికారికంగా ఎవరూ దీన్ని ప్రకటించలేదు. అయితే ఈ విషయాని హీరోయిన్ సమంత కన్‌ఫర్మ్ చేసింది. తెలుగు, తమిళ భాషల్లో రీమేక్ అవుతున్న ఈ చిత్రంలో తను హీరోయిన్‌గా నటిస్తున్నట్టు సమంత సోషల్ మీడియాలో ప్రకటించింది. కన్నడ చిత్రానికి దర్శకత్వం వహించిన పవన్‌కుమార్ ఈ ద్విభాషా చిత్రానికి కూడా దర్శకత్వ బాధ్యతలు చేపడుతున్నాడు. శ్రీనివాస సిల్వర్ స్క్రీన్ ప్రొడక్షన్స్ పతాకంపై రూపొందనున్న ఈ చిత్రం రెగ్యులర్ షూటింగ్ ఫిబ్రవరిలో ప్రారంభం అవుతుంది.



మరపురాని కథానాయిక కృష్ణకుమారి



అందం, అద్భుతమైన నటన కలగలిసిన నటీమణి కృష్ణకుమారి. జానపద చిత్రాలో రాకుమారి అంటే గుర్తొచ్చే హీరోయిన్ ఈమె మరి. సాంఘిక చిత్రాల్లోనూ తనదైన నటనతో చెరగని ముద్ర వేసుకున్న తిరుగులేని కథానాయిక. ఎన్టీఆర్, ఏఎన్నార్, కాంతారావు వంటి అగ్ర కథానాయకులకు ధీటుగా నటించి మెప్పించిన మరచిపోలేని నాయిక మన కృష్ణకుమారి. ఈ అలనాటి అందాల తార బుధవారం తెలుగు సినీ అభిమానులను విడిచి పెట్టి దివికేగారు. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో అగ్ర తారల సరసన నటించారు. బెంగళూరుకి చెందిన అజయ్ మోహన్‌ను వివాహం చేసుకున్నారు. వీరికి పిల్లలు లేకపోవడంతో దీపిక అనే అమ్మాయిని దత్తత తీసుకున్నారు.



వివిధ పాత్రలు పోషించి మంచి నటి తెలుగు ప్రేక్షకుల అభిమానాన్ని చూరగొన్నారు. రెండున్నర దశాబ్దాల పాటు తిరుగులేని కథానాయికగా రాణించారు. 1963లో వచ్చిన 'లక్షాధికారి' చిత్రంలో బికినీలో నటించి గ్లామరస్ హీరోయిన్‌గా సంచలనం రేపారు. అప్పట్లో బికినీ నటించడమంటే గొప్ప విషయమే మరి. అయితే సెన్సార్‌వారు ఆ సన్నివేశాన్ని తొలిగించేశారు. కెరీర్ ప్రారంభంలో గ్లామరస్ హీరోయిన్‌గా పేరు తెచ్చుకున్న కృష్ణకుమారి, తర్వాత మంచి పెర్ఫామెన్స్‌కు స్కోప్ ఉన్న పాత్రల్లో నటించి మెప్పించారు. తెలుగులో 'భార్యాభర్తలు', 'వాగ్దానం', 'స్త్రీ జన్మ', 'కులగోత్రాలు', 'గుడిగంటలు', 'పిచ్చి పుల్లయ్య', 'పల్లె పడుచు', 'బంగారు పాప', 'బందిపోటు', 'ఎదురీత', 'చిక్కడు దొరకడు', 'వరకట్నం', 'లక్షాధికారి' సహా 110కి పైగా సినిమాల్లో నటించారు. కృష్ణకుమారి మృతి పట్ల తెలుగు చిత్ర పరిశ్రమ తీవ్ర సంతాపాన్ని వ్యక్తం చేసింది.



అలనాటి మేటి తార కృష్ణ కుమారి నేడు తుది శ్వాస విడిచారు. ఆమె మరణం పట్ల నందమూరి బాలకృష్ణ ప్రగాఢ సంతాపం తెలియజేశారు. రామారావుగారు ఎన్.ఏ.టి సంస్థలో తొలిసారి స్వయంగా నిర్మించిన ''పిచ్చి పుల్లయ్య''(1953)తో సహా దాదాపు పాతిక సినిమాల్లో కృష్ణకుమారి నాన్నగారి సరసన కథానాయికగా నటించారు. ''దేవాంతకుడు, బందిపోటు, ఉమ్మడి కుటుంబం, వరకట్నం'' లాంటి సంచలన విజయం సాధించిన చిత్రాల్లోనూ నాన్నగారి సరసన కృష్ణకుమారి నటించడం విశేషం. అటువంటి మేటి నటీమణి నేడు మన మధ్య లేకపోవడం బాధాకరం. ఆమె ఆత్మకు శాంతి కలగాలని, ఆమె కుటుంబసభ్యులకు ఆ భగవంతుడు మనోధైర్యం కలిగించాలని కోరుకొంటున్నాను బాలకృష్ణ.



అనుష్క లేకపోతే 'భాగమతి' ప్రాజెక్టే లేదు

– దర్శకుడు జి.అశోక్

అనుష్క ప్రధాన పాత్రలో యు.వి. క్రియేషన్స్ పతాకంపై జి.అశోక్ దర్శకత్వంలో వంశీ, ప్రమోద్ నిర్మిస్తున్న భారీ చిత్రం 'భాగమతి'. తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో జనవరి 26న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రం విడుదలవుతోంది. ఈ సందర్భంగా దర్శకుడు జి.అశోక్ చిత్ర విశేషాలను తెలియజేస్తూ ''2012లో ఈ కథను మొదట యు.వి. క్రియేషన్స్ వంశీ, ప్రమోద్‌గార్లకు వినిపించాను. కథ విని వాళ్ళు చాలా ఇంప్రెస్ అయ్యారు. ఆ తర్వాత హీరో ప్రభాస్‌గారికి కూడా చెప్పాను. ఆయన కూడా కథ చాలా బాగుంది అన్నారు. వారి సహకారంతో ఫైనల్‌గా అనుష్క గారికి కథ వినిపించాను. అలా ఓ భారీ ప్రాజెక్ట్‌కి శ్రీకారం చుట్టడం జరిగింది. అయితే బాహుబలి చిత్రం మొదటి భాగం షూటింగ్ స్టార్ట్ అవ్వకముందే ఈ కథను అనుష్కగారికి వినిపించడం వినిపించాను. వెంటనే సినిమా చేయడానికి ఒప్పుకున్నారు. అప్పటికే బాహుబలి కమిట్ అయి ఉండడం వల్ల ఆ రెండు భాగాలూ పూర్తయ్యేవరకు ఆగాల్సి వచ్చింది. మధ్యలో వచ్చిన గ్యాప్‌లో సినిమా స్టార్ట్ చేసేద్దామని ప్రయత్నించాం. కానీ, కుదరలేదు. 'భాగమతి' విషయానికి వస్తే ఇది అందరికీ నచ్చే యూనివర్సల్ సబ్జెక్ట్. ఒక ప్రాంతానికి, ఒక భాషకు సంబంధించిన కథ కాదు. ఈ కథకు ఎలాంటి బ్యాక్‌డ్రాప్ తీసుకున్నా ఆకట్టుకుంటుంది. ఏ భాష వారికైనా ఈ కథ, ఇందులోని ఎమోషన్స్ కనెక్ట్ అవుతాయి. ఎందుకంటే అన్నిచోట్లా జరిగే కథే ఇది. ఇందులో భాగమతి క్యారెక్టర్ చాలా పవర్‌ఫుల్‌గా ఉంటుంది. ఈ తరహా క్యారెక్టర్ చెయ్యాలంటే ఆ ఆర్టిస్టుకి ఓ స్టేచర్ ఉండాలి. భాగమతి అంటే ఇలాగే ఉంటుందేమో అని ప్రేక్షకులకు అనిపించాలి. అన్నింటినీ మించి ఆ ఆర్టిస్టుకి ప్రేక్షకుల్లో మంచి గుర్తింపు ఉండాలి. ఈ లక్షణాలన్నీ అనుష్కలో మాత్రమే మనకు కనిపిస్తాయి. భాగమతి క్యారెక్టర్‌కి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యగల నటి అనుష్క అని చెప్పడంలో ఎలాంటి అతిశయోక్తి లేదు. అందుకే ఆమె కోసం సినిమాను మొదలు పెట్టకుండా సంవత్సరాల తరబడి వెయిట్ చేశాను. సినిమా స్టార్ట్ చేసిన తర్వాత భాగమతి క్యారెక్టర్‌లో అనుష్కని చూసి మా సెలక్షన్ హండ్రెడ్ పర్సెంట్ కరెక్ట్ అని అర్థమైంది. ప్రతి ఎమోషన్‌ని ఎంతో అద్భుతంగా క్యారీ చేశారు. డైలాగ్స్ కూడా ఒక రేంజ్‌లో చెప్పారు. ఈ క్యారెక్టర్ కోసం అనుష్క పడిన కష్టం మామూలుది కాదు. తన చేతికి గాయమై బాధ పెడుతున్నా లెక్క చేయకుండా పనిచేశారు. పురాతనమైన బంగ్లా కావడం వల్ల డస్ట్ కూడా క్రియేట్ చెయ్యాల్సి వచ్చింది. ఆమెకు డస్ట్ ఎలర్జీ ఉన్నా దాన్ని లెక్క చెయ్యకుండా హండ్రెడ్ పర్సెంట్ ఔట్ పుట్ వచ్చేవరకు పెర్‌ఫార్మ్ చేసేవారు. అసలు అనుష్కగారు ఈ సినిమా చెయ్యకపోతే 'భాగమతి' అనే ప్రాజెక్టే ఉండేది కాదు. ఇంతకు ముందు అనుష్క గారు లేడీ ఓరియంటెడ్ మూవీస్ చాలా చేశారు. వాటికి, ఈ సినిమాకి ఎలాంటి సంబంధం కనిపించదు. పాత్ర పరంగా కూడా చాలా కొత్తగా ఉంటుంది. నిజానికి ఇది లేడీ ఓరియంటెడ్ సబ్జెక్ట్ కాదు. స్క్రీన్‌ప్లే ప్రధానంగా ఉండే సినిమా ఇది. ఈ సినిమాకి ఉన్న మెయిన్ స్ట్రెంగ్త్ అదే అని చెప్పాలి. ఈ సినిమాలో అనుష్క క్యారెక్టర్‌తో పాటు మరో ముఖ్యమైన క్యారెక్టర్ ఉంది. అదే కథలో కీలకమైన బంగ్లా. దాని చుట్టూ 'భాగమతి' కథ తిరుగుతుంది. సబ్జెక్ట్ డిమాండ్ మేరకు భారీ సెట్ వెయ్యాల్సిన అవసరం ఏర్పడింది. మొదట అలాంటి బంగ్లా ఎక్కడైనా దొరుకుతుందేమోనని చాలా లొకేషన్స్‌లో చూడడం జరిగింది. అయితే మా ఊహలకు తగ్గ బంగ్లా ఎక్కడా కనిపించలేదు. దీంతో భారీ సెట్ వెయ్యాల్సి వచ్చింది. కథను, నన్ను నమ్మిన నిర్మాతలు ఖర్చుకు వెనకాడకుండా ఎంతో భారీ సెట్‌ని నిర్మించడానికి సిద్ధమయ్యారు. ఆర్ట్ డైరెక్టర్ రవీందర్‌గారు చాలా అద్భుతంగా ఈ సెట్‌ని డిజైన్ చేశారు. నిజంగా ఆ బంగ్లా 400 సంవత్సరాల క్రితం నిర్మించిందేనా అనిపించేలా ఉంది. 'భాగమతి' 75 శాతం సినిమా ఆ బంగ్లాలోనే జరుగుతుంది. ఈ శుక్రవారం ప్రేక్షకుల ముందుకు వస్తున్న మా 'భాగమతి' ప్రేక్షకులంతా ఆదరిస్తారని నమ్ముతున్నాను. నా కెరీర్‌లో ఈ సినిమా ఓ మెమరబుల్ మూవీ అవుతుందని ఎంతో కాన్ఫిడెంట్‌గా చెప్పగలను'' అన్నారు.

'ఇట్లు.. అంజలి' ఫస్ట్‌లుక్



● కార్తికేయ, హిమాన్సి, శుభాంగి

కార్తికేయ, హిమాన్సి, శుభాంగి పంతే, అనంత్, సైదులు వెంకీ, జబర్దస్త్ అవినాష్, టెంకాల నారి, అర్జున్, నవీన్, ధనుష్, సంజయ్ కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'ఇట్లు.. అంజలి'. నవీన్ మన్నేల స్వీయ దర్శకత్వంలో నిర్మించారు. ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను హైదరాబాద్‌లో బుధవారం సీనియర్ జర్నలిస్ట్ పసుపులేటి రామారావు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ''ఈ సినిమా హీరో బాలనటుడిగా 50 సినిమాలు చేశారు. వాళ్ల నాన్న ప్రొడక్షన్ మేనేజర్‌గా చాలా ఫేమస్. అబ్బాయికి నటనలో మంచి పట్టు ఉంది. నాయిక కూడా నేషనల్ వైడ్ గా భరతనాట్యంలో పేరు తెచ్చుకున్న అమ్మాయి. వీరందరూ కలిసి చేసిన ఈ సినిమా పెద్ద హిట్ కావాలి. దర్శకుడు వీరశంకర్ దగ్గర పనిచేసిన రోజుల నుంచీ నాకు తెలుసు. ఈ సినిమా అందరికీ మంచి పేరు తెచ్చిపెట్టాలి'' అని అన్నారు. దర్శకనిర్మాత నవీన్ మన్నేల మాట్లాడుతూ ''ఇట్లు.. అంజలి' సినిమా ప్రేమలేఖ ఆధారంతో తెరకెక్కించిన థ్రిల్లర్ సబ్జెక్ట్. అంజలి అనే పేరు గల అమ్మాయి రాసిన ప్రేమలేఖ, అదే పేరు గల మరో అమ్మాయి జీవితాన్ని ఎలా మార్చేసింది అనేది ఈ సినిమాలో ఆసక్తికరం. జీవితంలో సందిగ్ధావస్థలో వున్నప్పుడు.. ప్రేమ ఎలా ఆదుకుంటుంది కూడా ఈ సినిమాలో చూడొచ్చు. ప్రేమకు సరైన నిర్వచనం ఇంతవరకు దొరకలేదు.. అనే భావన ప్రపంచంలో వుంది.. ఆడవారి జీవితకాలంలో వారి ప్రవర్తనలో ఆ నిర్వచనం ఉంది. అది ఏంటో ఈ చిత్రంలో చూడొచ్చు'' అని తెలిపారు.

బిజీ అయిపోయిన అను



మజ్నుతో హీరోయిన్‌గా తెలుగులో పరిచయమైన మలయాళ బ్యూటీ అను ఇమ్మానుయేల్ ఇప్పుడు బిజీ హీరోయిన్ అయిపోయింది. కిట్టు ఉన్నాడు జాగ్రత్త, ఆక్సిజన్, డిటెక్టివ్ వంటి సినిమాల్లో తన పెర్‌ఫార్మెన్స్‌తో అందర్నీ ఆకట్టుకున్న అను అజ్ఞాతవాసి చిత్రంలో పవన్ కల్యాణ్ సరసన హీరోయిన్‌గా నటించి పెద్ద హీరోయిన్ రేంజ్‌కి ఎదిగింది. ప్రస్తుతం అల్లు అర్జున్ సరసన నాపేరు సూర్య చిత్రంలో నటిస్తోంది. అలాగే నాగచైతన్య కాంబినేషన్‌లో ఓ సినిమా చేస్తోంది. ఇవికాక గోపీచంద్ మలినేని దర్శకత్వంలో సాయిధరమ్ తేజ్ హీరోగా నటించనున్న చిత్రంలో కూడా అను హీరోయిన్‌గా నటించే అవకాశం వుందట. ఎన్టీఆర్, రామ్‌చరణ్ కాంబినేషన్‌లో రాజమౌళి తెరకెక్కించే చిత్రంలో కూడా ఈ కేరళ కుట్టి నటించే అవకాశం ఉందని తెలుస్తోంది.

వినోదంతో పాటు విస్మయం



భరతవర్ష క్రియేషన్స్ పతాకంపై నూతన నటీ నటులతో చెన్నకుని శెట్టి (కుమార్) దర్శకత్వంలో తెరకెక్కుతున్న కొత్త చిత్రం పూజా కార్య క్రమాలు ఫిలింఛాంబర్‌లో జరిగాయి. దర్శకులు సముద్ర, తెలంగాణ ఫిలిం ఛాంబర్ అధ్యక్షుడు ప్రతాని రామకృష్ణ గౌడ్, సెక్రటరీ సాయి వెంకట్, జి.వి.కె 4 మ్యూజిక్ అధినేత వి. గోపాలకృష్ణ, మురళీ తదితలు పాల్గొన్నారు. ఫ్రతాని రామకృష్ణ గౌడ్, సాయివెంకట్ మాట్లాడుతూ... ఈ మూవీ దర్శకుడు మంచి టాలెంటెడ్‌గా కనిపిస్తున్నారు. పూజా కార్యక్రమాలతో ప్రారంభమైన ఈ చిత్రం విజయోత్సవ సభను జరుపుకునే దాకా వెళుతుందనే నమ్మకం ఉంది. మంచి అభిరుచి ఉన్న టీంలా కనపడుతున్నారు. నా సపోర్ట్ ఎప్పుడూ ఉంటుంది అన్నారు. దర్శకుడు చెన్నకుని శెట్టి (కుమార్) మాట్లాడుతూ.. మైథలాజికల్ సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కనున్న ఈ చిత్రంలో నూతన నటీ నటులతో పాటు పాపులర్ క్యారెక్టర్ ఆర్టిస్టులు సాంకేతిక నిపుణులు ఈ చిత్రానికి వర్క్ చెయనున్నారు. వినోదం పాటు, విస్మయానికి గురి చేసే కథాంశమిది. త్వరలోనే చిత్రీకరణను ప్రారంభించనున్నామన్నారు. భరతవర్ష క్రియేషన్స్ బ్యానర్‌లో తొలి చిత్రంగా తెరకెక్కే ఈ చిత్రం టీమ్ అందరికి మంచి పేరును తీసుకురావాలని అతిథులు, చిత్ర యూనిట్ సభ్యులు ఆకాంక్షించారు.



సప్తవాహనాలపై శేషశైలాధీశుడు

- తిరుమలలో వైభవంగా రథసప్తమి

తిరుమల, జనవరి 24 (మనం న్యూస్ బ్యూరో): ప్రత్యక్ష దైవం సూర్య నారాయణుడి జయంతి నాడు సప్త శైలాధీశుడు భక్తులకు కనువిందు చేశాడు. తిరుమలలో రథసప్తమి వేడుకలను టీటీడీ అంగరంగ వైభవంగా నిర్వహించింది. బుధవారం ఉదయం నుంచి సప్త వాహనాలపై వైకుంఠ నారాయణుడు విహరించాడు. ఒకే రోజు ఏడు వాహనాలపై శ్రీవారి విహారం కనులారా చూసి తరించడానికి భక్తులు తిరుమలకు పోటెత్తారు. సూర్య కిరణాల స్పర్శ మలయప్ప స్వామి పాదాలను తాకగానే ఉదయం సూర్య ప్రభ వాహన సేవ మొదలైంది. అనంతరం వరుసగా చిన్నశేష, గరుడ, హనుమ, కల్పవృక్ష, సర్వభూపాల వాహనాలపై శ్రీవారు తిరుమాడ వీధులలో ఊరేగుతూ భక్తులను స్వామి అనుగ్రహించారు. చంద్రోదయం అయ్యాక రాత్రి 8 గంటల సమయంలో చంద్రప్రభ వాహనంపై స్వామి ఊరేగారు. ఈ వేడుకను చూసేందుకు వేలాదిగా భక్తులు తిరుమలకు చేరుకున్నారు. ఈ వాహన సేవలతో పాటు మధ్యాహ్నం చక్రస్నానం వైభవంగా జరిగింది. శ్రీవారి పుష్కరిణిలో వేలాది భక్తులు పుణ్యస్నానమాచిరంచి తరించారు.





సీఎం కుర్చీలో బాలకృష్ణ

- అధికారులతో సమీక్ష.. మంత్రి ఉమా హాజరు

విజయవాడ, జనవరి 24: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వియ్యంకుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ మరోసారి సంచలనానికి తెరలేపారు. ఏకంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కుర్చీలో బాలకృష్ణ కూర్చుని అధికారులతో సమీక్ష నిర్వహించారు. ప్రస్తుతం చంద్రబాబు దావోస్‌లో పర్యటిస్తున్న సంగతి తెలిసిందే. బుధవారం సీఎం క్యాంపు కార్యాలయంలోకి బాలకృష్ణ వెళ్లారు. సీఎం చాంబర్‌లో ఆయన అధికార కుర్చీలో కూర్చుని లేపాక్షి పుస్తకాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సమీక్షకు బాలకృష్ణ అధ్యక్షత వహించగా మంత్రి దేవినేని ఉమా మహేశ్వరరావుతో పాటు పలువురు ఐఏఎస్ అధికారులు కూడా హాజరయ్యారు. బాలయ్య వ్యవహారం చూసి ఉన్నతాధికారులు కంగుతిన్నారు. ఏం చెప్పాలో వారికి అర్థం కాలేదు. సీఎం కుర్చీలో కూర్చున్న బాలకృష్ణను చూసి మంత్రి ఉమా కూడా ఏమి మాట్లాడలేదు.

వైభవంగా లేపాక్షి వేడుకలు: బాలకృష్ణ

గత ఏడాదికి ఏ మాత్రం తీసిపోని విధంగా ఈ ఏడాది లేపాక్షి ఉత్సవాలు వైభవంగా జరుగుతాయని నందమూరి బాలకృష్ణ అన్నారు. సీఎం జలహారతితో కార్యక్రమం ప్రారంభమవుతుందని, రెండో రోజు కార్యక్రమానికి ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు హాజరవుతారని బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఐదు జోన్లగా విభజించామని చెప్పారు. ఒక జోన్‌లో ప్రధాన వేదిక, సాంస్కృతిక కార్యక్రమాలు, సన్మానాలు వంటివి.. బజార్ జోన్‌లో వివిధ ప్రదర్శనలు, కొనుగోళ్లు, అమ్మకాలు, ఆహారపండుగలు ఉంటాయన్నారు. ప్రత్యేకంగా చిన్నారులను, మహిళలను ఉల్లాసపరిచేలా అనేక కార్యక్రమాలను ఏర్పాటు చేశామని బాలకృష్ణ తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా సినీనటి హేమమాలిని, శివమణి, తదితరులు పాల్గొంటారని పర్యాటక శాఖ కార్యదర్శి ముఖేష్ కుమార్ తెలిపారు.

3 నుంచి బౌద్ధ సాంస్కృతికోత్సవాలు

- బెజవాడలో నిర్వహణ: మంత్రి అఖిలప్రియ
- 4న వెయ్యి మంది భిక్షువులతో అఖండ స్మరణ



అమరావతి, జనవరి 24 (మనం ప్రతినిధి): విశ్వశాంతి కోసం విజయవాడలో బౌద్ధ సాంస్కృతిక ఉత్సవాలను నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు పర్యాటక శాఖ మంత్రి భూమా అఖిల ప్రియ తెలిపారు. ఫిబ్రవరి 3 నుంచి మూడు రోజులు ఈ కార్యక్రమం జరుగుతుందన్నారు. బుధవారం వెలగపూడి సచివాలయంలో మంత్రి అఖిలప్రియ, కార్యదర్శిముఖేష్‌కుమార్ మీనా, ఎండీ హిమాన్షుశుక్లాతో కలిసి మీడియా సమావేశాన్ని నిర్వహించారు. హీనయాన బౌద్ధం పుట్టినిల్లు అయిన నవ్యాంధ్ర.. బౌద్ధ సాంస్కృతిక రాజధాని అని చాటి చెప్పడమే ఈ ఉత్సవాల లక్ష్యమని మంత్రి చెప్పారు. ఈ ఉత్సవాలకు దేశ, విదేశాల నుంచి భారీగా బౌద్ధ బిక్షువులు, ప్రముఖులు తరలివస్తారని తెలిపారు. 4న వెయ్యి మంది బౌద్ధ బిక్షువులతో అఖండ నామ స్మరణ నిర్వహించనున్నామని, ఇంతటి మహత్కార్యాన్ని ప్రతిష్టాత్మకంగా చేపట్టడం ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పనున్నట్లు మంత్రి వెల్లడించారు. కొలంబో నుంచి తొలి బౌద్ధ సన్యాసిని కుసుమ కూడా ఈ సమావేశానికి వస్తున్నారని చెప్పారు. కాగా, బౌద్ధ సన్యాసులంతా అమరావతి బౌద్ధ స్తూపంతో పాటు నాగార్జునకొండ, తొట్లకొండ, అనుపు, బొజ్జనకొండ, తొట్లకొండ, బావికొండ, శాలిహుండం వంటి బౌద్ధారామాల్ని సందర్శిస్తారని, ఇది విదేశీ పర్యాటకానికి ఎంతగానో ఉపకరిస్తుందని అఖిలప్రియ అన్నారు.



పేదలకు సాయం చేశారు


- పరిటాల రవీంద్రకు సునీత నివాళి.. 13వ వర్ధంతి

చెన్నేకొత్తపల్లి, జనవరి 24 (మనం న్యూస్): పేద ప్రజలకు, బడుగు బలహీన వర్గాల కోసం పరిటాల రవీంద్ర ఊపిరి ఉన్నంత వరకూ సాయం చేశారని ఆయన భార్య, మంత్రి పరిటాల సునీత అన్నారు. మంత్రి స్వగ్రామం అనంతపురం జిల్లా రామగిరి మండలం వెంకటాపురంలో మాజీ మంత్రి పరిటాల రవీంద్ర 13వ వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళులు అర్పించారు. సునీత కుమారులు శ్రీరామ్, సిద్దార్థ్, కుమార్తె స్నేహలత, కోడలు జ్ఞాన ఇతర కుటుంబ సభ్యులు పరిటాల రవీంద్ర ఘాట్ వద్ద నివాళి అర్పించారు. వర్ధంతి సందర్భంగా టీడీపీ నాయకులు, వేలాదిమంది కార్యకర్తలు తరలి వచ్చారు. సభా వేదిక వద్ద సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

రైతు కష్టం రోడ్డుపాలు

- మరోసారి టమాటా ధర పతనం
- కిలోకు రూపాయి కూడా దక్కని వైనం
- ఖర్చులూ రాక రోడ్లపై పడేస్తున్న రైతులు
- బయట కొనాలంటే రూ.8 పెట్టాల్సిందే
- రైతు కంటనీరు పట్టించుకోని ప్రభుత్వం
- కలగా మారిన కర్నూలు 'జ్యూస్ ఫ్యాక్టరీ'
- ఏటా భారీగా నష్టపోతున్న అన్నదాతలు

పత్తికొండ, జనవరి 24 (మనం న్యూస్): అమ్మబోతే అడవి.. కొనబోతే కొరివి.. రాష్ట్రంలో టమాటా రైతుల పరిస్థితి అచ్చంగా ఇలానే ఉంది. పంట పండించే అన్నదాతకు రూపాయి కూడా దక్కడం లేదు.. అమ్మే వ్యాపారి మాత్రం బాగానే సొమ్ము చేసుకుంటున్నాడు. ఇటు రైతు.. అటు వినియోగదారుడు ఇద్దరూ మునిగిపోతున్నారు. రాష్ట్రంలో మదనపల్లె తర్వాత టమాటా ఎక్కువగా పండే చోటు కర్నూలు జిల్లాలోనే. ముఖ్యంగా జిల్లాలోని పశ్చిమ ప్రాంతమైన పత్తికొండ, ఆలూరు, నియోజకవర్గాల్లో ఈ పంటను ఎక్కువగా సాగుచేస్తున్నారు. ఈ ఏడాది జిల్లాలో సుమారు 20వేల హెక్టార్లకు పైగా టమాటా పంటను సాగు చేశారు. ఒక ఎకరాలో పంట సాగు చేసేందుకు సుమారు రూ.15వేలకు పైగా ఖర్చు చేస్తున్నారు. ఆరుగాలం కష్టం చేసి.. పంట కోతకు, రవాణాకు బోలెడు ఖర్చులు పెట్టుకుని పత్తికొండ మార్కెట్‌కు తీసుకొస్తే కనీసం గిట్టుబాటు దక్కడం లేదు. భారీగా పంట మార్కెట్‌కు వస్తే చాలు.. వ్యాపారులు ధరను ఘోరంగా తగ్గించేస్తున్నారు. బహిరంగ మార్కెట్‌లో కిలో టమాటా రూ.8 పలుకుతున్నా.. రైతు దగ్గర ఒక్క రూపాయికి కూడా కొనేందుకు వ్యాపారులు ముందురావడం లేదు. 20 కిలోల బాక్సు మార్కెట్‌కు తీసుకురావాలంటే కనీసం 15 రూపాయలు ఖర్చవుతుంది. ఇది రవాణా ఖర్చు మాత్రమే.. ఇక కూలీల సంగతి సరేసరి. మార్కెట్‌లో రైతుల నుంచి బాక్సును రూ.20కి మించి అడగడం లేదు. దీంతో అన్నదాతలు తమ శ్రమకు విలువ లేకుండా పోయిందని కంటతడి పెట్టుకుంటున్నారు. కనీసం ఖర్చులు కూడా రాకపోవడంతో రైతులు టమాటా పంటను రోడ్లపై పారబోయి నిరసన వ్యక్తం చేస్తున్నారు. మరికొంత మంది పశువులకు దాణాగా వేస్తున్నారు.





జ్యూస్ ఫ్యాక్టరీ కలేనా?!

జిల్లాలో టమాటా పంట ఎక్కువగా పండిస్తుండడంతో ఈ పత్తికొండ ప్రాంతంలో జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మిస్తే.. రైతులకు అండగా ఉంటుందని గతంలో ప్రభుత్వానికి ప్రతిపాదనలు అందాయి. దీంతో టమాటా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మించాలని రైతులు ఉద్యమాలు కూడా చేశారు. ప్రభుత్వాలు కూడా జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మిస్తామని హామీ ఇచ్చాయి. అయితే ఇప్పటి వరకు హామీ అమలుకు నోచుకోవడంలేదు. కనీసం కోల్డ్ స్టోరేజీలు అయినా నిర్మిస్తే కొద్ది రోజులైనా పంట నిల్వ ఉంటుందని భావించినా..అదీ ఆచరణకు నోచుకోలేదు. దీంతో ఏటా టమాటా రైతులు నష్టపోతున్నారు. ధర లేకుండా ఒకసారి, వ్యాపారుల మాయాజాలంతో ఒకసారి ఇలా ఏతావాతా అన్నదాతకు కడగండ్లు మిగులుతున్నాయి. పట్టించుకోవాల్సిన పాలకులు కూడా హామీలతో కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఇప్పటికైనా స్పందించి టమాటాకు గిట్టుబాటు ధర కల్పించడంతో పాటు జ్యూస్ ఫ్యాక్టరీ నిర్మించి ఆదుకోవాలని రైతు సంఘాల నాయకులు కోరుతున్నారు.

వ్యాపారుల మాయాజాలం

పత్తికొండ మార్కెట్‌కు ఆ ప్రాంతం నుంచే కాక నియోజకవర్గంలోని తుగ్గలి, మద్దికేర, దేవనకొండ ఆస్పరి, ఆలూరు తదితర ప్రాంతాల నుంచి పెద్ద మొత్తం పంట వస్తుంటుంది. అయితే పంట భారీగా వచ్చిన సారి టమాటా కొనుగోలు చేసే వ్యాపారులు కూడబలుక్కొని ధర తగ్గించేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. టమాటా ఎక్కువ రోజులు నిల్వ ఉండదన్న బలహీనతగా అడ్డుపెట్టుకుని రైతులను మోసం చేస్తున్నారు. వారి దగ్గర తక్కువ రేటుకు తీసుకుని బహిరంగ మార్కెట్‌లో అధిక ధరకు విక్రయించి సొమ్ము చేసుకుంటున్నారు. చేసేది ఏమీ లేక రైతులు వ్యాపారులు అడిగిన ధరకే అమ్మి నష్టపోతున్నారు.

'వాణిజ్య సౌలభ్యం'లో నంబర్ 1

- అందుకే ఏపీకి అధిక సంఖ్యలో కంపెనీలు
- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తేనే

తయారీ రంగంలో వృద్ధి: లోకేశ్



అమరావతి, జనవరి 24: ఆంధ్రప్రదేశ్‌లో పారిశ్రామిక రంగం వేగంగా వృద్ధి చెందుతోందని, ఇందు కోసం తమ ప్రభుత్వం అనేక నూతన విధానాలను ప్రవేశపెట్టిందని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ తెలిపారు. పరిశ్రమలు ఏర్పాటు చేసేవారికి రాయితీలు కల్పిస్తున్నామన్నారు. వేగంగా అనుమతుల మంజూరు చేస్తున్నామని, భారత్‌లో వాణిజ్య సౌలభ్యంలో ఏపీ నంబర్ 1గా నిలిచిందని చెప్పారు. అందుకే ఏపీ వైపు అధిక సంఖ్యలో పరిశ్రమలు వస్తున్నాయని లోకేశ్ చెప్పారు. దావోస్‌లో జరుగుతున్న ప్రపంచ ఆర్థిక సదస్సులో 'ఇన్వెస్ట్ ఇండియా' లాంజ్ లో తయారీ రంగం అభివృద్ధి, తీసుకోవాల్సిన చర్యలపై కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశంలో మంత్రి నారా లోకేశ్ ప్రసంగించారు. ఆంధ్రప్రదేశ్‌లో తయారీ రంగం వేగంగా దూసుకెళ్తోందన్నారు. ఇక్కడ పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న సానుకూలతల దృష్ట్యా అనేక కంపెనీలు పెట్టుబడులు పెడుతున్నాయని లోకేశ్ వెల్లడించారు. అనంతపురంలో కియా కార్ల కంపెనీ, చిత్తూరు జిల్లాలో అపోలో, హోండా, ఇసుజు లాంటి సంస్థలు తమ తయారీ యూనిట్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎలక్ట్రానిక్స్ రంగంలో రెండు మ్యానుఫాక్చరింగ్ క్లస్టర్లను ఏర్పాటు చేశామని, ఫాక్స్ కాన్, సెల్ కాన్, కార్బన్, ఎమ్ఐ లాంటి కంపెనీలు ఆంధ్రప్రదేశ్‌లో కార్యకలాపాలు ప్రారంభించాయని అన్నారు. విడిభాగాలతో పాటు సెల్‌ఫోన్ల తయారీ కూడా ఏపీలో జరుగుతోందని తెలిపారు. పారిశ్రామిక అభివృద్ధి కోసం కేంద్ర ప్రభుత్వం తీసుకుంటున్న నిర్ణయాలు మంచి ఫలితాలను ఇస్తున్నాయన్నారు. అయితే తయారీ రంగంలో భారత్ మరింత ముందుకు దూసుకెళ్లాలంటే కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేయాల్సి ఉందని లోకేశ్ అభిప్రాయపడ్డారు. క్లస్టర్ మోడళ్ల అమలుతో ఈ రంగంలో పూర్తి స్థాయి అభివృద్ధి జరుగుతుందని వివరించారు. కాగా, కేంద్ర పరిశ్రమల శాఖ అదనపు కార్యదర్శి అతుల్ చతుర్వేది మాట్లాడుతూ.. ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ఆంధ్రప్రదేశ్ విధానాలు ఇతర రాష్ట్రాలకు ఆదర్శంగా నిలుస్తున్నాయన్నారు.

యూనివర్సిటీలలో బయోమెట్రిక్

విద్యార్థులు, అధ్యాపకుల హాజరు నమోదు.. వీసీల సదస్సులో గవర్నర్ నరసింహన్



విశాఖపట్నం, జనవరి 24 (మనం న్యూస్ బ్యూరో): రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థులు, అధ్యాపకుల హాజరుకు సంబంధించి బయోమెట్రిక్ విధానాన్ని ప్రవేశపెట్టనున్నట్లు గవర్నర్, వర్సిటీల చాన్సలర్ నరసింహన్ చెప్పారు. ఆంధ్రా విశ్వవిద్యాలయం అకడమిక్ సెనేట్ హాలులో బుధవారం జరిగిన వై స్ చాన్సలర్ల సదస్సుకు ఆయన అధ్యక్షత వహించారు. ఈ సమావేశంలో రాష్ట్రంలోని 16 విశ్వవిద్యాలయాల వైస్ చాన్సలర్లతో పాటు మానవ వనరుల శాఖా మంత్రి గంటా శ్రీనివాసరావు, విద్యాశాఖ ప్రిన్సిపల్ కార్యదర్శి ఆదిత్యనాథ్ దాస్, ఉన్నత విద్యామండలి చైర్మన్ విజయానంద్, వైస్ చైర్మన్ వల్లీకుమారి తదితరులు పాల్గొన్నారు. వర్సిటీల్లో ర్యాంగింగ్‌ను పూర్తిగా అరికట్టేందుకు చర్యలు తీసుకొవాలని గవర్నర్ స్పష్టం చేశారు. ఉన్నత విద్యారంగంలో విశ్వవిద్యాలయాల విజన్, ర్యాంకులు మెరుగుపర్చుకోవడానికి అనుసరిస్తున్న విధానాలు, అనుబంధ కళాశాలల పనితీరు, స్కిల్ డెవలప్‌మెంట్-ప్లేస్‌మెంట్ విధానాలు వంటి అంశాలపై ఈ సమావేశంలో చర్చ జరిగింది. ఇటీవల ప్రకటించిన సహాయ ఆచార్యుల ఉద్యోగాల భర్తీ ప్రక్రియలో అనుసరించాల్సిన పారదర్శక విధానం, ఇందుకోసం ఏపీపీఎస్‌సీ పరీక్షా నిర్వహణ సన్నాహాలు వంటి వాటిపై చర్చించారు. అన్ని వర్సిటీల్లో ప్రవేశాలకు కామన్‌గా ఒకే సెట్ పరీక్షలను ఆన్‌లైన్‌లో నిర్వహించే విధానంపై గవర్నర్ సూచనలు చేశారు. పలుచోట్ల వివాదాస్పదంగా మారిన ఎంఫిల్, పీహెచ్‌డీ అడ్మిషన్ల ప్రక్రియలో మార్పులపై సుదీర్ఘంగా చర్చ జరిగింది. నైపుణ్యం పెంచేలా డిగ్రీ స్థాయిలో వృత్తి విద్యా కోర్సులను ప్రవేశపెట్టనున్నట్లు గవర్నర్ చెప్పారు. రాష్ట్రంలోని అన్ని విశ్వవిద్యాలయాలు యూజీసీ నిబంధనలను తప్పకుండా అనుసరించాలని ఆయన స్పష్టం చేశారు. కేంద్ర సాహిత్య అకాడమీ అవార్డులు పొందిన సీనియర్ పాత్రికేయులు దేవీప్రియ, అనువాదకులు డాక్టర్ వెన్న వల్లభరావులను గవర్నర్ సన్మానించారు. తొలుత గవర్నర్ విశాఖ పట్టణాభివృద్ధి సంస్థ (వుడా) కార్యాలయంలో జిమ్‌ను ప్రారంభించారు.



తెనాలిలో తెలుగు సాహిత్య మహోత్సవం

- రేపటి నుంచి మూడు రోజులు నిర్వహణ

విజయవాడ, జనవరి 24 (మనం ప్రతినిధి): తెలుగు భాషా వైభవాన్ని చాటేందుకు తెనాలి వేదికగా 'తెలుగు సాహిత్య మహోత్సవం' నిర్వహించనున్నట్లు ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. ఈ నెల 26 నుంచి మూడు రోజుల పాటు వేడుకగా సాహిత్య సమ్మేళనాలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. బుధవారం విజయవాడ ఆయన మీడియాతో మాట్లాడారు. తెనాలి శాసన సభ్యుడు ఆలపాటి రాజేంద్రప్రసాద్ పర్యవేక్షణలో తెనాలి రామకృష్ణ కళాక్షేత్రంలోని బొల్లిముంత శివరామకృష్ణ సాహితీ ప్రాంగణంలో ఈ కార్యక్రమం జరుగుతుందని బుద్ధప్రసాద్ తెలిపారు. అనంతరం ఎమ్మెల్యే రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ.. ఈ మహోత్సవంలో తెలుగు భాషలోని అన్ని సాహిత్య ప్రక్రియలు ప్రదర్శిస్తామని చెప్పారు.

ఆరోగ్యశ్రీతో ఎక్కడైనా వైద్యం



- హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో కూడా
- బిల్లు 1000 దాటితే డబ్బులు చెల్లిస్తాం
- ప్రజా సంకల్పయాత్రలో జగన్ హామీ

నాయుడుపేట, జనవరి 24 (మనం న్యూస్): ఆరోగ్యశ్రీ పథకం కింద హైదరాబాద్, చెన్నై, బెంగళూరులో ఎక్కడ వైద్యం చేయించుకున్నా ఇబ్బంది లేదని, బిల్లు 1000 దాటిన ఏ ఆపరేషన్‌కు అయినా డబ్బులు చెల్లిస్తామని, వైసీపీ అధికారంలోకి రాగానే దీన్ని అమలు చేస్తామని వైసీపీ అధ్యక్షుడు, ప్రతిపక్ష నేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి హామీ ఇచ్చారు. ఆపరేషన్ సమయంలో కుటుంబానికి డబ్బులిచ్చి ఆదుకుంటామని, దీర్ఘకాలిక వ్యాధి బాధితులకు రూ.10 వేల పెన్షన్ అందజేస్తామని చెప్పారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఆరోగ్యశ్రీని నిర్వీర్యం చేశారని విమర్శించారు. ప్రజా సంకల్పయాత్రలో భాగంగా 70వ రోజు బుధవారం నెల్లూరు జిల్లా సుళ్లూరుపేట నియోజకవర్గం నాయుడుపేటలో జరిగిన బహిరంగ సభలో జగన్ ప్రసంగించారు. రాష్ట్రంలో ఎంతో మంది పేదలు అనారోగ్యానికి గురై కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం చేయించుకునే స్థోమత లేక తనువు చాలిస్తున్నారన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న పిల్లలు రోగాల బారిన పడితే తల్లిదండ్రులు వైద్యం చేయించలేక ఎన్నో ఇబ్బందులు పడుతున్నారన్నారు. కార్పొరేట్ ఆసుపత్రులకు వెళితే.. ఆరోగ్యశ్రీకి బిల్లులు రావడం లేదని వైద్యం అందించడం లేదని, డబ్బు కడితే వైద్యం చేస్తామని ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు. కిడ్నీ, క్యాన్సర్ తదితర వ్యాధులతో బాధపడుతూ, డబ్బులు లేకపోవడంతో వైద్యం చేయించుకోలేక ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు. వైసీపీ అధికారంలోకి రాగానే ఆరోగ్యశ్రీ పథకాన్ని విస్తృతం చేస్తామని తెలిపారు. ప్రతి పేదవాడు అప్పులు చేయకుండా వైద్యం చేయించుకోవడమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తుందని జగన్ ప్రకటించారు.



జలాధివాసం వీడుతున్న సంగమేశ్వరుడు


- నాలుగు అడుగుల మేర గోపుర దర్శనం

కొత్తపల్లె, జనవరి 24 (మనం న్యూస్): భారీ వర్షాలకు కృష్ణా నది పరవళ్లు తొక్కడం, శ్రీశైలం ప్రాజెక్టు నిండటంతో పూర్తిగా మునిగిపోయిన సంగమేశ్వరుడి ఆలయం.. జలాధివాసం నుంచి క్రమంగా బయటపడుతోంది. శ్రీశైలం ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 885 అడుగులు కాగా బుధవారం నాటికి 862 అడుగులకు తగ్గింది. దీంతో సంగమేశ్వరుడి ఆలయం పైభాగం (గోపురం) నాలుగు అడుగుల మేర దర్శనమిస్తుంది. గత అక్టోబర్‌లో కురిసిన భారీ వర్షాలకు శ్రీశైలం డ్యామ్ పూర్తిగా నిండిన సంగతి తెలిసిందే. కర్నూలు జిల్లాలో సప్తనదుల జలాల సంగమంలో కృష్ణమ్మ ఒడిలో వెలసిన సంగమేశ్వరుడి ఆలయం.. బ్యాక్ వాటర్ వల్ల పూర్తిగా మునిగిపోయింది. శ్రీశైలం ప్రాజెక్టులో నీటి మట్టం 830 అడుగులకు తగ్గితే.. జలాధివాసం నుంచి ఆలయం పూర్తిగా బయటపడుతుంది. పదేళ్లుగా శివరాత్రి నాటికి ఆలయం పూర్తిగా బయటపడటంతో భక్తులకు దర్శన భాగ్యం కలిగింది. ఈసారి ఆలయం పూర్తిగా బయటపడుతుందా? లేదా? అని భక్తులు సందిగ్ధంలో ఉన్నారు.

సెన్సెక్స్
జనవరి 24 2018

36,161.64

▲21.66




పెరిగినవి	%	తగ్గినవి	%
ఎస్‌బిఐ	3.62	భారతీ ఎయిర్‌టెల్	-6.51
అదాని పోర్ట్స్	2.46	టాటా మోటార్స్	3.46
టీసీఎస్	2.30	ఐసిఐసిఐ బ్యాంక్	-2.60
ఐటీసీ	1.88	టాటా స్టీల్	-2.13
యస్ బ్యాంక్	1.66	యాక్సిస్ బ్యాంక్	-1.78

నిఫ్టీ
జనవరి 24 2018

11086.00

▲2.30



పెరిగినవి	%	తగ్గినవి	%
ఎస్‌బిఐ	3.71	భారతీ ఎయిర్‌టెల్	-6.62
గెయిల్	3.01	ఐడియా సెల్యులార్	-5.49
టెక్ మహీంద్రా	2.53	టాటా మోటార్స్	-3.44
అదాని పోర్ట్స్	2.36	ఐసిఐసిఐ బ్యాంక్	-2.64
టీసీఎస్	2.34	ఐషర్	-2.46

టాప్ గైనర్లు
24 జనవరి

36,161.64

బీఎస్ఈ సెన్సెక్స్

▲21.66

		%
329.50	ఎస్‌బిఐ	3.62%
448.20	అదాని పోర్ట్స్	2.46%
3174.60	టీసీఎస్	2.30%
281.50	ఐటీసీ	1.88%
364.80	యస్ బ్యాంక్	1.66%
210.50	ఓఎన్‌జీసీ	1.62%
2561.85	డాక్టర్ రెడ్డీస్	1.56%
1907.95	హెచ్‌డీఎఫ్‌సీ	1.39%
586.10	సన్ ఫార్మా	1.38%
3335.60	బజాజ్ ఆటో	1.25%



త్వరలో కొత్త నిబంధనలు

హైదరాబాద్: బీమా రంగానికి సంబంధించి నూతన బ్రోకర్ నిబంధనలు ఇప్పటి నుంచి ఏ సమయంలోనైనా వెలువడవచ్చని భారత బీమా నియంత్రణ, అభివృద్ధి సంస్థ (ఐ.ఆర్.డి.ఏ.ఐ) చైర్మన్ టి.ఎస్. విజయన్ చెప్పారు. ''వాటిని మేం గెజిట్ నోటిఫికేషన్‌కు పంపాం'' అని ఆయన తెలిపారు. ఇక్కడ బుధవారం నిర్వహించిన బీమా బ్రోకర్ల 14వ వార్షిక సమావేశంలో ఆయన ప్రసంగించారు. బీమా పరిశ్రమ చురుకుగా, సజీవంగా ఉందని, వివిధ విభాగాల్లో అది రెండంకెలలో వృద్ధిని సాధిస్తోందని చెప్పారు. బీమా మార్కెట్‌లో అనేక రకాల లావాదేవీలలో బ్రోకర్ పాత్ర పెరుగుతోందని ఇన్స్యూరెన్స్ బ్రోకర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (ఐ.బి.ఏ.ఐ) అధ్యక్షుడు సంజయ్ కేడియా అన్నారు. క్లెమ్ పంపిణీలో టెక్నాలజీ, డాటా ఎనలిటిక్స్ (నేడు భారతదేశంలో లేవు) రానున్న రోజుల్లో పరిస్థితిలో చాలా మార్పు తీసుకు వస్తాయని ఆయన చెప్పారు. ప్రస్తుతం పరిశ్రమలో 428 మంది బ్రోకర్లు ఉన్నారని, ఇన్స్యూరెన్స్ బ్రోకింగ్‌కు డిమాండ్ పెరుగుతోందని ఆయన చెప్పారు. జీవితేతర బీమా ప్రీమియం 2016-17లో రూ. 1.28 లక్షల కోట్లుగా ఉందని, దీనిలో రూ. 30,000 కోట్లు బ్రోకర్లు తీసుకువచ్చినవేనని ఆయన తెలిపారు.

లేనేలేవ్ పట్టపగ్గాల్

రికార్డు స్థాయిలో దూసుకుపోతున్న సెన్సెక్స్, నిఫ్టీ



ముంబయి: జనవరి డెరివేటివ్‌ల గడువు గురువారం ముగియనుండడంతో స్పెక్యులేటర్లు పెండింగ్‌లో ఉంచిన షార్ట్ పొజిషన్ల కవరింగుకు పాల్పడడంతో 'సెన్సెక్స్', 'నిఫ్టీ'లు బుధవారం గరిష్ఠ స్థాయిల్లో ముగిసి రికార్డు సృష్టించాయి. ఎనర్జీ, మెటీరియల్స్ రంగాల్లో షేర్ల ధరలు క్షీణించినప్పటికీ, బ్యాంకింగ్, ఐ.టి. రంగాలు గడించిన లాభాలతో స్టాక్ మార్కెట్ల సూచీలు పైపైకి ఎగబాకాయి. బ్యాంకుల పునర్ మూలధనీకరణ పథకం వివరాలను భారత్ త్వరలోనే వెల్లడిస్తుందని ప్రభుత్వ అధికార ప్రతినిధి ఒకరు ట్విట్టర్‌లో పేర్కొన్న తర్వాత ప్రభుత్వ రంగ బ్యాంకుల షేర్ల ధరలు పెరిగాయి. బొంబాయి స్టాక్ ఎక్స్చేంజ్ (బి.ఎస్.ఇ) 30 షేర్ల 'సెన్సెక్స్' బుధవారం 21.66 పాయింట్లు లాభపడి 36,161.64 పాయింట్ల వద్ద ముగిసింది. నేషనల్ స్టాక్ ఎక్స్చేంజ్ (ఎన్.ఎస్.ఇ) 50 షేర్ల సూచి 'నిఫ్టీ' 2.3 పాయింట్లు లాభ పడి 11,086 పాయింట్ల వద్ద ముగిసింది. రెండు సూచీలు వరుసగా ఆరవ సెషన్‌లో రికార్డులు నెలకొల్పుతూ గరిష్ఠ స్థాయిల్లో ముగిసాయి. ఇంట్రా-డేలో 'సెన్సెక్స్' ఆల్-టైమ్ అధిక స్థాయి 36,268.19 పాయింట్లను తాకగా, 'నిఫ్టీ' 11,110.10 పాయింట్ల స్థాయిని చూసింది. బి.ఎస్.ఇ.లో ఐ.టి, పి.ఎస్.యు, ఎఫ్.ఎం.సి.జి, టెక్ రంగాల సూచీలు లాభపడ్డాయి. కన్స్యూమర్ డ్యూరబుల్స్, మెటల్, క్యాపిటల్ గూడ్స్ రంగాల సూచీలు క్షీణించాయి. ''వృద్ధిని సాధిస్తున్న రంగాల్లో లావాదేవీల విలువ హెచ్చుగా ఉంది. ఐ.టి., ఫార్మా వంటి నష్టపోవడానికి ఎక్కువ అవకాశం లేని రంగాలపై ఎక్కువ మంది దృష్టి కేంద్రీకరించారు. త్రైమాసిక ఫలితాలలో కొంత స్థిరత్వాన్ని చూసిన తర్వాత, మదుపరులు ఐ.టి. వైపు మరలుతున్నారు'' అని జియోజీత్ ఫైనాన్షియల్ సర్వీసెస్ పరిశోధన విభాగాధిపతి వినోద్ నాయర్ చెప్పారు. గడచిన పది రోజులుగా ట్రేడింగ్ చాలా సానుకూలంగా ఉన్నందు వల్ల బడ్జెట్‌కు కొద్ది ముందు కొంత ప్రాఫిట్ బుకింగ్ చోటుచేసుకునే అవకాశం ఉందని వినోద్ అన్నారు. 'నిఫ్టీ'లో ఫార్మా సూచి వరుసగా నాల్గవ సెషన్‌లోనూ లాభపడింది. పెద్ద ప్రత్యర్థి భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ సవరించిన డాటా ప్లాన్‌లను ఎదుర్కొనేందుకు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ టారిఫ్‌లకు కోత పెట్టడంతో టెలికాం సర్వీసులు సమకూర్చే సంస్థల షేర్ల ధరలు కూడా తగ్గాయి.

కెనరాకు తగ్గిన లాభాలు

బెంగళూరు: నిరర్థక ఆస్తులకు హెచ్చు మొత్తాలను పక్కనపెట్టవలసి రావడం వల్ల 2017 డిసెంబర్‌తో ముగిసిన త్రైమాసికంలో కెనరా బ్యాంక్ లిమిటెడ్ 61 శాతం తక్కువగా రూ. 126 కోట్ల నికర లాభాన్ని మాత్రమే చూపగలిగింది. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో అది రూ. 322 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగలిగింది. ట్రెజరీ బాండ్లపై రూ. 74 కోట్లు పెట్టవలసి రావడంతో లాభాలపై ప్రభావం పడిందని కెనరా బ్యాంక్ మేనేజింగ్ డైరెక్టర్, సి.ఇ.ఓ. రాకేశ్ శర్మ చెప్పారు. 2017 సెప్టెంబర్ త్రైమాసికంలో 10.51 శాతంగా ఉన్న స్థూల ఎన్.పి.ఏ. నిష్పత్తి డిసెంబర్ త్రైమాసికానికి 10.38 శాతానికి తగ్గడం బ్యాంక్‌కి కాస్త ఊరట కలిగించింది.

నిధుల సమీకరణలో ఓ.ఎన్.జి.సి



న్యూఢిల్లీ: హిందూస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్.పి.సి.ఎల్)ను స్వాధీనం చేసుకునేందుకు అవసరమైన నిధులను సమకూర్చుకోవడంలో భాగంగా చమురు, సహజ వాయు సంస్థ (ఓ.ఎన్.జి.సి) ఐ.సి.ఐ.సి.ఐ. బ్యాంక్ నుంచి రూ. 4,000 కోట్లు అప్పు తీసుకుంది. ఇదే పనిపై అది మూడు ఇతర బ్యాంకుల నుంచి రూ. 18,000 కోట్ల రుణం తీసుకుంది. హెచ్.పి.సి.ఎల్.ను అది రూ. 36,915 కోట్లు పెట్టి స్వాధీనం చేసుకుంటోంది. హెచ్.పి.సి.ఎల్.లో ప్రభుత్వానికున్న 51.11 శాతం వాటాను ఓ.ఎన్.జి.సి. కొనుగోలు చేస్తోంది. ఈ స్వాధీనానికి అవసరమైన రూ. 18,060 కోట్ల అప్పును సమీకరించుకునేందుకు పంజాబ్ నేషనల్ బ్యాంక్, బ్యాంక్ ఆఫ్ ఇండియా, యాక్సిస్ బ్యాంక్ లిమిటెడ్‌లతో రుణ ఒప్పందాలు కుదుర్చుకున్నట్లు ఓ.ఎన్.జి.సి. మంగళవారం ప్రకటించింది. పి.ఎన్.బి (రూ. 10,600 కోట్లు), బ్యాంక్ ఆఫ్ ఇండియా (రూ. 4,460 కోట్లు), యాక్సిస్ బ్యాంక్ (రూ. 3,000 కోట్లు)లతో అది రుణ ఒప్పందాలు కుదుర్చుకుంది. ఈ నెలాఖరులోగా ప్రభుత్వానికి రూ. 36,915 కోట్లు చెల్లించేందుకు కంపెనీ మరికొన్ని రుణ ఒప్పందాలపై సంతకాలు చేసే అవకాశం ఉంది. ఈ స్వాధీనంతో ఓ.ఎన్.జి.సి. భారతదేశపు మొట్టమొదటి సమీకృత ఆయిల్ కంపెనీగా అవతరిస్తుంది. ఇది ఓ.ఎన్.జి.సి.కి పెద్ద స్వాధీనం అవుతుంది. అది ఇంతకుముందు గుజరాత్ స్టేట్ పెట్రోలియం కార్పొరేషన్‌కు చెందిన కృష్ణా గోదావరి బేసిన్ గ్యాస్ బ్లాక్‌లో 80 శాతం వాటాను రూ. 7,738 కోట్లకు ఈ ఆర్థిక సంవత్సరంలోనే స్వాధీనం చేసుకుంది. రుణ పరిమితిని రూ. 25,000 కోట్ల నుంచి రూ. 35,000 కోట్లకు పెంచే ప్రతిపాదనకు కంపెనీ డైరెక్టర్ల బోర్డు ఆమోదం తెలిపిందని ఓ.ఎన్.జి.సి. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శశి శంకర్ ఆదివారం ప్రకటించారు. ఓ.ఎన్.జి.సి. అప్పు చేయడం ఇదే మొదటిసారి. ''మేం మా (రూ. 12000 కోట్ల నుంచి -రూ. 13,000 కోట్ల) నగదును మొదట ఉపయోగిస్తాం. తర్వాత లిక్విడ్ ఎసెట్లు. చివరకు రుణ మొత్తాన్ని వినియోగిస్తాం'' అని శంకర్ చెప్పారు. ''ఈ వరుస క్రమంలో మార్పు ఉండవచ్చు. ఎందుకంటే, మేం మా లిక్విడ్ ఎసెట్లను దయనీయ స్థితిలో ఉండగా అమ్మలేం. పైగా, చాలా తక్కువ వడ్డీ రేట్లకు దేశ, విదేశీ కరెన్సీలలో రూ. 50,000 కోట్లకు పైగా అప్పు ఇవ్వడానికి కొందరు సిద్ధంగా ఉన్నారు'' అని ఆయన చెప్పారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్‌లో ఓ.ఎన్.జి.సి.కి 13.77 శాతం వాటా ఉంది. అది రూ. 26,000 కోట్లకు పైగా విలువ చేస్తుంది. గెయిల్ ఇండియా లిమిటెడ్‌లో దానికి రూ. 3,800 కోట్లు విలువ చేసే 4.86 శాతం వాటా ఉంది. హెచ్.పి.సి.ఎల్.లో 51.11 శాతం వాటాను షేర్‌కు రూ. 473.97 చొప్పున చెల్లించి కొనుగోలు చేయనున్నట్లు ఓ.ఎన్.జి.సి. జనవరి 20న ప్రకటించింది. ఈనెలాఖరునాటికి ఈ వ్యవహారం ముగియనుంది.

మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో
టి.సి.ఎస్. ముందంజ

న్యూఢిల్లీ: టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్ (టి.సి.ఎస్) మార్కెట్ విలువ బుధవారం రూ. 6 లక్షల కోట్లను దాటింది. రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్ తర్వాత, ఆ రకమైన మైలురాయి సాధించిన రెండవ కంపెనీగా అవతరించింది. టి.సి.ఎస్. మార్కెట్ క్యాపిటలైజేషన్ బుధవారం మధ్యాహ్నం రూ. 6,12,696.46 కోట్లుగా నిలిచింది. మార్కెట్ మూల్యాంకనం విషయంలో అత్యంత విలువైన సంస్థగా అది ఆర్.ఐ.ఎల్.ను కూడా అధిగమించింది. టి.సి.ఎస్. షేర్ ధర 4.88 శాతం పెరిగి బి.ఎస్.ఇ.లో (52 వారాల గరిష్ఠ స్థాయిలో) రూ. 3,254.80 వద్ద ట్రేడయింది. ఆర్.ఐ.ఎల్. షేర్ ధర 1.89 శాతం క్షీణించి, రూ. 963.10 వద్ద ట్రేడయింది. దాని మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ. 6,11,096.56 కోట్లుగా నమోదైంది. మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో ఐదు అగ్ర స్థానాలలో టి.సి.ఎస్, ఆర్.ఐ.ఎల్, హెచ్.డి.ఎఫ్.సి. బ్యాంక్ (రూ. 5,08,576.16 కోట్లు), ఐ.టి.సి. (రూ. 3,41,332.79 కోట్లు), హెచ్.డి.ఎఫ్.సి. (రూ. 3,03,382.63 కోట్లు) ఉన్నాయి.

టెలికాం షేర్లకు టారిఫ్‌ల దెబ్బ

ముంబయి: ప్రధాన ప్రత్యర్థి భారతీ ఎయిర్‌టెల్ లిమిటెడ్ డాటా ప్లాన్‌లను సవరించడంతో, దాన్ని ఎదుర్కొనేందుకు రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ లిమిటెడ్ కూడా టారిఫ్‌లతో కోత పెట్టుకోవడంతో బుధవారం స్టాక్ మార్కెట్లలో టెలికాం సర్వీసు సంస్థల షేర్ల ధరలు తగ్గాయి. వివిధ ప్లాన్‌ల టారిఫ్‌లలో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రూ. 50 చొప్పున తగ్గింపును ప్రకటించింది. పోటీ సంస్థలు ఇస్తున్నదానికన్నా 50 శాతం ఎక్కువ డాటా ఇవ్వజూపింది. జియో రూ. 98కే ఒక కొత్త ప్యాక్ ప్రవేశపెట్టింది. అది ఉచిత వాయిస్ కాల్స్, అపరిమిత డాటా (నెలకు 2జి.బి) 28 రోజులకు ఇవ్వజూపుతోంది. భారతదేశపు నంబర్ వన్ టెలికాం సంస్థ భారతీ ఎయిర్‌టెల్ ఈ వారం మొదట్లో డాటా ప్లాన్‌లు సవరించింది. అది ఇటీవల 84 రోజుల వ్యాలిడిటీతో, రోజుకు 1జి.బి. 4జి డాటాతో రూ. 399కి ఒక ప్లాన్ ప్రవేశపెట్టింది. ఎయిర్‌టెల్ షేర్ ధర బుధవారం 6.22 శాతం క్షీణించి ఒక దశలో రూ. 461.5 వద్ద ట్రేడయింది. 2017 అక్టోబర్ 18 తర్వాత దానికిదే కనిష్ఠ స్థాయి. అప్పుల ఊబిలో కూరుకుపోయిన రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ షేర్ ధర దాదాపు 2.2 శాతం క్షీణించింది. భారతదేశపు మూడవ పెద్ద టెలికాం సంస్థ ఐడియా సెల్యులార్ షేర్ ధర దాదాపు 5.7 శాతం క్షీణించింది.

ఫైజర్‌కి పెరిగిన లాభం

న్యూఢిల్లీ: ఔషధాల తయారీ సంస్థ ఫైజర్ ప్రధానంగా ఖర్చులు తగ్గించుకోవడం వల్ల 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 87.24 కోట్ల నికర లాభాన్ని నమోదు చేయగలిగింది. గత ఆర్థిక సంవత్సరం అదే త్రైమాసికంలో కంపెనీ రూ. 62.37 కోట్ల నికర లాభాన్ని కనబరచింది. ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3 నికర లాభాల్లో అది 39.87 శాతం పెరుగుదలను సాధించినట్లు లెక్క. గత ఆర్థిక సంవత్సరం క్యూ 3లో రూ. 510.2 కోట్లుగా ఉన్న కంపెనీ రాబడి ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో రూ. 456.5 కోట్లుగా నమోదైంది. కంపెనీ 2017 డిసెంబర్ 31తో ముగిసిన మొదటి తొమ్మిది నెలల్లో (ఇతర సమగ్ర ఆదాయంతో కలుపుకొని) పన్నుల అనంతరం నికర లాభం రూ. 254.9 కోట్లుగా ఉంది. గత ఆర్థిక సంవత్సరం మొదటి తొమ్మిది నెలల్లో అది రూ. 267.6 కోట్లుగా ఉంది. ఫైజర్ షేర్ బి.ఎస్.ఇ.లో బుధవారం రూ. 2,201.55 వద్ద ట్రేడయింది.

ఐదోసారీ ఐడియాకు నష్టాలే

న్యూఢిల్లీ: ఐడియా సెల్యులర్ లిమిటెడ్ 2017 డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో రూ. 1285 కోట్ల నష్టాన్ని నమోదు చేసింది. ఇంతపెద్దయెత్తున నష్టాన్ని అది ఇంతవరకు మరి ఏ త్రైమాసికంలోనూ నమోదు చేయలేదు. విశ్లేషకులు ఊహించినదానికన్నా కూడా అది ఎక్కువ నష్టాలను మూటగట్టుకుంది. ప్రత్యర్థి సంస్థల నుంచి గడించుకునే ఇంటర్‌కనెక్షన్ ఫీజులలో తీవ్ర కోతతో ఐడియా రాబడి తరిగిపోయిందని భావిస్తున్నారు. ఒక నెట్‌వర్క్ నుంచి మరో నెట్‌వర్క్‌కు వెళ్ళే కాల్స్‌కు టెలికాం సంస్థలుపరస్పరం ఇంటర్‌కనెక్ట్ వినియోగ చార్జీలు చెల్లించుకుంటాయి. ఈ చార్జీలను 'ట్రాయ్' 2017 అక్టోబర్ 1 నుంచి సగానికి పైగా తగ్గించింది. దీనితో ఈ ఆర్థిక సంవత్సరం క్యూ 3లో ఐడియా రాబడిలో సుమారు రూ. 820 కోట్ల వెలితి ఏర్పడింది. దీనితో వరుసగా ఐదవ త్రైమాసికంలో ఐడియా నష్టాలను ప్రకటించినట్లు అయింది.

అశోక్ లేలాండ్‌కు భారీ ఆర్డరు



న్యూఢిల్లీ: వి.ఆర్.ఎల్. లాజిస్టిక్స్ లిమిటెడ్ (వి.ఆర్.ఎల్) నుంచి 1200 ట్రక్కులకు రూ. 350 కోట్ల విలువైన ఆర్డరు లభించినట్లు హిందూజా గ్రూప్‌కు చెందిన అగ్ర కంపెనీ అశోక్ లేలాండ్ వెల్లడించింది. తాజా ఫీచర్లు, టెక్నాలజీని పొందుపరచి ఆ ట్రక్కులను అందించనున్నట్లు తెలిపింది. దీనివల్ల వి.ఆర్.ఎల్.కు మెయింటినెన్స్ సమయం తగ్గుతుంది. ట్రక్కును ఎక్కువచోట్ల ఆపనవసరం లేదు. మెరుగైన సామర్థ్యం ప్రయాణ కాలాన్ని మెరుగుపరుస్తుంది. లాభదాయకతను పెంచుతుందని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ''వి.ఆర్.ఎల్. మాకు కస్టమరు మాత్రమే కాదు. వివిధ కస్టమర్లకు సరిపోయే కొత్త ఉత్పత్తులను అభివృద్ధిపరచడంలో చాలా కాలంగా మాతో సన్నిహితంగా కలసి పనిచేస్తూ వస్తోంది'' అని అశోక్ లేలాండ్ మేనేజింగ్ డైరెక్టర్ దాసరి వినోద్ అన్నారు. ఈ 1200 ట్రక్కులను 600 యూనిట్ల చొప్పున రెండు మోడళ్ళలో అశోక్ లేలాండ్ అందించనుంది. ఇతర వాణిజ్య వాహనాల తయారీ సంస్థలతో కూడా తమ కంపెనీకి అనుబంధం ఉన్నప్పటికీ, ఇప్పుడున్న వాహనాలలో 80 శాతం వాహనాలను అశోక్ లేలాండ్ నుంచే కొనుగోలు చేశామని వి.ఆర్.ఎల్. చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ విజయ్ సంకేశ్వర్ చెప్పారు.

విజయాకు తగ్గిన నికర లాభం

న్యూఢిల్లీ: ప్రభుత్వ యాజమాన్యంలోని విజయా బ్యాంక్ వివిధ అంశాలకు కేటాయించిన మొత్తాలు పెరగడంతో 2017 డిసెంబర్ 31తో ముగిసిన త్రైమాసికంలో 65.45 శాతం క్షీణతతో రూ. 79.56 కోట్ల నికర లాభాన్ని మాత్రమే చూపగలిగింది. బ్యాంక్ 2016-17 ఆర్థిక సంవత్సరంలో అక్టోబర్-డిసెంబర్ త్రైమాసికంలో రూ. 230.28 కోట్ల నికర లాభాన్ని నమోదు చేసింది. గత ఆర్థిక సంవత్సర క్యూ 3లో రూ. 3,,714.37 కోట్ల మేరకు ఉన్న మొత్తం ఆదాయం ఈ ఆర్థిక సంవత్సర క్యూ 3లో రూ. 3,450.81 కోట్లకు తగ్గింది. పన్నులు, అత్యవసరాలకు కాకుండా ఇతర వాటికి విజయా బ్యాంక్ కేటాయించిన మొత్తం గత సంవత్సర క్యూ 3 నాటి రూ. 416.95 కోట్ల నుంచి రూ. 676.92 కోట్లకు పెరిగింది. బ్యాంకు స్థూల నిరర్థక ఆస్తులు (ఎన్.పి.ఏ) మాత్రం గత ఆర్థిక సంవత్సర క్యూ3లో ఉన్న 6.98 శాతం నుంచి ఈ క్యూ3లో 6.17 శాతానికి స్వల్పంగా మెరుగుపడ్డాయి. నికర ఎన్.పి.ఏ.లు కూడా ఏడాది క్రితం నాటి 4.74 నుంచి ఈ క్యూ 3లో 3.99 శాతానికి తగ్గాయి. విజయా బ్యాంక్ షేర్ బి.ఎస్.ఇ.లో రూ. 68.45 వద్ద ట్రేడయింది.

సబ్సిడీ బిల్లు
ఎక్కువ పెరగకపోవచ్చు

న్యూఢిల్లీ: ఆహార సబ్సిడీ చెల్లింపులలో స్వల్ప పెరుగుదలను మాత్రమే ఊహిస్తున్నందున 2018-19 ఆర్థిక సంవత్సరంలో కేంద్ర సబ్సిడీ బిల్లు పెద్దగా పెరగకపోవచ్చు. అది 2017-18 సంవత్సరంలో ఉన్న విధంగానే రూ. 2.4 లక్షల కోట్ల స్థాయి వద్దనే ఉండవచ్చు లేదా 10-15 శాతం పెరుగుదలను చూడవచ్చని అభిజ్ఞ వర్గాలవారు తెలిపారు. ఆహార సబ్సిడీ బిల్లుకు సుమారు 15 శాతం ఎక్కువ కేటాయింపు వల్ల అది పెరిగే అవకాశం ఉంది. ప్రస్తుతం ఇది రూ. 1.45 లక్షల కోట్లుగా ఉంది. ''కొన్ని పంటలకు కనీస మద్దతు ధర పెంచవచ్చు. అది బిల్లులో ప్రతిబింబించే అవకాశం ఉంది'' అని అధికార వర్గాలవారు తెలిపారు. నగదు బదలీ లేదా ప్రత్యక్ష లబ్ధి బదలీ (డి.బి.టి) పథకం ద్వారా మెరుగైన కవరేజీకి ప్రయత్నాలు చేస్తున్నందు వల్ల ఇంధన, ఎరువుల సబ్సిడీ ఎక్కువగా పెరగకపోవచ్చని భావిస్తున్నారు. ''ఎరువులలో డి.బి.టి. ఈ మార్చి అంతానికి దేశంలోని అన్ని జిల్లాలలోను అమలులోకి వస్తుందని భావిస్తున్నారు. అది లీకేజీలను నివారించి, కొంత మొత్తాలు పొదుపు అయ్యేట్లు చూడవచ్చు'' అని మరో అధికారి చెప్పారు. ప్రత్యామ్నాయ ఇంధనాల వాడకాన్ని ప్రోత్సహించడం ద్వారా కిరసనాయిలు వినియోగాన్ని నిలిపివేసేందుకు కూడా ప్రయతానలు సాగుతున్నాయని ఆయన చెప్పారు. ఎరువుల సబ్సిడీ 2017-18 సంవత్సరంలో రూ. 70,000 కోట్ల మేరకు, పెట్రోలియం సబ్సిడీ రూ. 25,000 కోట్ల మేరకు ఉండగలదని అంచనా వేశారు.



దడ పుట్టిస్తున్న ముడి చమురు ధరలు

పెరుగుతున్న ముడి చమురు ధరలు గుబులు రేపుతున్నప్పటికీ, సబ్సిడీ చెల్లింపులను అదుపులో ఉంచుకోగలనని ప్రభుత్వం ఆశాభావంతో ఉంది. బడ్జెట్ లెక్కలు తుది రూపు సంతరించుకుంటున్నందు వల్ల తుది నిర్ణయం రానున్న కొద్ది రోజుల్లో వెలువడవచ్చు. ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ 2018-19 కేంద్ర బడ్జెట్‌ను ఫిబ్రవరి 1న సమర్పించనున్నారు. సబ్సిడీ ఖర్చు స్వల్పంగా పెరిగితే కోశాగారంపై ఒత్తిడి ఉండదు. ముడి చమురు ధరలు పెరుగుతూండడాన్ని ప్రభుత్వం నిశితంగా గమనిస్తోంది. ఎందుకంటే, 2018-19లో పన్ను రాబడులు కూడా అస్థిరంగానే ఉండవచ్చని భావిస్తోంది. పైగా, సాధారణ ఎన్నికలకు ఇంకో ఏడాది మాత్రమే గడువు ఉంది. ప్రభుత్వం పన్నుల్లో కొన్ని రాయితీలు కల్పించవచ్చని లేదా సంక్షేమ పథకాలకు కేటాయింపులు పెంచవచ్చని భావిస్తున్నారు. అయితే, ముడి చమురు ధరల్లో పెరుగుదలను దృష్టిలో ఉంచుకుని విశ్లేషకులు సబ్సిడీ వ్యయంపై అంచనాలు వెల్లడించేందుకు వెనుకాడుతున్నారు. ''ఇంధన సబ్సిడీలకు 2018-19 బడ్జెట్‌లో కేటాయింపును రూ. 8,800 కోట్ల నుంచి రూ. 9,300 కోట్లకు పెంచవచ్చు. ఎరువుల రంగానికి సబ్సిడీ కేటాయింపును 2018-19 బడ్జెట్‌లో రూ. 70,000 కోట్ల స్థాయి వద్దే ఉంచవచ్చు'' అని ఐ.సి.ఆర్.ఏ. పేర్కొంది. రానున్న ఆర్థిక సంవత్సరంలో ఆహార సబ్సిడీ మాత్రం పెరగవచ్చని అది అంచనా వేసింది.

ఎస్సార్‌కు రూ. 32 కోట్ల ఆర్డరు

న్యూఢిల్లీ: జార్ఖండ్‌లోని బొకారోలో కోల్-బెడ్ మిథేన్ (సి.బి.ఎం) వద్ద 30 బావుల తవ్వకానికి ప్రభుత్వ యాజమాన్యంలోని చమురు, సహజ వాయు సంస్థ (ఓ.ఎన్.జి.సి) నుంచి రూ.32 కోట్ల కాంట్రాక్టు కైవసం చేసుకున్నట్లు ఎస్సార్ ఆయిల్‌ఫీల్డ్స్ సర్వీసెస్ ఇండియా లిమిటెడ్ (ఇ.ఓ.ఎస్.ఐ.ఎల్) వెల్లడించింది. ఈ ఏడాది కాంట్రాక్టు కింద, ఎస్సార్ ఆయిల్‌ఫీల్డ్స్ ''పనులకు ఎం.ఆర్11 ల్యాండ్ రిగ్గు ఉపయోగించనుంది. వచ్చే కొద్ది వారాల్లో పనులు మొదలుకావచ్చు'' అని కంపెనీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ ఆర్థిక సంవత్సరంలో దాదాపు రూ. 300 కోట్ల ఆదాయాన్ని నమోదు చేయడానికి చేరువలో ఉన్న ఇ.ఓ.ఎస్.ఐ.ఎల్. మూడు ల్యాండ్ రిగ్గులు ప్రస్తుతం విధుల్లో ఉన్నాయి. ఈ రిగ్గులు కాంట్రాక్టుపై ఆయిల్ ఇండియా, మెర్కటార్ పెట్రోలియం సంస్థల వద్ద పనిచేస్తున్నాయి. సముద్రంలో తవ్వకాలు సాగించగల సెమీ-సబ్‌మెర్సిబుల్ రిగ్గు ఎస్సార్ వైల్డ్‌క్యాట్ రూ. 850 కోట్లకు మూడేళ్ళ కాంట్రాక్టుపై 2017 మే నుంచి ఓ.ఎన్.జి.సి. వద్ద పనిచేస్తోంది. ఇప్పుడు కంపెనీకి రెండవ తవ్వకాల కాంట్రాక్టు కూడా లభించినట్లయింది. చమురు, ఇంధన వాయు అన్వేషణ, ఉత్పత్తిలో ఓ.ఎన్.జి.సి. అగ్ర సంస్థగా ఉంది. యంత్రాలు, యంత్ర పరికరాలను మెరుగైన రీతిలో నియోగించడం వల్ల 2018-19లో రాబడి మరో 20 శాతం పెరగగలదని ఇ.ఓ.ఎస్.ఐ.ఎల్. భావిస్తోంది. కంపెనీ వద్దనున్న రిగ్గులలో ఎనిమిది రానున్న ఆర్థిక సంవత్సరంలో రకరకాల క్లయింట్లకు సేవలందించనున్నాయి. భారతదేశంలో చమురు, ఇంధన వాయు రంగంలో కార్యకలాపాలు పెరుగుతున్నాయని, దేశీయ ముడి చమురు ఉత్పత్తిని పెంపొందించడంలో సాయపడేందుకు తమ అధునాతన రిగ్గులు పూర్తిగా సంసిద్ధమై ఉన్నాయని, అవి ఆ విధంగా దేశ ఇంధన భద్రతకు పూచీ వహిస్తున్నాయని ఇ.ఓ.ఎస్.ఐ.ఎల్. ప్రధాన కార్యనిర్వహణాధికారి రాజీవ్ నయ్యర్ చెప్పారు.

మనం
www.manamnews.com
హైదరాబాద్
11
గురువారం 25
జనవరి 2018



కోటలకు కోట

రాచరికానికి చక్కటి ఆనవాలు రాజస్థాన్ రాజధాని జైపూర్ నగరం. భారత పర్యాటకంలో ప్రతిష్టాత్మకంగా చూపించుకునే బాందినీ ప్రింట్ చేసిన తలపాగాలు, కుందన్ ఆభరణాలు ధరించిన యువతులు, ఒంటెల సవారీల వంటి వాటికి పుట్టిల్లు ఇది. హవామహల్, నహర్‌ఘర్ ఫోర్ట్, అంబర్ ఫోర్ట్, జైఘర్ ఫోర్ట్, సిటీప్యాలెస్, జల్‌మహల్, రామ్‌భాఘ్ ప్యాలెస్, సిసోడియా రాణి కా బాఘ్, ఆల్బర్ట్ మ్యూజియం, జంతర్‌మంతర్ ఇలా సందర్శించాల్సిన ప్రదేశాలు కూడా చాలానే ఉన్నాయి. ఈ వారం పర్యాటకంలో జైపూర్ ప్రత్యేకత అక్కడి పర్యాటక ప్రదేశాల గురించి తెలుసుకుందాం...



జైపూర్ నగరంలో చూడదగిన ప్రదేశాలో చాలానే ఉన్నాయి. సవాయ్ రెండవ జైసింగ్ కట్టించిన నగరం కావడంతో జైపూర్‌గా నామకరణం అయింది. జైపూర్‌లో అడుగుపెట్టిన తర్వాత నగర పర్యటన ఎక్కడి నుంచి మొదలు పెట్టాలో ఒక పట్టాన అర్థం కాదు. హవామహల్, నహర్‌ఘర్ ఫోర్ట్, అంబర్ ఫోర్ట్, జయ్‌ఘర్ ఫోర్ట్, సిటీప్యాలెస్, జల్‌మహల్, రామ్‌భాఘ్ ప్యాలెస్, సిసోడియా రాణి కా బాఘ్, ఆల్బర్ట్ మ్యూజియం, జంతర్‌మంతర్... ఇలా ప్రధానమైన నిర్మాణాల జాబితా కూడా పది దాటుతుంది. నగరానికి అన్ని వైపులా స్వాగత ద్వారాలు ఉంటాయి. లోపలికి అడుగు పెడితే ఆధునికత సంతరించుకుంటున్న పాశ్చాత్యఛాయలు కనిపిస్తాయి, పర్యాటక శాఖ ఊరించే కోటలను చూడాలంటే ఓల్డ్ సిటీకి వెళ్లాలి. పాత నగరం మొత్తానికి ప్రహరీ గోడ ఉంటుంది. లోపల మొత్తం గులాబీమయమే. బ్రిటిష్ యువరాజు ఎడ్వర్డ్ 1876లో భారత్‌లో పర్యటించాడు. ఆ యువరాజుకి ఘనస్వాగతం పలకడానికి జైపూర్ రాజు సవాయ్‌రామ్‌సింగ్ ప్రతి నిర్మాణానికీ గులాబీ రంగు వేయించాడు. పింక్‌సిటీ అనే పేరు అప్పటి నుంచే వచ్చిందంటారు. నగరం మొత్తం రాజస్థానీ, మొఘల్ నిర్మాణశైలుల సమ్మేళనం. ప్యాలెస్‌లలో తోటలు చక్కటి ప్రణాళికతో ఉంటాయి.

సిటీప్యాలెస్!

సిటీప్యాలెస్‌కి స్వాగతమందిరం ముబారక్‌మహల్. ఇక్కడి నుంచి ముందుకెళ్తే రెండవ మాన్ సింగ్ మ్యూజియం కనిపిస్తుంది. రాజకుటుంబాల జీవనశైలికి ప్రతీక ఇది. ఎంబ్రాయిడరీ దుస్తులు, బెనారస్ పట్టుచీరలు, రాజులు ధరించిన పైజామాలు, ఛోగాలు(చొక్కాలు), జమావర్ శాలువాలు, వడ్డాణాలు... చూడడానికి ఓపిక నశిస్తుంది తప్ప అవి తరగవు.

రాజపుత్రులు ఆజానుబాహులు అనడానికి నిదర్శనం మొదటి మాధోసింగ్ దుస్తులే. ఈ రాజు ఏడడుగుల పొడవు ఉండేవాడని నిర్ధారిస్తున్నట్లు ఉంటాయి ఇవి. మహారాణి ప్యాలెస్‌లోని ఆయుధాగారంలో ఐదు కిలోల బరువైన కత్తి ఉంటుంది. రాజపుత్రులు... జానపద కథల్లో విన్నంతటి బలశాలులే అని రుజువుచేస్తున్నట్లుగా ఉంటుందీ ఈ భారీ ఖడ్గం. రాజులు వార్ధక్యంలోకి అడుగుపెట్టిన తర్వాత వాహ్యాళికెళ్లేప్పుడు ఉపయోగించే చేతికర్రలు కూడా ఉంటాయి.

మరో సెక్షన్‌లోకి అడుగుపెడితే ఫిరంగులు, డబుల్ బ్యారెల్గన్, పిస్టల్లు ఉంటాయి. ఇక్కడ కనిపించే నెమలిపిడికత్తులు, పర్షియా ఆయుధాలు, దక్కనులో వాడే చేతి విల్లంబులు, బాణాలు... ఒక ఎత్తయితే కెంపులు, మరకతాలు పొదిగిన కత్తి మరో ఎత్తు. ఇది మహారాజా సవాయ్ రామ్‌సింగ్‌కు బ్రిటిష్ రాణి విక్టోరియా బహూకరించిన కత్తి. మ్యూజియం దాటి బయటకు వస్తే... గైడ్ వెంటే పర్యాటకుల అడుగులు దివాన్ ఈ ఖాస్, దివాన్ ఇ ఆమ్ వైపు పడతాయి. ఇవి రాజు ఆంతరంగికులను, ప్రజలను కలిసే మందిరాలు. దివానీ ఆమ్ (ఆర్ట్ గ్యాలరీ) పై కప్పుకి ఉన్న చిత్రలేఖనాలలో పొదిగిన రంగురాళ్లు ఇప్పటికీ మెరుపులీనుతుంటాయి. పెద్ద క్రిస్టల్ షాండ్‌లియర్ చూపుతిప్పుకోనివ్వదు. గ్యాలరీలోని చిత్రలేఖనాలలో రామాయణ సన్నివేశాలే ప్రధానం. ఇంకా చెప్పాలంటే.. చంద్రమహల్... ఈ మందిరం నుంచి గోవింద్‌జీ ఆలయం కనిపిస్తుంది. కృష్ణుని భక్తులైన రాజపుత్రులు ఆలయం కనిపించేటట్లు ఈ మహల్‌ను కట్టించుకున్నారు.

రికార్డుకెక్కిన వెండికూజాలు!

సిటీప్యాలెస్‌లో అత్యంత ఆకర్షణీయమైనవి వెండికూజాలు. మహారాజా రెండవ మాధోసింగ్ యూరప్ పర్యటనకు వెళ్లినప్పుడు రెండు కూజాల్లో గంగనీరు తీసుకెళ్లాడు. ఒక్కో కూజా సామర్థ్యం తొమ్మిది వేల లీటర్లు. యూరప్ పర్యటన కోసమే ఈ కూజాలను చేయించారు. ఇవి ప్రపంచంలో అతిపెద్ద వెండి పాత్రలుగా గిన్నిస్ బుక్‌లో రికార్డుకెక్కాయి.

జంతర్‌మంతర్ మహల్





ఇది ఖగోళశాస్త్ర ప్రావీణ్యానికి ప్రతీక. ఢిల్లీ జంతర్‌మంతర్‌కి మాతృక కూడ. సవాయ్ జయ్‌సింగ్ నిర్మించిన ఐదు అబ్జర్వేటరీల్లోకి ఇదే పెద్దది (మిగిలినవి వారణాసి, ఉజ్జయిని, మధురలలో). ఇక్కడి నుంచి బయటకు వెళ్తే స్వాగతం పలికే నిర్మాణం హవామహల్. జైపూర్‌కి చిహ్నంగా పరిగణించే హవామహల్ కృష్ణుని కిరీటాన్ని పోలి ఉంటుంది. గవాక్షాల మాటున ఉన్న గదుల్లోంచి రాణివాసపు స్త్రీలు నగరంలో జరిగే వేడుకలు చూసేవారు. ఇక్కడి నుంచి జైఘర్ ఫోర్ట్‌లో అడుగుపెడితే రాజమందిరాలు,





ఉద్యానవనాలు, రిజర్వాయర్లు, ధాన్యాగారం, ఆయుధాగారం, ఆలయాలు ఉంటాయి. ఇది ఉంది అది లేదు అనడానికి వీల్లేనంత పకడ్బందీగా ఉంటాయి ఈ కోటలు. జగత్ శిరోమణి ఆలయంలో భక్తమీరా కొలుస్తున్న కృష్ణుని విగ్రహం ఉంటుంది.

తొలి రాజధాని అంబర్!

రామ్ నివాస్ గార్డెన్‌లో ఆల్బర్ట్ హాల్ ఉంది. ఈజిప్టు మమ్మీ, పర్షియాలో తయారైన బంగారు తివాచీ ప్రధాన ఆకర్షణలు. జైపూర్ నుంచి ఢిల్లీ వైపుగా పదికిలోమీటర్లు ప్రయాణిస్తే అంబర్ కోట వస్తుంది. జైపూర్ నిర్మాణానికి ముందు పాలన ఈ కోట నుంచే జరిగేది. ఏనుగు అంబారీ ఎక్కి కోట మీదకు వెళ్లవచ్చు. ఈ పర్యటనలో సున్నితత్వం అంతా సిసోడియా రాణీకా బాఘ్‌లోనే కనిపిస్తుంది. ఈ గార్డెన్ జయ్‌పూర్‌కి ఎనిమిది కిలోమీటర్ల దూరాన ఆగ్రా దారిలో వస్తుంది. సవాయ్ జయ్‌సింగ్... సిసోడియా యువరాణిని మనసు పడి వివాహమాడి, ఆమెకు ఇష్టమైనట్లు ఉద్యానవనాన్ని నిర్మించాడు. రాణి కాలు కింద పెట్టకుండా ఉద్యానవనంలో విహరించేటట్లు టై గార్డెన్ ఏర్పాటు చేశాడు. రాజుకు ప్రేమ ఎక్కువైతే ఇలాగే ఉంటుందేమో.

ఎలా వెళ్లాలి?

హైదరాబాద్ నుంచి విమానశ్రయం ద్వారా జైపూర్ చేరుకోవచ్చు. హైదరాబాద్ నుంచి జైపూర్‌కి ఎకానమీ క్లాస్ విమానం టిక్కెట్టు రూ5000.

రైలుమార్గం: జైపూర్ జంక్షన్. కాచిగూడ నుంచి జైపూర్ జంక్షన్‌కి నార్త్‌వెస్టర్న్ రైల్వే రైళ్లు ఉన్నాయి. మైసూర్–జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లో హైదరాబాద్ నుంచి జైపూర్‌కి టిక్కెట్టు ధరలు స్లీపర్‌లో రూ.600, ఏసీ త్రీటైర్‌లో రూ.1500, ఫస్ట్‌క్లాస్‌లో రూ.4000 ఉంటాయి. సికింద్రాబాద్ – జైపూర్ ఎక్స్‌ప్రెస్‌లోనూ దాదాపుగా ఇంతే. ప్రయాణ సమయం 30 గంటలు.

ఎక్కడ ఉండాలి?

జైపూర్‌లోని హోటళ్లలో బస చేసేందుకు వీలుగా ఉంటుంది. పెర్ల్ ప్యాలెస్, అనురాగ్ విల్లా, రామ్‌భాగ్ ప్యాలెస్‌లో బస చేసి పర్యాటక ప్రదేశాలను సందర్శించడాని అనువుగా ఉంటుంది.

రాజస్థాన్ సంప్రదాయ భోజనం రుచి చూడాలంటే జోరి బజార్‌లోని ఎల్‌ఎంబి రెస్టారెంట్‌కి, స్వీట్స్‌కి రావత్ మిస్థాన్ భండార్, గుజరాతీ రుచుల కోసం అన్నపూర్ణ, పనీర్ బటర్ మసాలా కోసం 'సూర్య మహల్', విదేశీ రుచులకు 'కాపర్ చిమ్నీ', ఇటాలియన్ పిజ్జా తినాలంటే పిజ్జాహట్, చిరుతిళ్లకు ఇండియన్ కాఫీ హౌస్‌కు వెళ్లవచ్చు.

ఏప్రిల్, మే నెలల్లో ఉష్ణోగ్రతలు 47 డిగ్రీలకు చేరుతాయి. జూన్ – సెప్టెంబరు వర్షాకాలం. అక్టోబర్, నవంబరు ఆహ్లాదంగా ఉంటుంది. డిసెంబర్ – ఫిబ్రవరి ఉష్ణోగ్రతలు 4 డిగ్రీలకు పడిపోతాయి. మార్చిలో బావుంటుంది.

ఇంకా.. చూడదగినవి..

విద్యాధర బాఘ్... రెండవ జైసింగ్ కొలువులో ప్రధాన వాస్తుశిల్పి విద్యాధరుడు. సిసోడియా రాణి కా బాఘ్ వంటి అద్భుత నిర్మాణాల రూపకర్త. అందుకే ఒక ఉద్యానవనానికి విద్యాధరుడి పేరు పెట్టారు.

జల్‌మహల్... మన్సాగర్ మధ్యలో ఉంటుంది. శీతాకాలంలో ఇక్కడికి వలస పక్షులు వస్తాయి.

షాపింగ్

జైపూర్ చెప్పులకు (జూటీ) రామ్‌గంజ్ బజార్, టై అండ్ డై దుస్తులకు కృష్ణపాల్ బజార్, అలంకరణ వస్తువులకు మనిహారన్ కా రాస్తా, తివాచీలకు సుభాష్ చౌక్, మార్బుల్ కళాకృతులకు ఖజనో కా రాస్తా, హస్తకళలు, నీలిరంగు పింగాణీ వస్తువుల కోసం సంగనెర్ గ్రామానికి వెళ్లాలి. ఒంటె చర్మంతో చేసిన బ్యాగ్లు, చెప్పులు, పర్సులకు విదేశాల్లో డిమాండ్. ఇక జైపూర్‌లో కుందన్, జేడ్ ఆభరణాల దుకాణాలు ఇక్కడ చాలానే ఉంటాయి.



హ్యాంగింగ్ ట్రైన్

హాయిగా విహరిస్తూ ఈ ప్రపంచం చుట్టేందుకు పర్యాటక ప్రేమికులు ఎక్కువగా ఆశ్రయించేది రైలు. ఇక, పిల్లల సంగతైతే చెప్పనవసరమేలేదు. ఈ ట్రైన్ విషయంలో కాస్త ఆలోచించాల్సి ఉంటుంది. ఎందుకంటే, ఏకంగా పట్టాల కిందనుంచి వెళ్లే రైలు ఇది. ఇలాంటి రైలును మీరెప్పుడైనా చూశారా? ప్రయాణించారా? అయితే, ఇందులో ప్రయాణికులు ఎలా కూర్చొంటారు అన్న సందేహం మీకు కలిగే ఉంటుంది. డౌన్ రన్నింగ్ (హ్యాంగిగ్ ట్రైన్)గా పిలవబడుతోన్న ఈ రైలు జర్మనీలోని వప్పర్టల్లో వెళుతుంది. ప్రతిరోజూ ఈరైలులో 82 వేల మంది ప్రయాణిస్తారు. 13.3 కిలోమీటరు దూరం వరకు ప్రయాణించే ఈ రైలు 20 స్టేషన్లలో ఆగుతుంది. ఇందులో ప్రయాణించడం ఒక గొప్ప అనుభూతిని మిగులుస్తుందని ప్రయాణికుల భావన. దీన్ని ప్రపంచంలోనే అతిపురాతన మోనో రైల్ అని పిలుస్తారు. ట్రాక్స్ (పట్టాల కింద) కింద వెళ్లే ఈ రైలుకు కారణం దీని వుప్టల్ చాలాకాలం నాటిది. తక్కువ స్థలం కారణంగా రైలును ఇలా నడపడాలాని నిర్ణయించుకున్నారట! 1901 నుంచీ ఈ రైలు ఇలానే ప్రయాణిస్తుంది. కరెంటుతో పనిచేసే ఈ రైలు గ్రౌండ్ 39 ఫీట్ ఎత్తుపై వెళుతుంది. 1999లో ఒకసారి ఈ రైలు వుప్పర్ నదిలో పడిపోయింది. ఆ సమయంలో చాలామంది గాయపడ్డారు. కానీ, దాని తర్వాత ఎలాంటి దుర్ఘటనలు జరగలేదు. అయితే, ఈ రైలు ఎక్కాలంటే జర్మనీ వెళ్ళాల్సిందే..

సమష్టిగా నిలబడండి..



విహారయాత్రలలో విషాదకరమైన సంఘటనలు ఇటీవల కాలంలో ఎక్కువగా చోటుచేసుకుంటున్నాయి. వర్షాకాలం కావడంతో పర్యాటకులకు చిక్కులు తప్పడంలేదు. ప్రధానంగా నదులు, జలపాతల దగ్గర ఎక్కుగా ప్రమాదాలకు గురవుతున్నారు. అలాంటి ప్రదేశాలలో నీటి ప్రవాహరం అనూహ్యంగా ఉధృతం కావడం వల్ల నీటివేగానికి కొట్టుకుపోతున్నారు. అయితే, ఇలాంటి సందర్భాలలో సమిష్టిగా ప్రయత్నిస్తే ప్రమాదాలను ఎదుర్కోవచ్చంటున్నారు నిపుణులు. సాధరణంగా విహారయాత్రలకు స్నేహితులు, కుటుంబసభ్యులతో గ్రూపుగా వెళుతూఉంటాం. మనం పర్యటించే ప్రాంతంలోని వాతావరణం ప్రశాంతగా ఉంది కదా! అని నదులు, జలపాతాల దగ్గర లోపలకు వెళుతూ ఫోటోలు తీసుకోవడం, షెల్టర్‌ను ఏర్పాటు చేసుకోవడం వంటివి చేస్తుంటాం. అయితే, ఎగువ ప్రాంతాలలో కురిసిన వర్షాల కారణంగా ఒక్కసారిగా నీటి ప్రవాహం పెరిగిపోతుంది. అలాంటి సమయాల్లో అందరూ చెల్లాచెదురుగా విడిపోతూ ఉంటారు. అలాకాకుండా అందరూ నీటి ప్రవాహానికి ఎదురుగా వరుసక్రమంలో నిలబడి, ఒకరిని ఒకరు గట్టిగా పట్టుకోవాలి. అలా చేయడం వల్ల నీటి ఉధృతను కొంతవరకూ ఎదుర్కొని నిలబడగలుగుతారు. ఫలితంగా ప్రమాదాన్ని కొంతమేర అడ్డుకోగలం. అందుకోసం చేసిన వివిధ అధ్యయనాలు మంచి ఫలితాన్ని ఇచ్చాయి.

బ్లైండ్ వరల్డ్ కప్ జట్టులో... సింగర్, కూలీ, పాల వ్యాపారి



న్యూఢిల్లీ: క్రికెట్‌ను పిచ్చిగా ఆరాధించే ఈ దేశంలో మరో వారం రోజుల్లో కొందరు రాత్రికి రాత్రే మిలియనీర్లు కాబోతున్నారు. అయితే ఇటీవల బ్లైండ్ క్రికెట్ వరల్డ్ కప్ విజేత జట్టులో ఒకరు సింగర్ కాగా.. మరొకరు రైతు కూలీ, ఇంకొకరు పాలు అమ్మే వ్యక్తి. భారత్‌లో క్రికెట్‌ను ఒక మతంలా భావిస్తారు. క్రికెటర్లు తమ సహజమైన స్థితి కంటే ఎక్కువగా ఎంజాయ్ చేస్తున్నారు. కానీ ఈ చాంపియన్ బ్లైండ్ క్రికెటర్లు మాత్రం నిరుద్యోగంతో సతమతమవుతున్నారు. తమను కూడా గుర్తించాలని కోరుతున్నారు. గత 59 నెలల్లో ఈ జట్టు రెండు టీ20 వరల్డ్ కప్, రెండు వరల్డ్ కప్ ట్రోఫీలతో పాటు ఆసియా కప్, నాలుగు ద్వైపాక్షిక సిరీస్‌లను గెలిచింది. క్రికెట్ మైదానంలో హీరోలుగా నిలిచిన ఈ 17 మంది సభ్యుల జట్టులో 12 మందికి పర్మనెంట్ ఉద్యోగం లేదు. ఇందులో ఏడుగురు వివాహితులు. ఉద్యోగులైన క్రికెటర్లు టోర్నీలు ఆడే సమయంలో లాస్ ఆఫ్ పే కింద దేశానికి ప్రాతినిధ్యం వహిస్తున్నారు. గణేష్ మండ్కర్ గుజరాత్‌లోని వల్సద్‌కు చెందిన ఆల్ రౌండర్. ఇతని తల్లిదండ్రులు వ్యవసాయ కూలీలు. ఇతనికి చిన్న కిరాణా కొట్టు ఉంది. క్రికెట్ ఆడొద్దని తల్లిదండ్రులు చెబుతున్నా దాని మీద ఉన్న మక్కువతో ఇతను ఆడుతూనే ఉన్నాడు. 2014 వరల్డ్ కప్ తర్వాత ఉద్యోగమిస్తానన్న గుజరాత్ ప్రభుత్వ హామీ కోసం ఎదురు చూస్తున్నాడు.

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్‌కు చెందిన ప్రేమ్ కుమార్ బి-1 కేటగిరి అంధుడు. జీవనం కొనసాగించేందుకు ఓ ఆర్కెస్ట్రాలో సింగర్‌గా పని చేస్తున్నాడు.'వినాయక చతుర్థి సమయంలో 10 ప్రోగ్రామ్స్‌కు పిలుపు వస్తుంది. ఒక్కో ప్రోగ్రామ్‌కు 1000 నుంచి 1500 ఇస్తారు. సాధారణంగా అయితే నెలకు రెండు లేదా మూడు ప్రోగ్రామ్స్ జరుగుతాయి. కుటుంబాన్ని నడిపించడం చాలా కష్టంగా ఉంది' అని ప్రేమ్ కుమార్ ఆవేదన వ్యక్తం చేశాడు. ఏడేళ్ల వయసులో చికెన్ పాక్స్ (తట్టు) వల్ల ఇతని రెండు కళ్లు పోయాయి.

అనిల్ ఆర్య. ఇతను వల్సద్‌కు చెందిన క్రికెటర్. ఇతని కుటుంబంలో ఎనిమిది మంది ఉంటారు. ఇతని తండ్రి కూలీ. ఇతను ఇంటింటికి పాలు సరఫరా చేస్తాడు. ఇతని నెలవారీ జీతం రూ. 12 వేలు. 'ఇంటింటికి పాలు సరఫరా చేస్తాను. ఈ రోజువారీ పనుల వల్ల క్రికెట్‌పై దృష్టి పెట్టలేకపోతున్నా. టోర్నీలు ఆడే సమయంలో నా బాధ్యతను మరొకరికి అప్పజెప్పాల్సి వస్తోంది. నాకు మరో దారిలేదు' అని అనిల్ అన్నాడు.

వెంకటేశ్వర్ రావు. ఇతను కూడా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవాడు. బ్లైండ్ క్రికెట్‌లో ఇతనికి విరాట్ కోహ్లీ అన్న పేరుంది. వరల్డ్ కప్ లీగ్ మ్యాచ్‌ల్లో ఇతను పాకిస్థాన్‌పై 68 పరుగులు సాధించాడు. దాయాదులపై ఇతను నాలుగు సెంచరీలు నమోదు చేశాడు. 'కాంట్రాక్ట్ పద్ధతిలో ఫిజికల్ ఎడ్యుకేషన్ ట్రెయినర్‌గా పనిచేస్తున్నాను. ఇంతకుముందు నాకు రూ. 5 వేలు వచ్చేవి. ఇప్పుడు రూ. 14 వేలు తీసుకుంటున్నాను. ఈ టెంపరరీ ఉద్యోగంతో కుటుంబాన్ని ఎలా పోషించాలి?' అని వెంకటేశ్వర్ రావు అన్నాడు.

బ్లైండ్ క్రికెటర్ల పట్ల వ్యవహరిస్తున్న తీరుపై కెప్టెన్ అజయ్ రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశాడు. దేశానికి కీర్తి ప్రతిష్టలు తెచ్చేందుకు తాము కూడా శ్రమిస్తున్నామన్నాడు. 'క్రికెట్ అంటే కోహ్లీ, ధోనీలకున్న పిచ్చే మాక్కూడా ఉంది. కానీ మాకు గుర్తింపు లేదు. క్రీడా మంత్రిత్వ శాఖ గానీ, బీసీసీఐ గానీ మమ్మల్ని గుర్తించకపోవడం దారుణం' అని అజయ్ అన్నాడు. 'క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇన్ ఇండియా (సీఏబీఐ) బీసీసీఐకి అనుబంధం కాదు. ప్రభుత్వం కూడా ఆరకొర సహాయం మాత్రమే చేస్తుంది. ఇక సదుపాయాల విషయానికొస్తే.. ప్రాక్టీస్ గ్రౌండే లేదు. భవిష్యత్తు గురించి భయంగా ఉంది అని భారత జట్టు చీఫ్ కోచ్, సీఏబీఐ ప్రధాన కార్యదర్శి జాన్ డేవిడ్ అన్నారు.

12 SPORTS హైదరాబాద్
మనం స్పోర్ట్స్
గురువారం, 25 జనవరి, 2018
www.manamnews.com

వైట్‌వాష్ తప్పదా?

పుజారా, కోహ్లీ అర్ధ సెంచరీలు

- భువి మినహా మిగిలిన వారంతా విఫలం
- తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 187 ఆలౌట్
- ప్రస్తుతం సౌతాఫ్రికా 6/1
- చివరి, మూడో టెస్టు

జొహన్నెస్‌బర్గ్: కోహ్లీ సేనకు మరో ఘోర పరాజయంతో పాటు వైట్‌వాష్ తప్పదా? పరిస్థితులు చూస్తుంటే తప్పదేమో అనిపిస్తోంది. ఎందుకంటే టీమిండియా తొలి ఇన్నింగ్స్‌లో పుజారా, విరాట్ అర్ధ సెంచరీలు, భువనేశ్వర్ సహకారం మినహా మిగిలినవాళ్లెవ్వరూ జట్టుకు అండగా నిలిచేందుకు ప్రయత్నించలేదు. ఈ సిరీస్‌లో ఎట్టకేలకు బరిలోకి దిగిన రహానే కూడా జట్టును ఆదుకోలేకపోయాడు. ఆశ్చర్యకరమైన విషయమేంటంటే.. భారీ షాట్లకు పోయి మనవాళ్లు అవుటైన పెద్దగా బాధ ఉండేది కాదేమో. కానీ డిఫెన్స్ ఆడబోయి.. బంతిని ఎలా ఆడాలో తెలియక తికమకపడి అవుటౌతుండడం బాధ కలిగిస్తోంది. తొలి ఇన్నింగ్స్‌లో టీమిండియా 187 పరుగులకు ఆలౌటైంది. తర్వాత బరిలోకి దిగిన సౌతాఫ్రికాను భువనేశ్వర్ ఆరంభంలోనే దెబ్బ తీశాడు. దీంతో తొలి రోజు ఆట ముగిసే సమయానికి సౌతాఫ్రికా 1 వికెట్ నష్టపోయి 6 పరుగులు చేసింది. ఇంకా 181 పరుగులు వెనకబడివుంది. ఎల్గార్ (4), రబాడ (0) క్రీజులో ఉన్నారు.



టాస్ గెలిచి బ్యాటింగ్ ఎంచుకున్న టీమిండియా ఆరంభంలోనే రెండు వికెట్లు కోల్పోయింది. ఓపెనర్లు కేఎల్ రాహుల్, మురళీ విజయ్‌లను వెర్నాన్ ఫిలాండర్, కగిసో రబాడ అవుట్ చేశారు. దీంతో భోజన విరామ సమయానికి టీమిండియా 27 ఓవర్లలో 45 పరుగులకు 2 వికెట్లు కోల్పోయి పీకల్లోతు కష్టాల్లో కూరుకుపోయింది. కెప్టెన్ విరాట్ కోహ్లీ 58 బంతుల్లో 24 పరుగులు చేయడంతో లంచ్ విరామం తర్వాత కాస్త కోలుకుంది. మరో ఎండ్‌లో ఉన్న చెటేశ్వర్ పుజారా వికెట్ కోల్పోకుండా జిడ్డుగా ఆడాడు. 66 బంతుల్లో (11 ఓవర్లు) 5 పరుగులు చేశాడు. నిదానంగా ఆడుతూనే వీరిద్దరూ 110 బంతుల్లో 32 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పారు. టీమిండియా మరోసారి కోహ్లీపైనే ఆధారపడింది. 21వ ఓవర్లో కోహ్లీ 11 పరుగుల వద్ద ఉన్నప్పుడు రబాడ బౌలింగ్‌లో ఇచ్చిన క్యాచ్‌ను ఫిలాండర్ చేజార్చాడు. దీంతో రబాడ తీవ్ర అసంతృప్తిని వ్యక్తం చేశాడు. 80 నిమిషాల తర్వాత పుజారా తొలి పరుగు తీయడంతో స్టేడియంలోని అభిమానులు గట్టిగా కేకలు పెట్టారు. లుంగి ఎన్‌గిడి బౌలింగ్‌లో పుజారా తొలి సింగిల్ రన్ తీశాడు. పుజారా తొలి సింగిల్ తీసే సమయంలో సౌతాఫ్రికా ఫీల్డర్లు అంపైర్‌కు అప్పీల్ చేయడం మర్చిపోయారు. ఎందుకంటే బంతి అతని బ్యాట్‌కు కాకుండా ప్యాడ్‌కు తగిలినట్టు రీ ప్లేలో కనిపించింది. ప్రొటీస్ గనుక అప్పీల్ చేసివుంటే పుజారా అవుటయ్యేవాడు. ఫిలాండర్ బౌలింగ్‌లో కేఎల్ రాహుల్ ఇచ్చిన క్యాచ్‌ను కీపర్ డికాక్ పట్టుకోవడంతో టీమిండియా తొలి వికెట్ కోల్పోయింది. తొమ్మిదో ఓవర్లో విజయ్ కూడా అవుట్ కావడంతో సమస్య మరింత ఝటిలమైంది.

విరాట్ కోహ్లీ వికెట్

ఎంతో జాగ్రత్తగా ఇన్నింగ్స్‌ను నిర్మిస్తూ వచ్చిన విరాట్ కోహ్లీపై టీమిండియా భారీ ఆశలు పెట్టుకుంది. కానీ ఫీల్డర్లు చేసిన తప్పిదాల వల్ల కోహ్లీకి రెండుసార్లు లైఫ్ లభించింది. కోహ్లీ ఇచ్చిన క్యాచ్‌లను తొలుత వెర్నాన్ ఫిలాండర్, తర్వాత డి విలియర్స్ చేజార్చారు. దీంతో కోహ్లీ అర్ధ సెంచరీ (54) పూర్తి చేశాడు. తొలి రెండు సెషన్లలో పిచ్ సీమ్ బౌలర్లకు సహకరించింది. దీంతో టీమిండియా ఓపికతో, జాగ్రత్తగా ఆడాల్సివచ్చింది. తొలి రన్ తీయడానికి 54 బంతులు తీసుకున్న పుజారా చాలా ఓపికగా ఆడుతూ కోహ్లీతో కలిసి 84 పరుగుల కీలక భాగస్వామ్యాన్ని అందించాడు. రహానేను ఆడించాలని ఈ సిరీస్‌లో పెద్ద చర్చ జరిగింది. ఎందుకంటే విదేశాల్లో బాగా ఆడతాడన్న రికార్డు అతనికుంది. ఎట్టకేలకు 29 ఏళ్ల రహానేకు రోహిత్ స్థానంలో తుది జట్టులో చోటు దక్కింది. ఫిలాండర్ బౌలింగ్‌లో రహానే కీపర్ డికాక్‌కు క్యాచ్ ఇచ్చాడు. అయితే ఫిలాండర్ నో బాల్ వేసినట్టు రీ ప్లేలో తేలడంతో మళ్లీ ఆడాడు. అది ప్రొటీస్‌ను పెద్దగా బాధించలేదు. ఎందుకంటేమో రెండు ఓవర్ల తర్వాత మోర్నే మోర్కెల్ బౌలింగ్‌లో రహానే ఎల్‌బిడబ్ల్యూగా వెనుదిరిగాడు. రహానే రివ్యూ కోరినా ఫలితం దక్కలేదు. మరో ఎండ్‌లో ఉన్న పుజారా వికెట్లకు అతుక్కుపోయి ఆడాడు. టీ విరామ సమయానికి పుజారా, పార్థివ్ పటేల్ క్రీజులో ఉన్నారు.

ప్రొటీస్‌ను దెబ్బ తీసిన భువీ

తర్వాత తొలి ఇన్నింగ్స్‌కు దిగిన సౌతాఫ్రికాను భువనేశ్వర్ ఆరంభంలోనే దెబ్బ తీశాడు. భువీ రెండో ఓవర్లో వేసి న బంతికి రెండో ఓపెనర్ మార్‌క్రమ్ కీపర్ పటేల్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరిగాడు. దీంతో 3 పరుగుల వద్ద సౌతాఫ్రికా తొలి వికెట్ కోల్పోయింది. తర్వాత కగిసో రబాడ నైట్‌వాచ్‌మన్‌గా వచ్చాడు.



చివరి సెషన్‌లో ఆలౌట్

టీ బ్రేక్ తర్వాత బ్యాటింగ్‌కు వచ్చిన వారిలో భువనేశ్వర్ ఒక్కడే జట్టుకు తనవంతు సహకారం అందించాడు. మిగిలిన వారంత రెండంకెల స్కోరు కూడా చేయలేకపోయారు.



స్కోరుబోర్డు

ఇండియా తొలి ఇన్నింగ్స్: విజయ్ (సి) డికాక్ (బి) రబాడ 8, రాహుల్ (సి) డికాక్ (బి) ఫిలాండర్ 0, పుజారా (సి) డికాక్ (బి) పెహ్లుక్వాయో 50, కోహ్లీ (సి) డివిలియర్స్ (బి) ఎన్‌గిడి 54, రహానే ఎల్‌బిడబ్ల్యు (బి) మోర్కెల్ 9, పార్థివ్ (సి) డికాక్ (బి) మోర్కెల్ 2, పాండ్యా (సి) డికాక్ (బి) పెహ్లువాయో 0, భువనేశ్వర్ (సి) పెహ్లువాయో (బి) రబాడ 30, షమీ (సి) రబాడ (బి) ఫిలాండర్ 8, ఇషాంత్ (సి) ప్లెసిస్ (బి) రబాడ 0, బుమ్రా నాటౌట్ 0; ఎక్స్‌ట్రాలు 26, మొత్తం 77 ఓవర్లలో 187 ఆలౌట్; వికెట్ల పతనం: 1-7, 2-13, 3-97, 4-113, 5-144, 6-144, 7-144, 8-163, 9-166, 10-187; బౌలింగ్: మోర్కెల్: 17-5-47-2, ఫిలాండర్: 10-10-31-2, రబాడ: 19-7-39-3, ఎన్‌గిడి: 15-7-27-1, పెహ్లువాయో: 7-1-25-2.

సౌతాఫ్రికా తొలి ఇన్నింగ్స్: ఎల్గార్ నాటౌట్ 4, మార్‌క్రమ్ (సి) పార్థివ్ (బి) భువనేశ్వర్ 2, రబాడ నాటౌట్ 0; మొత్తం 6 ఓవర్లలో 6/1; వికెట్ పతనం: 1-3; బౌలింగ్: భువనేశ్వర్: 3-2-3-1, బుమ్రా: 3-2-3-0.

హ్యాక్‌కు గురైన సిరాజ్ సోషల్ మీడియా అకౌంట్



హైదరాబాద్: హైదరాబాద్ యువ క్రికెటర్ మహ్మద్ సిరాజ్ సోషల్ మీడియా అకౌంట్‌ను వాచ్‌మన్ కుమారుడు, 14 ఏళ్ల కుర్రాడు హ్యాక్ చేశాడు. ఈ పేస్ బౌలర్ అకౌంట్ నుంచి అతని ఫ్రెండ్స్‌కు 'ఐ లవ్ యూ' అనే మెసేజ్ పెట్టడంతో హ్యాక్ విషయం బయటపడింది. దీంతో వెంటనే సిరాజ్ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఐ లవ్ యూ మెసేజ్‌లు ఎందుకు పెట్టావంటూ చాలా మంది స్నేహితులు ఫోన్ చేసి అడగడంతో తన ఇన్‌స్టాగ్రామ్ అకౌంట్ హ్యాకింగ్‌కు గురైందని సిరాజ్ తెలుసుకున్నాడు. హ్యాకర్ ఈ క్రికెటర్ పాస్‌వర్డ్‌ను కూడా మార్చేశాడు. ఇటీవల న్యూజిలాండ్‌తో జరిగిన మ్యాచ్‌తో సిరాజ్ టీ20ల్లో అరంగేట్రం చేసిన సంగతి తెలిసిందే. అయితే వెంటనే హైదరాబాద్ కమిషనరేట్‌లోని సైబర్ క్రైం పోలీసులకు తన అకౌంట్ హ్యాకింగ్ గురించి తెలిపాడు. సిరాజ్‌కు చెందిన సోషల్ మీడియా అకౌంట్లన్నీ (ఫేస్‌బుక్, ఇన్‌స్టాగ్రామ్, జిమెయిల్, ట్విట్టర్) హ్యాకింగ్‌కు గురైనట్టు సైబర్ క్రైం అధికారులు చెప్పారు. సిరాజ్ ఫిర్యాదు చేసిన వెంటనే రంగంలోకి దిగిన సైబర్ పోలీసులు హ్యాకర్‌ను కనుగొన్నారు. క్రికెటర్ పాస్‌వర్డ్ స్థానంలో తన పాస్‌వర్డ్‌తో లాగిన్ అవుతున్నట్టు తెలుసుకున్నారు. 'సిరాజ్ సోషల్ మీడియా అకౌంట్స్‌కు హ్యాకర్ తన ఫోన్ నంబర్‌ను లాగిన్ పాస్‌వర్డ్‌గా పెట్టుకున్నాడు. ఆ ఫోన్ నంబర్ బేగంపేట్‌లోని 14 ఏళ్ల కుర్రాడిదని తేలింది. ఇతని తండ్రి వాచ్‌మన్' అని దర్యాప్తు చేసిన పోలీసులు వెల్లడించారు. వెంటనే పోలీసులు ఈ పిల్లవాని ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యుల సమక్షంలో ప్రశ్నించారు. అయితే క్రికెటర్ సిరాజ్, తన సోదరుడు స్నేహితులని తెలిసింది. సిరాజ్ అకౌంట్‌ను ఎలా హ్యాక్ చేశాడో పోలీసులు ఆ కుర్రాడిని అడిగి తెలుసుకున్నారు.

బ్రెయిన్ ట్యూమర్‌తో బాధపడుతున్నా...

జట్టును గెలిపించిన పూనమ్

- సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్‌లో ఛత్తీస్‌గఢ్ యువతి



చెన్నై: ప్రస్తుతం ఇక్కడ జరుగుతున్న సీనియర్ నేషనల్ బాస్కెట్‌బాల్ చాంపియన్‌షిప్‌లో ఛత్తీస్‌గఢ్ యువతి తన ఆరోగ్యం సరిగా లేకపోయినా ప్రదర్శనలో ఏమాత్రం తేడా కనబరచలేదు. మంగళవారం ఇక్కడి నెహ్రూ స్టేడియంలో కర్ణాటకతో జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌కు ముందు ఛత్తీస్‌గఢ్ జట్టుకు చెందిన పూనమ్ చతుర్వేదీ తన ఆరోగ్యం సరిగా లేదని ఆవేదన చెందింది. అయినప్పటికీ 6 అడుగుల 11 అంగుళాల ఎత్తున్న ఈ యువతి తన జట్టును గెలిపించి ఫైనల్‌కు చేర్చింది. 2014లో ఈమెకు స్వల్ప బ్రెయిన్ ట్యూమర్ ఏర్పడింది. ఫలితంగా ఈమెకు తలనొప్పి వస్తుంది. మంగళవారం కూడా ఈమె తలనొప్పితో బాధపడుతున్నప్పటికీ మ్యాచ్ విన్నింగ్ 44 పాయింట్లు సాధించి జట్టు విజయంలో కీలకపాత్ర పోషించింది. 'ఈ మ్యాచ్ గురించి ఆలోచిస్తూ ముందు రోజు రాత్రి నిద్రపోలేదు. ఇది మాకు చాలా ముఖ్యమైన మ్యాచ్. ఎలాగైనా జట్టును గెలిపించాలి. అంతకుముందు మ్యాచ్‌లో నా ఆటపై సంతృప్తిగా లేదు. గత వారం రోజులుగా నా ఆరోగ్యం సరిగా లేదు. సెమీఫైనల్ మ్యాచ్ ఆద్యంతం నాకు తలనొప్పి ఉండింది. అందుకే నేను అప్పుడప్పుడు ఆడకుండా ఆగిపోయి ఊపిరి పీల్చుకున్నాను' అని మ్యాచ్ అనంతరం పూనమ్ తెలిపింది. భారత బాస్కెట్‌బాల్ జట్టులో రెగ్యులర్ ప్లేయర్‌గా కొనసాగుతున్న 22 ఏళ్ల పూనమ్ 2013 నుంచి రోజువారీ ఆయుర్వేదిక్ చికిత్స తీసుకుంటోంది. మంగళవారం నాటి ఆటలో కర్ణాటకకు చెందిన ఇద్దరు ముగ్గురు ప్లేయర్స్ పూనమ్‌ను చుట్టుముట్టినా ఆమెపై ప్రభావం చూపలేకపోయారు. ఇరు జట్ల ప్లేయర్స్ మధ్య ఆమె భారీ వ్యత్యాసంగా కనిపించింది. అంతేకాకుండా మొత్తం 40 నిమిషాలు ఆడింది.

జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించడంపై పూనమ్ భుజాలు ఎగరేసింది. 'నేను చేసిన 44 పాయింట్లు గొప్ప స్కోరేమీ కాదు. ఎందుకంటే జూనియర్ మ్యాచ్‌లో తాను గరిష్టంగా 67 పాయింట్లు చేశాను. నన్ను అడ్డుకునేందుకు కర్ణాటక చాలా మంది ప్లేయర్స్‌ను నాపైకి పంపినా నేను లెక్కలేయలేదు. నాకు ఆరోగ్యం బాగుంటే నన్ను ఆపడం ఎవ్వరి తరమూ కాదు' అని ఆమె చెప్పింది. నిజానికి ఉత్తరప్రదేశ్‌లోని కాన్పూర్‌కు చెందిన ఈ యువతి ఆరోగ్యంపై ఛత్తీస్‌గఢ్ జట్టు కోచ్ రాజేష్ పటేల్ స్పందిస్తూ.. పూనమ్ పూర్తిగా కోలుకోవాలని కోరుకుంటున్నట్టు చెప్పారు. 'పూనమ్ ట్రీట్‌మెంట్ తీసుకుంటున్న ఆరంభంలో ట్యూమర్ సైజు 3.6 ఎంఎంగా ఉండింది. అది ఇప్పుడు 2.1 ఎంఎంకు తగ్గింది. క్రమంగా తగ్గుతూ వస్తోంది' అని వివరించారు.

చంగ్ సంచలనం

- గ్రాండ్ శ్లామ్ సెమీఫైనల్‌కు చేరిన సౌత్ కొరియా తొలి ఆటగాడిగా రికార్డు
- మాడిసన్ కీస్‌కు చుక్కెదురు
- మహిళల సెమీఫైనల్లో కెర్బర్, హాలెప్
- రోజర్ ఫెదరర్ కూడా



మెల్బోర్న్: దక్షిణ కొరియా టెన్నిస్ ప్లేయర్ చంగ్ హియాన్స్ సంచలనం సృష్టించాడు. గ్రాండ్ శ్లామ్స్‌లో సెమీఫైనల్‌కు చేరిన తొలి దక్షిణ కొరియా ఆటగాడిగా రికార్డుల్లోకెక్కాడు. ఆస్ట్రేలియన్ ఓపెన్ టోర్నీలో భాగంగా బుధవారమిక్కడ జరిగిన క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో చంగ్ 6-4, 7-6 (5), 6-3తో అమెరికాకు చెందిన టెన్నిస్ సాండ్‌గ్రెన్‌ను వరుస సెట్లలో ఓడించాడు. సన్‌బాత్‌ను తలపించే విపరీతమైన ఎండలో కళ్లద్దాలు ధరించిన క్లార్క్ కెంట్‌ను తలపించాడు. కానీ సూపర్ మాన్‌లా ఆడాడు. 2004లో మారట్ సఫిన్ తర్వాత ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో సెమీస్‌కు చేరిన అతి తక్కువ ర్యాంక్ ఆటగాడిగా కూడా చంగ్ నిలిచాడు. చంగ్ ర్యాంక్ 58. పురుషుల విభాగంలో జరిగిన మ్యాచ్‌లో రోజర్ ఫెదరర్ 7-6 (7-1), 6-3, 6-4తో థామస్ బెర్డిచ్‌పై వరుస సెట్లలో గెలుపొందాడు. దీంతో సెమీఫైనల్లో ఫెదరర్‌తో చంగ్ హియాన్స్ తలపడతాడు. ఇక మహిళల విభాగానికొస్తే 2016 చాంపియన్ ఏంజెలిక్ కెర్బర్ సెమీఫైనల్‌కు చేరుకుంది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో 6-1. 6-2తో మాడిసన్ కీస్‌పై గెలిచింది. మరో మ్యాచ్‌లో వరల్డ్ నంబర్ వన్ సీమోనా హాలెప్ కూడా సెమీఫైనల్ బెర్త్ సంపాదించింది. క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌లో హాలెప్ 6-3, 6-2తో ఆరో సీడ్ కరోలినా ప్లిస్కోవాను చిత్తు చేసింది.


కెర్బర్


ఫెదరర్

Printed and Published by VUPPARI RAMESH KUMAR on behalf of Navatharam publications private limited, Printed at JAGATI PUBLICATIONS LIMITED, Sakshi Press, Survey No:127, Plot No:12, Mallapur Village, Nacharam, Medchal District.Telangana state and Published From H.No:6-3-864/4/B, SBN Arcade,4th&5th Floor, Green lands, Opp: Green Park Hotel, Hyderabad - 500016 Telangana State, EDITOR: VUPPARI RAMESH KUMAR. RNI Reg No.TELTEL/2016/72952. Phone No.040-46519999. E-mail Id. manamtelugudaily1@gmail.com.